సంపుటి : 4
సంచిక : 3
పుటలు : 52
రు. 20 లు
తెనాలి


1993 నుంచి 2013 వరకు వెలువడిన **నడుస్తున్న చరిత్ర** కు నేటి రూపం

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

నుడి నాడు నెనరు

మే 2018



లలిత గీతాల తోటకు పాదులు వేసి
తెలుగు పాటకు అందమైన నడక నేర్పిన...
తొలితరం ఆధునిక వాగ్గేయకారుడు
బాలాంత్రపు రజనీకాంతారావు

మాతృభాషను కోల్పోతే ఉపాధి, ఉద్యోగ అవకాశాలకు ముప్పు

Bommidala
International

# బొమ్మిడాల ఇంటర్నేషనల్ ప్రై.లిమిటెడ్

భారత ప్రభుత్వ గుర్తింపు పొందిన ఎగుమతి సంస్థ

బి.టి.సి.హౌస్, ఐదవ వీధి
చంద్రమౌళినగర్, గుంటూరు-522 007

Tel :91-863-2357615, 2357616
Fax : 91-863-2351343
E mail : murtybsk@bommidalainternational.com
bskmurty@yahoo.co.in
Website : www.bommidalainternational.com

- తెలుగు అభివృద్ధి, సాధికారతల కోసం...
- తెలుగు భాషోద్యమ నిర్మాణం కోసం...
- ఆంధ్ర, తెలంగాణ, ఇతర రాష్ట్రాలు, విదేశాల్లోనూ ఉన్న తెలుగువారి కోసం...


తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

సంపాదకుడు : డా॥ సామల రమేష్‌బాబు

తోడ్పాటు : డా॥ గారపాటి ఉమామహేశ్వరరావు, డా॥ వెన్నిసెట్టి సింగారావు, డా॥ సుందర్ కొంపల్లి, రహ్మనుద్దీన్ షేక్, సరస్వతుల రామనరసింహం(సరసి), తమ్మా శ్రీనివాసరెడ్డి




**మే 2018**

## రచయితలకు సూచనలు

తెలుగు భాష, సాహిత్యం,సాంస్కృతికతలతో పాటు తెలుగువారి చరిత్రకూ, సంస్కృతికీ, సాధికారతకూ, ప్రగతికీ చెందిన సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలపై రచనలకు స్వాగతం. వ్యాసం, కథ, వచన కవిత, పాట –రచనను ఏ రూపంలో నైనా పంపవచ్చు.

1. వ్యాసాలు ముద్రణలో 1 నుండి 3 పుటలకు మించకూడదు. కథ 3 పుటలకు మించకూడదు. కవితలు 20 నుంచి 30 పంక్తులకు మించకూడదు. విమర్శలు విషయం పైనే ఉండాలి గాని వ్యక్తులపై గురిపెట్టి చేయరాదు. సరళమైన తెలుగులో వ్రాయాలి.

2. రచనలను యూనికోడ్‌లో గాని, అనుఫాంట్స్‌లో గాని టైప్ చేసి పి.డి.ఎఫ్ మరియు పి.ఎం.డి. రెండింటిలోనూ పంపాలి. లేదా ఎ4 సైజు కాగితంపై వ్రాసి, స్కాన్ చేసి *editorammanudi@gmail.com* కు పంపాలి. కొరియర్ / రిజిష్టర్డ్ / సాధారణ పోస్టులో కూడా పంపవచ్చు.

3. రచనతో పాటు పోస్టల్ చిరునామా, ఫోన్ నంబరు, ఉంటే ఇ-మెయిల్ చిరునామా కూడా ఇవ్వాలి. ఈ వివరాలు లేని రచనల్ని తీసుకోలేము.

4. రచన స్వంతమేనని, ఇతర పత్రికలకుగాని, ఇంటర్నెట్ పత్రికలకుగాని పంపలేదని, ఇంతవరకు ఎక్కడా ప్రచురణ కాలేదని హామీ పత్రాన్ని తప్పనిసరిగ పంపాలి. ముందుగా సోషల్ మీడియాలో పెట్టిన రచనలను ప్రచురణకు స్వీకరించ లేము.

వలగూడు (ఇంటర్నెట్)లో *www.ammanudi.org* చూడండి.

## లోపలి పుటలలో....


| | | | |
|---|---|---|---|
| **శ్రద్ధాంజలి :** | బాలాంత్రపు రజనీకాంతరావుగారు | | **5** |
| **అట్టమీది బొమ్మ :** | రజనీబాణి...లలితసంగీత వాణి | **ఓలేటి శ్రీనివాసభాను** | **6** |
| **సంపాదకహృదయం :** | ఎన్నికలొస్తున్నాయి.... | | **7** |
| **కంప్యూటర్లు – తెలుగు :** | తెలుగు భాషకు ఆధునిక హోదా – 4.... | **వీవెన్** | **9** |
| **మాతృభాషలు :** | అమ్మనుడులను రక్షించుకోవడానికై.... | **డా॥సామల రమేష్‌బాబు** | **10** |
| **న్యాయస్థానాలలో తెలుగు :** | న్యాయస్థానాల్లో ప్రజల మాతృభాషలు.... | **బి.హనుమారెడ్డి** | **14** |
| **లిపి సంస్కరణ – చర్చ :** | రంగనాయకమ్మగారి ప్రతిపాదనలు | **ఆచార్య కస్తూరి విశ్వనాథం** | **15** |
| **మరణ వాగ్మూలం :** | మరణం లేని మహనీయుడు | **డా॥ వేదగిరి రాంబాబు** | **22** |
| **యక్షగానం :** | కృష్ణాతీర ప్రాంతాల్లో యక్షగానం. | **డా॥ జె.వి.సత్యవాణి** | **29** |
| **గొప్ప పండితుడు :** | తెలుగు వాళ్లు మరిచిపోయిన... | **డా॥ కాళిదాసు పురుషోత్తం** | **33** |
| **సాహిత్యరంగం :** | వైజ్ఞానిక కథలు | **డా॥ మధురాంతకం నరేంద్ర** | **35** |
| **భాషోద్యమం :** | వాడని భాష వాడిపోతుంది... | | **44** |
| **భాషోద్యమం :** | మాతృభాష వినియోగాన్ని... | **సంకేపల్లి నాగేంద్ర శర్మ** | **45** |
| **పిట్ట చూపు :** | టాలీవుడ్‌లో సంచలనం.... | **చలసాని నరేంద్ర** | **47** |
| **మన రాజులు వారి బిరుదులు :** | రాష్ట్రకూటుల సామంతులు | **డా॥ ఈమని శివనాగిరెడ్డి** | **49** |


**ధారావాహికలు :**


| | | | |
|---|---|---|---|
| **1. మౌనంలోని మాటలు 7 :** సంచారి రావోళ్ళ నాగప్ప ఆత్మకథ | | **– ఆర్.బి.కుమార్,రం.రామచంద్రరావు** | **24** |
| **2. బౌద్ధం-వైజ్ఞానిక మార్గం -13** | ..... | **బొర్రా గోవర్ధన్** | **37** |


**భాషోద్యమ కథానికలు :**


| | | | |
|---|---|---|---|
| **1. జూసి** | ..... | **సద్లపల్లి చిదంబర రెడ్డి** | **20** |
| **2. మన కర్తవ్యం** | | **వాణిశ్రీ** | **42** |


**కవితలు :**


| | | |
|---|---|---|
| 1. అమ్మ చెప్పింది | **గుర్రాల రమణయ్య** | **19** |
| 2. నాకు మాత్రం తెలీదా | **కరణం కళ్యాణ్ కృష్ణకుమార్** | **50** |
| 3. అమ్మభాష అమృతం | **వద్దాల కిషన్** | **50** |



ముఖచిత్రం:**తమ్మా శ్రీనివాసరెడ్డి** కంప్యూటరీకరణ:**లంకె జనార్దన్**

కార్టూన్లు:**సరసి,శేఖర్** రేఖా చిత్రాలు :**పి.చిదంబరం**



రచనలు, ఉత్తరాలు పంపుటకు చిరునామా:

సంపాదకుడు: **అమ్మనుడి**, జి-2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి, మాచవరం,విజయవాడ-520004.

కార్యాలయం : *0866-2439466* సంపాదకుడు : *9848016136* *e-mail* : editorammanudi@gmail.com



రచయితల అభిప్రాయాలు వారి స్వంతం. వారితో పత్రిక యాజమాన్యం, సంపాదకుడు ఏకీభవించవలసిన అవసరం లేదు.

తెలుగుజాతి పత్రిక
# అమ్మనుడి
మాసపత్రిక
నుడి - నాడు - నెనరు


## చందా వివరాలు

| | | వ్యక్తులకు | సంస్థలకు | విదేశీయులకు |
|---|---|---|---|---|
| శాశ్వత చందా | : | రూ.5000 | రూ.7500 | -- |
| 5 సం॥ | : | రూ.1000 | రూ.1500 | 150 డాలర్లు |
| 3 సం॥ | : | రూ. 700 | రూ.1000 | 75 డాలర్లు |
| 1 సం॥ | : | రూ. 240 | రూ. 400 | 25 డాలర్లు |

ఎం.ఓ. లేదా తెనాలిలో చెల్లునట్లు బ్యాంకు డి.డి.ని **'అమ్మనుడి'** పేర పంపాలి. చెక్కు పంపేట్లయితే దయచేసి అదనంగా రు.30 లు చేర్చి పంపండి.

ఆన్‌లైన్ ద్వారా చందాను పంపేవారు NEFT / RTGS ద్వారా **'అమ్మనుడి'**-యాక్సిస్ బ్యాంకు, తెనాలి శాఖకు పంపాలి.

**AMMA NUDI - AXIS BANK, TENALI**

అకౌంట్ నెం. **915020010550189**

**IFSC Code : UTIB0000556**

ఆన్‌లైన్‌లో చందాను పంపినవారు, ఆ వెంటనే దయతో - చిరునామా, ఫోన్ నెం. తదితర వివరాలను జాబుద్వారాగాని, ఫోన్ మెసేజి ద్వారాగాని తెలుపగలరు.

చందాలు పంపడం, దానికి సంబంధించిన ఉత్తర ప్రత్యుత్తరాలకు చిరునామా


**డా॥ సామల లక్ష్మణబాబు,** ప్రచురణకర్త, 'అమ్మనుడి'
8-386, జీవక భవనం, అంగలకుదురు పోస్టు, **తెనాలి**
గుంటూరు జిల్లా - 522 211. ఫోన్ : 9440448244
ఇ-మెయిల్ : ammanudi2015@gmail.com


**చందాదారులు కోరినట్లయితే ఆన్‌లైన్‌లో కూడా పత్రికను పంపగలము. ఇందుకోసం మీ ఇ-మెయిల్ ఐడిని తప్పక తెలుపగలరు.**

### చందాదారులకు సూచనలు

1. చందా కాలం ముగింపు తేదీ - పత్రిక కవరుమీద మీ చిరునామా పై భాగంలోనే ఉంటుంది. గమనించండి.
2. చందా పూర్తయ్యేందుకు ఒక నెల ముందే దయచేసి మీ చందాను పంపించండి.
3. మీ ఇంటి నెంబరుతో పూర్తి చిరునామాను, పిన్‌కోడ్ నెంబరుతో సహా తెలియపరచాలి. మీ ఫోన్ నెంబరును, వుంటే మీ మెయిల్ ఐడి ని తెలపాలి.
4. మీ చిరునామా మారినట్లయితే దయచేసి వెంటనే తెలియజేయండి.

**'అమ్మనుడి'** ఈ క్రిందిచోట్ల కూడ లభిస్తుంది

**నవోదయ బుక్ హౌస్,** ఆర్యసమాజ్ భవనం ఎదురుగా, కాచిగుడా. **హైదరాబాదు - 27.** ఫోన్ :040-24652387

**మైత్రీ బుక్‌హౌస్,** జలీల్ వీధి, కార్ల్‌మార్క్స్‌రోడ్డు (ఏలూరు రోడ్డు) **విజయవాడ - 2.** ఫోన్ : 9866211995

**మణి బుక్‌స్టాల్,** షాప్ నెం.58, సండేమార్కెట్, **నెల్లూరు**-1. ఫోన్:7386223538.

## హెచ్చరిక

'అమ్మనుడి' పత్రిక సిసి-బై-ఎస్ఎ లైసెన్సు (క్రియేటివ్ కామన్స్ - అట్రిబ్యూషన్ షేర్ అలైక్) లో ప్రచురితమవుతున్నది. దీని ప్రకారం ఈ పత్రికలో ప్రచురించిన వాటిని తిరిగి స్వేచ్ఛగా ఎవరైనా తమ రచనల్లో వినియోగించుకొని స్వయంగా గాని, ఇతరుల ద్వారా గాని, సోషల్ మీడియాలో గాని వాటిని ప్రచురించు కోవచ్చు. అయితే, ఆ సందర్భంలో - ఆ తొలి రచయిత పేరును, 'అమ్మనుడి' ఫలానా సంచిక నుండి తీసుకున్నట్లు తప్పక ఉటంకించాలి. దయచేసి ఈ అంశాన్ని రచయితలు, ప్రచురణ కర్తలు, చదువరులు గమనించ గోరుతున్నాము

అమ్మభాష తెలుగును కాపాడుకొనే ఉద్యమంలో భాగంగా భాషాప్రాధాన్యతను తెలిపే

## కథానికలకు ఆహ్వానం

ఈ వేగయుగంలో క్లుప్తతకి ప్రాధాన్యమిస్తూ బుల్లెట్లలా పాఠకుల మెదళ్ళని తాకి కదిలింపజేసి ఆలోచనలలో ముంచెత్తేట్టు చేయగల బలమైన సాహిత్యప్రక్రియ కథానిక. కథ వస్తువైతే, దానిని కళాత్మకంగా మలచి చెప్పే ప్రక్రియ కథానిక. దీనిని చదవడానికి పట్టే సమయంకన్నా ఆలోచింపజేసే సమయం ఎక్కువ. అందుకే అమ్మభాష ప్రాధాన్యం అన్ని కోణాలలో అందరి మనసులలో నాటుకునేట్టు చెప్పే కథానికల్ని వరుసగా **అమ్మనుడి**లో ప్రచురించాలని సంకల్పించాం.

ప్రభుత్వ పరిపాలనలో, కోర్టు వ్యవహారాల్లో, నిత్యజీవితంలో తెలుగును కోల్పోతున్నందువల్ల జరిగే నష్టాల్ని కథావస్తువులుగా తీసుకోవచ్చు. అన్నిటికీ మించి విద్యారంగంలో తెలుగును సమూలంగా అణచివేస్తున్నందువల్ల కలిగే నష్టాల్ని చిత్రిస్తూ కథానికలను వ్రాయవచ్చు. ఈ కోణాల్లో ఆలోచిస్తే రచయితలకు ఎన్నో కథాంశాలు కన్పిస్తాయి. 'అమ్మనుడి'లో ప్రచురిస్తున్న వ్యాసాల్లో ఇలాంటి అంశాలను గ్రహించవచ్చు. ఇందుకు రచయితల, రచయిత్రుల సహకారాన్ని కోరుతున్నాము. ప్రచురించే ప్రతి కథానికకు గౌరవ పారితోషిక పంపబడుతుంది.

- కథానిక ప్రచురణలో 2నుండి 4 పుటలకు మించకుండా ఉంటే మంచిది. ప్రతినెలా 1 లేక 2 కథానికలను మాత్రం ప్రచురించగలం.
- ప్రముఖ కథానికారచయిత **డా. వేదగిరి రాంబాబు** ఈ శీర్షికను **అమ్మనుడి** కోసం నిర్వహిస్తున్నారు.


సంపాదకుడు, **అమ్మనుడి,** జి-2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి, మాచవరం, విజయవాడ-520 004. కార్యాలయం ఫోన్ : 0866-2439466. సంపాదకుడు : 9848016136. e-mail : editorammanudi@gmail.com

శ్రద్ధాంజలి

# బాలాంత్రపు రజనీకాంతరావుగారు



శ్రీ బాలాంత్రపు రజనీకాంతరావు
(29 జనవరి 1020–22 ఏప్రిల్ 2018)

నవంబరు1, 2002 : శ్రీకాకుళం...నేటి కృష్ణాజిల్లాలో నదీ తీరాన ఉన్న చిన్నగ్రామం. ఒకనాటి తొలి ఆంధ్ర రాజధానీ నగరం. తెలుగు కోసం రాష్ట్రం నలు మూలల నుండీ పెద్దలు కదలి వచ్చి శ్రీకాకుళంలోని ఆంధ్రమహా విష్ణు దేవాలయ ప్రాంగణంలో సమావేశమైనారు. అలా సమావేశమైన ప్రముఖుల్లో ఒకరు వాగ్గేయకారులు బాలాంత్రపు రజనీకాంతరావుగారు. రెండు రోజుల పాటు జరుగనున్న ఆ 'తెలుగు భాషోద్యమ సమాలోచన శిబిర' ప్రారంభ సభలో ఎంతో ఉద్విగ్నుడైన బాలాంత్రపు రజనీగారు మాట్లాడుతూ – "ఆంధ్రులకు ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన రోజున నేనిలా వ్రాశాను, ఆలపించాను. తెలుగువారు పులకాంకితులైన ఆ పాటను పాడుతున్నాను వినండి...' అంటూ గొంతెత్తి ఆలపించసాగారు. నిండైన సభ నిశ్శబ్దమై విన్న ఆ పాట ఇది.

ముక్కోటీ కంఠాలూ ఒక్క పొంగున మ్రోగాయి
ఒక్కటే జయనాదంతో దిక్కులూ మార్మ్రోగాయి

ఎక్కడెక్కడి తెలుంగులూ ఒక్కటే మేమన్నారూ
ఎక్కడున్నా ఆంధ్ర సరస్వతి ఒక్కటే తెలుగన్నారూ ॥ ము॥

ఒక్కటే మా సాహిత్యం ఒక్కటే మా సంగీతం
ఒక్కటే మా శిల్పకళా ఒక్కటే మా వేదాంతం ॥ ము॥

భారత జననీ ప్రియపుత్రీ ఆంధ్రప్రదేశ జనయిత్రీ
కొలువునకూ రారండోయ్ తలపూవులతోమొక్కండోయ్ ॥ము॥

ఒక కొత్త చరిత్రకు శ్రీకారం చుట్టిన ఆ సభ అలా ఆ వాగ్గేయకారుని ఆశీస్సులతో మొదలైంది. నడుస్తున్న తెలుగు భాషోద్యమం ఆయనకు ప్రియతమమైన అంశాల్లో ఒకటి.

ఆ మహానుభావుడు తన 98వ ఏట ఈనెల – ఏప్రిల్ 22న తనువు చాలించారు.


సంగీత సాహిత్యాలకు సంబంధించి బాలాంత్రపు రజనీగారి దొక చరిత్ర. ఆ చరిత్ర కాలంలో ఆయనతోపాటు మరికొందరు చరిత్రాత్మక వ్యక్తులు కూడా తెలుగువారి కీర్తి ప్రతిష్ఠలను పెంచారు. అయినా, బాలాంత్రపు రజనీగారి ప్రత్యేకతకు సరిసాటి అని పేర్కొన డానికి మరొక పేరుకోసం వెతకలేం. అటువంటి విశిష్టత రజనీగారిది.

'నడుస్తున్న చరిత్ర' పత్రికను చదివి కొన్ని సందర్భాల్లో ఆయన స్పందించారు. ఆశీర్వదించారు. పూర్తిగా తన జీవితాన్ని సంగీత సాహిత్యాల మాధుర్యంతోనూ, సౌందర్యంతోనూ నింపుకొని, 'కాలం చేసిన' రజనీ కాంతరావుగారికి మా శ్రద్ధాంజలి

– సంపాదకుడు, 'అమ్మనుడి'



తెలుగువారంతా చదువవలసిన పుస్తకాలు

స.వెం.రమేశ్ రచన




ఎల్లలు లేని తెలుగు
వెల : రు.200/–లు

ఆచార్యశ్రీగారపాటి ఉమామహేశ్వరరావు రచనలు




తెలుగు రాష్ట్రాలలో భాషా సంక్షోభం
వెల :రు. 100/–




ద్రావిడ, మంగోలు భాషల జన్యుసంబంధం
వెల : రు.350/–

రచయితలు, భాషోద్యమకారులు, ఉపాధ్యాయులు, పరిశోధకులు, ఆసక్తిగల వారంతా ఈ రచనలను చదివి ప్రయోజనం పొందగోరుతున్నాము

పుస్తకాల వెలను ఎం.ఒ చేస్తే పుస్తకాలను కొరియర్ / రిజిస్టర్డ్ బుక్ పోస్ట్‌లో పంపిస్తాము.

తెలుగుజాతి(ట్రస్టు) – జీవక భవనం, 8–346, అంగలకుదురు పోస్టు తెనాలి–522211, ఫోన్ : 9440448244



# రజనీ బాణి... లలితసంగీత వాణి

నదిలో నీళ్ళుంటాయి. అవి పొలాలను తడపాలంటే దారిచూపించాలి. కాలువలు తవ్వి నీళ్ళను మళ్ళించాలి. కళా వికాసం కూడా అలాంటిదే. దాన్ని హృదయాలకు చేరువగా తీసుకెళ్లాలంటే ఎవరో ఒకరు పూనుకోవాలి. రేపటి పచ్చదనం కోసం పలుగు, పారలు పట్టాలి. గరిక లేని పొలాల్లో మరకతాలు నాటాలి. వారిని వైతాళికులుగా గుర్తించి జాతి జేజేలు పలుకుతుంది. ఈ కోవకు చెందిన మహనీయులు బాలాంత్రపు రజనీకాంతారావు. ఆయన తెలుగు పాటకు అందమైన నడక నేర్పారు. లలిత గీతాల తోటకు పాదులు వేసిన తొలితరం ప్రముఖుడిగా చరిత్రలోనూ,ఆధునిక వాగ్గేయకారుడి గా తెలుగు వారి హృదయాల్లో నిలిచిపోయారు.

రంగస్థల బాణీలే చలనచిత్రాల్లో వినిపించిన దశలో రంగప్రవేశం చేసిన రజనీకాంతారావుతెలుగు పాటకు లాలిత్యాన్ని నేర్పారు. పదకర్త,స్వరకర్త రెండూ తానై, భారతీయ సంగీత పద్ధతులకు పాశ్చాత్య స్వర వైచిత్రిని జోడించి ఒకవైపు ఆకాశవాణి లోనూ, మరోవైపు చలనచిత్రాల్లోనూ సరికొత్త వాగ్గేయ కర్తృత్వాన్ని సమర్థంగా నిర్వహించారు. పాట పక్షిలాగా ఎగరాలంటే దాని రెక్కలకు బరువైన మాటల నగల్నీ, నగిషీల్నీ బలవంతంగా తొడగకూడదని అన్నదేవులపల్లి మాటలు నిజం చేశారు బాలాంత్రపు రజనీకాంతారావు. ఆయన సారథ్యం లో వెలువడిన – తొలినాటి సినిమా పాటలు, ఆకాశవాణి భక్తిరంజని, లలితగీతాలు, అలాగే ప్రైవేటు రికార్డులు రజనీ స్వర, సాహిత్యసంతకాలుగా నిలిచిపోయాయి. ఎమ్మెస్ సుబ్బలక్ష్మి, బాలమురళీ కృష్ణ, నాగయ్య, రావు బాలసరస్వతీదేవి, ఎస్.రాజేశ్వరరావు, ఘంటసాలలాంటి వారి గళాలు రజనీ సంగీత, సాహిత్యాలతో రాజిల్లినవే. రజనీకాంతారావు ఆకాశవాణి లో తానుగా ఆలపించిన 'సూర్యస్తుతి' నేపథ్యంలో తూర్పు సంద్రం లో తొంగి చూసిన సుప్రభాతాలు ఎన్నో!

ఆయన పాటలంటే కళాత్మక చిత్ర దర్శకుడు బి.ఎన్.రెడ్డి కి ఎంతో మక్కువ. అప్పటి మద్రాసు 'ఆల్ ఇండియా రేడియో' లో ప్రాచుర్యం పొందిన 'గీతావళి' కార్యక్రమం లో రజనీకాంతారావు రచించి, స్వరపరచిన' స్వామీ నీ ఆలయమున' గీతానికి బి.ఎన్. వీరాభిమాని. రోజూ రేడియో కార్యక్రమాలు వింటూ అందులో తనకు నచ్చిన కళాకారుల్ని ఆయన అభినందించేవారు. తన చిత్రాల్లో అవకాశామిచ్చేవారు. 'షావుకారు'జానకి గొంతును రేడియోలో విని ఆమెను విజయా సంస్థకు బి.ఎన్. రెడ్డి పరిచయం చేయడం ఇందులోని భాగమే. అప్పట్లో ఆయన 'స్వర్గసీమ' చిత్రాన్ని నిర్మిస్తూ, అందులో ఓ సన్నివేశం కోసం రజనీ చేత 'ఓహో పావురమా..' పాట రాయించి, స్వరకల్పన చేయించారు. నాగయ్య సంగీత దర్శకత్వం లో భానుమతి పాడిన ఆ పాట ఎంతో ప్రాచుర్యం పొందింది. (ప్రముఖ నటుడు శివాజీ గణేశన్‌కి ఈ పాట ఎంతో ఇష్టమంటారు) దీనితోపాటు 'ఋష్యశృంగ' రూపకం,'హాయి సఖీ', 'గృహమే కదా స్వర్గ సీమ', 'ఎవని రాకకై' గీతాల్ని రజనీయే రాసి, స్వరపరచారు. వీటిలో'ఎవని రాకకై..' పాటను ఆయన స్వయంగా ఆలపించారు. ఉద్యోగ నిబంధనల వల్ల రచయితగా తన సోదరుడు నళినీ మోహనరావు పేరును, స్వరకర్త గా నాగయ్య పేరునూ తెర మీద వేయాల్సివచ్చిందట.

'స్వర్గసీమ' ద్వారా గాయకుడిగా పరిచయమైన ఘంటసాల సైతం రజనీకాంతారావు ప్రోత్సాహం తోనే ఆల్ ఇండియా రేడియో లో పాడుతూ పేరు గడించారు. తర్వాతి దశలో ఆయనతో కలసి సినిమాల్లో పనిచేశారు కూడా. శోభనాచల అండ్ ఎం.ఆర్.ఎ వారి'లక్ష్మమ్మ' చిత్రానికి'తారానాథ్' పేరుతో పాటలు రాసి, స్వరాలు సమకూర్చిన రజనీ కాంతారావు రికార్డింగు సమయానికి అనారోగ్యం పాలవటంతో ఆయన వద్ద బాణీలను నేర్చుకుని ఘంటసాల ధ్వనిముద్రణ కార్యక్రమాన్ని నిర్వహించారట. అందులో'చిన్ననాటి స్వప్న సీమ', 'అటో..ఇటో ఎటు పోవుటో', 'దిగు దిగు నాగా ...' పాటలు ప్రజాదరణ పొందాయి. కారణాంతరాల వల్ల సంగీత దర్శకుడిగా తెర పై ఘంటసాల పేరు కనిపించింది.'లక్ష్మమ్మ'చిత్ర దర్శకుడైన ప్రముఖ రచయిత గోపీచంద్ రజనీకి మిత్రుడు. ఇద్దరూ కలసి ఎల్వీ ప్రసాద్ నటించి,దర్శకత్వం వహించిన 'గృహప్రవేశం' చిత్రానికి తొలిసారి పనిచేశారు.ఇందులో రజనీ 'నళినీకాంతారావు'పేరుతో పాటలు రాసి, సంగీతం సమకూర్చారు. ప్రసిద్ధ సంగీత దర్శకుడు పెండ్యాల నాగేశ్వరరావు ఇందులో రజనీ కి సహాయకుడిగా పనిచేశారు. ఇందులో 'హాలాహల మెగయునా', 'అమ్మా..అమ్మా', 'మైడియర్ తులసమ్మక్కా..' పాటలు బహుళ ప్రజాదరణ పొందాయి. తర్వాతి దశలో 'రాజమకుటం' కోసం ఆయన రాసి, స్వరపరచిన 'ఊరేది పేరేది ఓ చందమామా' రజనీ స్థాయిని చాటి చెప్పింది.ఒకవైపు ఆకాశవాణి కార్యక్రమాల రూపకల్పన, మరో వైపు తొలినాటి సినిమా సంగీత స్వరకల్పనల ద్వారా తెలుగు పాటకు రంగు, రుచి, వాసన కల్పించిన రజనీ చిరస్మరణీయుడు.

ఓలేటి శ్రీనివాసభాను
9440567151

సంపాదకీయం

# ఎన్నికలొస్తున్నాయి...చెయ్యవలసిందేమిటి?

మరొక్క ఏడాదిలో మళ్ళీ సాధారణ ఎన్నికలొచ్చేస్తున్నాయి. లోక్‌సభ ఎన్నికలతో పాటే రెండు తెలుగు రాష్ట్రాల శాసన సభలకూ ఎన్నికలు జరుగబోతున్నాయి. ప్రజా జీవనానికి సంబంధించిన సమస్యలు చర్చకొస్తాయి. వాటిని పక్కకుపెట్టి, లేదా వాటికి తగిన ప్రాధాన్యత లేకుండా చేసి, 'రాజకీయ' అంశాలను ముందుకు తెచ్చి, ఎన్నికల్లో గెలుపొంది అధికార పీఠాన్ని చేజిక్కించుకోవడమే లక్ష్యంగా రాజకీయ పక్షాలు తమ వ్యూహాలకు పదను పెట్టుకొంటాయి.

ప్రజాస్వామ్యంలో ప్రజల సాధికారతకు దారులను తీర్చేవి ఎన్నికలే. ఒక నియమిత కాలానికి జరిగే ఎన్నికల వల్ల అధికార పీఠాల్లో ప్రజా ప్రతినిధులు నిలదొక్కుకొని, మొత్తం పాలనాయంత్రాంగాన్ని తమ చెప్పుచేతల్లోకి తెచ్చుకోగలుగుతున్నారు. శాసన నిర్మాణ వ్యవస్థను, కార్యనిర్వాహక వ్యవస్థను శాసించగలుగుతున్నారు. రాజకీయ పార్టీలు, వాటి నేతలు మొత్తం అధికారాన్ని స్వంతం చేసుకొని, ప్రజాస్వామ్యాన్ని అన్ని విధాలా మోసం చేస్తున్నారు. ప్రజల భాషలో పరిపాలన జరుగకపోవడం ఇందుకు కారణం. ప్రజల ఓట్ల ద్వారా ఎన్నికయ్యే కొద్ది మంది వ్యక్తులు, వారి పార్టీలు – ఏ స్థాయిలోనూ ప్రజల మాటకు చెల్లుబాటు సాగని విధంగా మొత్తం పాలనను తల క్రిందులు చేశారు. ప్రజల భాషకు సాధికారత లేకపోవడమే ఇందుకు కారణం. భాషా రాష్ట్రాలు ఏర్పడి 60 ఏళ్ళు దాటిపోయినా ఈ పరిస్థితులు నెలకొనడానికి బాధ్యత మొత్తంగా పాలక వర్గాలదీ, సైద్ధాంతిక భూమికను, ఆశయాలనూ విడిచి గాలిలో సాముగరిడీలు చేస్తున్న రాజకీయ పక్షాలదీ.

మళ్ళీ ఎన్నికలొస్తున్నాయి గనుక – ఈ వ్యవధిని రాజకీయ పక్షాలను చైతన్యవంతుల్ని చేయడానికీ, వారి ముందు స్పష్టమైన ప్రణాళికను పెట్టి – రానున్న ఎన్నికలకు వారు ప్రకటించనున్న వాగ్దానాల పత్రాల్లో (మానిఫెస్టోల్లో) మన డిమాండ్లకు కూడా వారి ఒప్పుదల సాధించడం – ఇదీ ఇప్పుడు భాషోద్యమం ముందున్న తక్షణ కార్యక్రమం.

గత మూడు సార్వత్రిక ఎన్నికలకు ముందు తెలుగు భాషోద్యమ సమాఖ్య కొన్ని స్పష్టమైన డిమాండ్లను రాజకీయ పక్షాల ముందుంచ గలిగింది. ముఖ్యంగా 2009, 2014 ఎన్నికల ముందు నిరసన కార్యక్రమాలనూ, సత్యాగ్రహాల్ని చేపట్టి పార్టీల నేతలను రప్పించుకొని బహిరంగంగా వారి నుండి వాగ్దానాలను రాబట్టింది. భాషా మంత్రిత్వశాఖ, తెలుగు అభివృద్ధి ప్రాధికార సంస్థ ఏర్పాటుకోసం జరుగుతున్న కృషి – ఆ ఉద్యమాల ఫలితంగా సాధించినవే.

ఇప్పుడు మనం ప్రధానంగా చూపు సారించవలసినవి రెండు అంశాలు. 1. తెలుగుకు అన్ని రంగాల్లో, అన్ని దశల్లో పూర్తి సాధికారతను సాధించడం 2. తెలుగును ఒక మాతృభాషగా – బోధనా మాధ్యమంగా కనీసం ప్రాథమిక విద్య వరకైనా తప్పనిసరి చేయించడంతోపాటు, పాఠశాల విద్యనంతా తెలుగు మాధ్యమంలో చదివేందుకు ప్రభుత్వ పాఠశాలల్ని అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేయడం.

మొదటి అంశాన్ని వివరించుకొందాం :

ఎన్నికల్ని తెలుగులో నిర్వహించుకొంటున్నట్లే లెఖ్ఖ. అది తప్పనిసరి. లేకపోతే ప్రజలు పూర్తిగా ఎన్నికల ప్రక్రియకే దూరమవుతారు. కనుక ఎన్నికల వాగ్దానాల్ని కుప్పించడం దగ్గర నుండి ఫలితాల దాకా ప్రజల భాషే గతి. ఆ తర్వాత మొదలవుతుంది – ప్రజలను వంచించడం. వారి భాషను వంచించడంతో ఈ మోసం అంచెలంచెలుగా విజృంభిస్తుంది. శాసన నిర్మాణ వ్యవస్థలో – ప్రతిపాదనల దశనుండి చట్టం వెలువడేదాకా – అంతా ఇంగ్లీషులోనే!

దీన్నంతా మార్చాలి. తెలుగులో వచ్చే చట్టమే సాధికార ప్రతి అవ్వాలి. దాని ఆంగ్ల ప్రతి ఇతర అవసరాల కోసం ఎటూ ఉంటుంది. ఆ చట్టాలు, జి.ఒ.లు అన్నీ సచివాలయ స్థాయి నుండి గ్రామ పంచాయితీ దాకా అమలు అయ్యే ప్రక్రియ అంతా ప్రజల భాష తెలుగులోనే జరగాలి. ప్రభుత్వ స్థాయిలో ఇదంతా సరిగా జరగడం లేదు. ముఖ్యమంత్రులు ఇద్దరికీ ఈ విషయంలో పట్టుదల లేదు. కారణం – వారూ, వారి మంత్రులు ఎవ్వరికీ అధికారుల చేత తెలుగులో పనిచేయించుకోవడం చేత కావడం లేదు. వారిలో రాజకీయ సంకల్పం లేకపోవడమే ఇందుకు మూల కారణం. దీన్ని మార్చాలి. రాబోయే ఎన్నికల్లో గెలిచి అధికారాన్ని చేపట్టదలచుకొన్న పార్టీలు తప్పనిసరిగా ఈ విషయంలో ప్రమాణ పత్రాన్ని బహిరంగంగా విడుదల చెయ్యడంతో పాటు, ఒక నిర్ణీత కాలంలో ఈ మార్పుల్ని తేలేకపోతే తమ పదవులకు రాజీనామాలు చెయ్యడానికి కూడా అంగీకరించాలి.

న్యాయస్థానాల్లో జిల్లా స్థాయి వరకైనా ప్రజల భాష తెలుగులో వ్యవహారాలు జరుగకపోవడానికి కారణం కూడా రాష్ట్ర ప్రభుత్వ స్థాయిలో కావలసిన మద్దతు, సహకారం లేకపోవడం వల్లేనని, ఇటీవల ఈ అంశంపై విజయవాడలో జరిగిన సదస్సు స్పష్టంగా ప్రకటించిన సంగతి బహిరంగ రహస్యమే.

మాటల్లో తెలుగుపై ప్రేమను ఒలకబోయడం తప్ప ఆచరణలో మన ముఖ్యమంత్రులకు పట్టుదల లేదనేది అందరికీ అర్థమైంది. రెండు రాష్ట్రాల్లో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో పరిస్థితి మరింత అధ్వాన్నంగా మారింది. తెలుగుదేశం పార్టీకి 'తెలుగు ద్వేషం' పార్టీగా కీర్తిని చంద్రబాబునాయుడుగారు సముపార్జించి పెట్టారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా కెసిఆర్ గారికి ఈ విషయంలో గల నిజాయితీపై కూడా ప్రజల్లో నమ్మకం సడలిపోతోంది.

ఇక రెండవ ముఖ్య అంశం : చదువుల్లో తెలుగు సంగతి. ఒక మాధ్యమంగా తెలుగు ప్రాథమిక స్థాయిలో కూడా పనికిమాలినదని ఇద్దరు ముఖ్యమంత్రులకూ నచ్చజెప్పిన విద్యావ్యాపారవేత్తలైన మంత్రులూ, 'సామంతులూ' ఇప్పుడు పాలక వర్గాల్లో బాగా కుదురుకున్నారు. ఇంటర్మీడియట్‌లో 'దొంగ మార్కుల' కోసం సంస్కృతానికి పీటవేస్తున్న ఈ విద్యా వ్యాపారవేత్తల వత్తిడికి ఇద్దరు ముఖ్యమంత్రులూ లొంగిపోయారు. ఇంటర్మీడియెట్‌లో తెలుగును ఒక సబ్జెక్టుగా తప్పనిసరి చేస్తామని పలుమార్లు ప్రకటించిన ఇద్దరు నేతలూ తలలు వాల్చేశారు. వారు నికరంగా చెప్పేదల్లా – ఒక్క సబ్జెక్టుగా మాత్రం 1 నుంచి 10వ తరగతి దాకా తెలుగును నేర్పుతామని.

తెలుగు ప్రజలకు కావలసింది – వారి భాషను వారికి పదేళ్లపాటు చెప్పడం కాదు; తెలుగును అన్ని రంగాల్లో వినియోగించాలని, ఇందుకోసం శాస్త్ర సాంకేతిక రంగాలతో సహా పూర్తిగా తెలుగును బోధనామాధ్యమం చేసే దిశగా కృషి చెయ్యడానికీ...ఒక చైనా... ఒక జపాన్...ఒక ఇజ్రాయెల్, కనీసం...మన పొరుగున ఉన్న తమిళనాడు స్థాయికైనా మన అమ్మనుడిని శక్తివంతం చేసేందుకు, సాధికారం చేసేందుకు కావలసినదంతా చేయగల తెలుగు ప్రభుత్వాలు ఇప్పుడు మనకు కావాలి.

ఈ అంశం చిన్నదేమీ కాదు. ఇంగ్లీషు పై మోజును సాకుగా చూపే ప్రభుత్వాలు, ఇంకా ఇంకా తెలుగు ప్రజలను తమ భాషపైనా, మేధోశక్తిపైనా, ఆత్మవంచనకు గురిచేస్తూనే ఉంటాయి. ఒక విధమైన బానిస మనస్తత్వాన్ని పెంచుతూ, స్వాభిమానం కోల్పోయిన జాతిగా పతన దిశకు తోస్తూనే ఉంటాయి. కనుక పరాయీకరణ చెందిన పాలక వర్గాలు విద్యారంగంలో తెలుగును ఎదగనివ్వవు. కనుక ఈ విశిష్ట లక్ష్యాలను ముందుకు పెట్టి ఒక స్వాభిమాన ఉద్యమాన్నే నిర్మించాలి. అందుకు ఈ ఎన్నికల సందర్భంగా రాజకీయ చైతన్య ఉద్యమాన్ని సాగించాలి.

ప్రపంచమంతా – మేధావుల స్థాయి నుండి కనీస విజ్ఞతగల వారి దాకా – ఒప్పుకొనే అంశం...పసిబిడ్డలకు వారి అమ్మనుడిలోనే కనీసం ప్రాథమిక విద్యను నేర్పాలని. ఆ తర్వాతే ఏ ఇతర మాధ్యమమైనా! అసలు – మాతృభాషా మాధ్యమాన్నే రద్దు చేసే ఈ తెలుగు ప్రభుత్వాల తెగులును వదిలించే ప్రక్రియ ఈ ఎన్నికల్లోనే మొదలు కావాలి.

రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉన్న ఆలోచనాపరులు, సామాజిక ఉద్యమకారులు కదలాల్సిన సమయం వచ్చింది. జాతి నిద్రాణ స్థితిలో, పరాధీన స్థితిలో ఉన్నది. జాతిని చైతన్యవంతం చేసేందుకు ఇదొక అవకాశం. రానున్న సార్వత్రిక ఎన్నికలకు ఏడాది ముందుగానే ఈ ప్రయత్నాలు మొదలు కావాలి.

తెలుగు నేలపై తెలుగు కోసం – మరో స్వాభిమానోద్యమానికి వెంటనే పూనుకోవాలని, ఇందుకు ఇది తగిన సమయం అనీ మనవి చేస్తున్నాం.

తేదీ : 30-4-2018

వీవెన్
9963029061

# తెలుగు భాషకు ఆధునిక హోదా-4

## తెలుగు వినియోగదార్లకు మేలుకొలుపు

మన రోజువారీ జీవనంలో అనేక వస్తువులని వినియో గిస్తూంటాం, అనేక సేవలు పొందుతుంటాం. టూత్ పేస్టు నుండి గదిలో ఫ్యాను వరకూ, పచారీ సరుకులు ఇంటికే తెప్పించుకోవడం నుండి బీమా, బ్యాంకుసేవల వరకు. అయితే, వీటిలో ఎన్ని తెలుగులో ఉంటున్నాయి?

ఒక చిన్న ప్రయోగం చేసి చూడండి. రోజంతా మీరు వాడే వస్తు సేవల్లో తెలుగులో ఉన్నవి ఎన్ని, లేనివి ఎన్ని చిట్టా రాయండి. అది కష్టం అనుకుంటే, వారాంతపు లేదా నెలవారీ కిరాణా సామాను కొన్నప్పుడు వచ్చే సామానులో ఎన్ని తెలుగులో ఉన్నాయో లెక్కించి చూడండి. తెలుగులో ఉండటం అంటే ఏమిటి? ఈ ఉండటం కొన్ని స్థాయిల్లో ఉండొచ్చు:

వస్తువు లేదా ఉత్పత్తి పేరు (బ్రాండు, లేదా కంపెనీ పేరు) తెలుగు అక్షరాలలో ఉండటం.

వస్తువును వాడుకోడానికి సూచనలు, జాగ్రత్తలు, హెచ్చరికలు తదితర సమాచారం తెలుగులో ఉండటం.

వస్తువు తయారీలో వాడిన పదార్థాల వివరాలు, పోషక విలువలు తదితర సమాచారం తెలుగులో ఉండటం.

వస్తువు ధర, ఎప్పుడు ఎక్కడ తయారైంది తదితర వివరాలు తెలుగులో ఉండటం.

మీ ఓపికను బట్టి వీటన్నింటినీ లెక్కగట్టండి.

నా వరకూ అయితే, (హైదరాబాదులో) జెమినీ టీపొడి ప్యాకెట్టు మీద తప్ప మరో దానిమీద తెలుగు అక్షరం కనబడలేదు. (నా జాబితాలో లేని సరుకులలో గమనించినవి: బిస్లెరీ మంచినీళ్ళ సీసాల మీద పేరు తెలుగులో రాస్తున్నారు.) టీవీల్లోనూ, పత్రికల్లోనూ తెలుగులో వ్యాపార ప్రకటనలు ఇచ్చే వస్తువులు కూడా తెలుగులో లేవు. (చిన్నప్పుడు కోల్గేట్ పండ్లపొడి డబ్బా తెలుగులో ఉండేది.)

వస్తూత్పత్తుల మీద తెలుగు అనేది భాషోద్యమకారులూ, భాషాభిమానులూ పెద్దగా పట్టించుకోని అంశం. అంతగా ప్రభావం చూపించలేకపోయిన అంశం! తతిమా విషయాలపై కృషి చేసినంతగా, పట్టుపట్టినంతగా ఈవిషయంలో చేయలేదు. మనందరం దీన్ని తలకెత్తుకోవాలి.

ఉత్పత్తుల మీద పేర్లూ, వివరాలూ తెలుగులో ఉంటే రెండు దీర్ఘకాలిక లాభాలు కూడా ఉన్నాయి: (1) మన చుట్టూ ఉన్న వాతావరణంలో తెలుగు పాలు పెరుగుతుంది. (2) తెలుగు వచ్చిన వారికి ఉద్యోగావకాశాలు పెరుగుతాయి.

మన దైనందిన జీవనం (అందులో భాగమైన ప్రతీదీ) మన సొంత భాషలో ఆశించడం మన హక్కు. ఆ దిశగా కృషి చేయడం, పోరాడటం మన బాధ్యత.

ఎలా మొదలుపెడదాం?

**సామాజిక మాధ్యమాలు:** మనం రోజువారీ వాడే వస్తువుల తయారీ సంస్థలన్నీ ట్విట్టర్, ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాలలో ఉన్నాయి. వాటిని వెతికి పట్టుకుని మీ ఉత్పత్తులను తెలుగులో అందించండి అని అడగడం. ఒక్కరు అడిగినా సరిపోదు, ఒక్కసారి అడిగినా సరిపోదు. సందర్భానుసారం అడుగుతూనే ఉండాలి.

ఆయా కంపెనీల వినియోగదార్ల తోడ్పాటు కేంద్రాలకు విన్నవించుకోవడం. వారి సర్వేలు, అభిప్రాయ సేకరణల్లో వారి ఉత్పత్తులు తెలుగులో కావాలని ప్రత్యేకంగా అడగాలి.

**ప్రభుత్వ విధానాలు:** ఈ దిశగా సరైన ప్రభుత్వ విధానాలు రూపొందుకొనేలా సరైన వ్యక్తులను, సంస్థలను ప్రభావితం చెయ్యాలి.

ఈ విషయంలో విధానపరంగా తెలుగు అమలు ఈ స్థాయిల్లో ఇలా ఉండొచ్చు:

**తప్పనిసరి స్థాయి:** తెలుగు రాష్ట్రాలలో అమ్ముడయ్యే ప్రతీ ఉత్పత్తిపై వినియోగదార్లకు (ఆరోగ్య, ఆర్థిక, లేదా ఇతరత్రా) హానికరమైన, లేదా హాని కలిగించే అవకాశమున్న, నష్టాన్ని కలిగించే, కలిగించగల అంశాలపై సమాచారం ఖచ్చితంగా తెలుగులో ఉండాలి. ఆ సమాచారపు పాఠ్యం పరిమాణం కూడా 10 పాయింట్లకు తగ్గకుండా ఉండాలి. ఉదాహరణకు ఔషధాలు, ఆహార పదార్థాలకు కాలపరిమితి, వాటిని నిల్వ చేయాల్సిన పద్ధతి, వాటిలో వాడిన హానికరమైన పదార్థాలు, వాటి దుష్ప్రభావాలు.

**అవసర స్థాయి:** ప్రతీ ఉత్పత్తిపై దాని పేరు, దాని ఉపయోగం, కొలతలు, ధర, వాడకంలో వినియోగదార్లు తెలుసుకోవలసిన సమాచారం తెలుగులో ఉండాలి. ఉదాహరణకు: ఆహార పదార్థాలలో పోషక విలువలు. ఉపకరణాలకు వాడుకరి మార్గదర్శినులు.

**ప్రోత్సాహక స్థాయి:** విలాస వస్తువులు, ఖరీదైన గృహోపకరణాలు వంటివాటిపైన పేర్లు. దిగుమతి చేసుకున్న వస్తువులు.

సేవల విషయంలో అయితే దరఖాస్తు ఫారాలు, ఒప్పంద పత్రాలు, రశీదులు, ఖాతా పద్దులు, నియమ నిబంధనలు వంటివన్నీ కూడా తెలుగులో ఉండాలి.

మనందరం కలిసి ఆలోచిస్తే, మరింత మెరుగైన విధాన పత్రాన్ని తయారుచెయ్యవచ్చు. దాన్ని ప్రభుత్వ ఉత్తర్వుగానో, చట్టంగానో రూపొందించమని ప్రజాప్రతినిధులను కోరవచ్చు.

ఒక విధానమో, చట్టమో రూపొందేవరకూ మనం వేచి చూడ కుండా, వినియోగదార్లుగా వ్యాపార సంస్థలను అడగడం, తోటి వినియోగదార్ల నుండి ఒత్తిడి పెంచడం కూడా చాలా అవసరం. “నేను వాడే వస్తుసేవలు నా భాషలో” అన్నది వినియోగదారుల కనీస హక్కు అని వినియోగదార్లలో చైతన్యం పెంచడమూ ముఖ్యం.

డా॥ సామల రమేష్‌బాబు

# అమ్మనుడులను రక్షించుకోవడానికై ఉద్యమించాలి

(**'సమైక్య భారతి'** సామాజిక-సాంస్కృతిక చైతన్య సంస్థ - విశాఖపట్టణం వారు 14-4-2018న చెన్నైలోని మద్రాసు రిపోర్టర్స్ గిల్డులో నిర్వహించిన సదస్సులో ముఖ్యఅతిథి ప్రసంగ పాఠం)



"భాష సమైక్యతకు తోడ్పడుతుందా? విడిపోవడానికి కారణమవుతుందా?".

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంకోసం పోరాటం సాగుతున్న రోజుల్లో ఒక టివి ఛానెల్‌వారు నిర్వహించిన ప్రత్యక్ష ప్రసార చర్చాగోష్ఠిలో సంపాదకుడు మా ముందుంచిన ఒక ప్రశ్న ఇది. భాషోద్యమకారుణ్ణయిన నాతోపాటు ఒక విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సెలరూ, సామాజిక ఉద్యమాల్లో ప్రముఖంగా పనిచేస్తున్న కవులు, రచయితలూ ప్రత్యేక తెలంగాణ ఉద్యమంతో మమేకమై పనిచేస్తున్న వారితో సహా ఆ చర్చాగోష్ఠిలో ఉన్నారు. మంచి చర్చే జరిగింది. 'ఆంధ్ర ప్రాంతపు తెలుగు వేరు, తెలంగాణ తెలుగు వేరు' అనే వాదంతోపాటు, మాండలికాలు, తెలుగు భాషాప్రాచీనత, తెలుగుపై కులాల, యాసల ప్రభావం వంటి చాలా కోణాల నుంచి అభిప్రాయాలు ముందుకొచ్చాయి. ఆ కార్యక్రమం అక్కడికి ఐపోయింది. తర్వాత కొద్ది ఏళ్ళకే ఉద్యమం ఉధృతమై తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడింది.

2014 జూన్ 2 నుండి రెండు తెలుగు రాష్ట్రాలయ్యాయి. భాషా ప్రయుక్త రాష్ట్రాలంటే - ఒకే మాతృభాష కలిగిన ప్రజలంతా కలిసి ఒకే రాష్ట్రంలో ఉండాలని కాదని, ఒకే భాషను మాట్లాడే ప్రజలకు ఎన్ని రాష్ట్రాలైనా ఉండొచ్చు కాని, ఆయా రాష్ట్ర ప్రజల మాతృభాష మెజారిటీగా ఉన్నప్పుడే అవి భాషారాష్ట్రాలుగా పిలువబడతాయని, కొంత విస్తృతమైన అవగాహన ముందుకొచ్చింది. ఆ ప్రకారంగా చూసినప్పుడు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ - రెండూ తెలుగు రాష్ట్రాలే. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి అసలు కారణాలైన నదీ జలాల విభజన, ఆర్థిక కేటాయింపులు, వగైరాలతో పాటు రాజకీయమైన అధికారం ఎవరిచేతుల్లో కేంద్రీకృతమవుతోంది అన్నది కూడా ప్రధానాంశం అయింది. స్వాతంత్ర్యానికి పూర్వం కొన్ని వందల ఏళ్లపాటు విభిన్న రాజ్యాలుగా ఉన్న చారిత్రక నేపథ్యం నుంచి స్వాతంత్ర్యానంతరం భాషా ప్రయుక్త రాష్ట్రాల వాదనవల్ల వచ్చిన పరిణామాలివి. భావోద్వేగాలతో పెనవేసుకొన్న రాజకీయ స్వార్థాల ముందు - ఇతర అంశాలేవీ పరిగణనలోకి రాకుండానే 1953లో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడింది. 1956లో తెలంగాణ కలిసి విశాలాంధ్ర ఏర్పడడం, 2014లో మళ్లీ రెండుగా విడిపోయి అంతకు ముందు ఉండిన విధంగా రెండు ప్రత్యేక రాష్ట్రాలుగా ఏర్పడ్డాయి. తెలంగాణ ప్రత్యేకజాతి అనే భావం కూడా ప్రచారమయింది. దానికోసం కొందరు ఉద్యమకారులు కోస్తాంధ్రప్రాంతపు తెలుగుకూ తెలంగాణ ప్రాంతపు తెలుగుకూ ఉన్న వైవిధ్యాన్ని వైరుధ్యంగానే చూడసాగారు. ఎక్కడా ఈ వాదాలు నిలబడకపోయినా ప్రజల్లో రాగద్వేషాలను పెచ్చరిల్లజేయడానికి బాగా పనికి వచ్చాయి. తెలంగాణ ఏర్పడిన తర్వాత రెండు మూడేళ్లు గడిచేసరికి తెలంగాణ ప్రజల భాష ప్రత్యేకత గురించిన చిన్నపాటి చర్చ కూడా మొదలయింది. అయితే 2017 డిసెంబరులో ముఖ్యమంత్రి కెసిఆర్ ఘనంగా నిర్వహించిన ప్రపంచ తెలుగు మహాసభలతో తెలంగాణ పాలకుల ఆలోచన చాలా స్పష్టంగా ముందుకొచ్చింది. అంతకు ముందువరకు 'మాది తెలుగు కాదు, తెలంగాణ భాష' అనే కొందరి వాదనను ఖండించని ఉద్యమనేతలు పాలకులైన తర్వాత మాదే తెలుగుకు అసలు నేల...మాదే ప్రాచీనం...మేమే తెలుగును ఉద్ధరిస్తాం అనే ధోరణిని చేపట్టారు. తమదైన ప్రత్యేకతలతో అసలు సిసలైన తెలుగును - ప్రజల తెలుగును - వెలుగులోకి తెచ్చేందుకు కృషి ఇప్పుడే మొదలయిందనే భావాలు తోసుకువచ్చాయి.

★ ★ ★

స్వాతంత్రోద్యమ కాలంలోనే - భారతదేశంలో భాష ప్రాతిపదికన రాష్ట్రాలనేర్పరచాలనే వాదం బలంగా పైకి వచ్చింది. దాన్ని భారత జాతీయ కాంగ్రెస్ సూత్రప్రాయంగా ఆమోదించి, దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఈ విషయాన్ని చేబడదామని నిర్ణయించింది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి, రాజ్యాంగం ఏర్పడి, సర్వసత్తాక ప్రతిపత్తిని పొందిన తర్వాత ఆంధ్రోద్యమం తీవ్రం అయ్యింది. పొట్టి శ్రీరాములుగారి ఆమరణ నిరాహారదీక్ష వల్ల కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోక తప్పని పరిస్థితులు ఏర్పడ్డాయి. త్వరలో కొత్త రాష్ట్రంలో అధికారం చేపట్టాలనే తహతహతో కొందరు ఆంధ్రోద్యమ నాయకులు కేంద్రం కేటాయించే భూభాగాన్ని ఒప్పుకోవడానికి సిద్ధమయ్యారు. మదరాసు నగరం, ఇంకా కొన్ని తెలుగు ఆధిక్య ప్రాంతాలను వదులుకొని, అసమగ్ర రాష్ట్రాన్ని తీసుకొన్నారు. ఆంధ్రులకు తీరని అన్యాయం జరిగింది.

సమైక్యాంధ్రప్రదేశ్ 2014లో రెండు ముక్కలయిందని బాధపడేవాళ్ళు -1953లో ఆంధ్రరాష్ట్రం ఏర్పాటు సరిగా జరిగిందా - అనే విషయాన్ని ఆలోచించాలి. ఇప్పుడున్న తమిళనాడు రాష్ట్రంలో 42% మంది తెలుగు ప్రజలున్నారనే సంగతి మనందరికి తెలుసు. ఈ ఆరు

దశాబ్దాల కాలంలో వాళ్లను అన్ని విధాలుగా తమిళీకరించడం కోసం ఈ రాష్ట్రంలో ఒక పద్ధతి ప్రకారం పట్టుదలగా జరిగిన ప్రయత్నాలు అందరికీ తెలిసినవే.

మరి ఆంధ్ర రాష్ట్రం ఏర్పడినప్పుడు భౌగోళికంగా, ప్రజల పరంగా – నేటి తమిళనాడు, కర్ణాటక, ఒరిస్సా తదితర పొరుగు రాష్ట్రాలకు మనం ఎంతో కోల్పోయాం అనేది మనల్ని కలచివేసే విషయం. భాషా ప్రయుక్త రాష్ట్రాల విభజన అనే సిద్ధాంతాన్నే సవాలు చేస్తున్న చారిత్రక వాస్తవాలు ఇక్కడున్నాయి. భాషారాష్ట్రాల ఏర్పాటుకు ముందు – స్వాతంత్ర్యానంతర వాస్తవ స్థితిని గమనిస్తే తెలుగు మాట్లాడే ప్రజలు ఎక్కువగా ఉన్న తావులతోపాటు మరి ఒకటి రెండు భాషల ప్రజలు కొంచెం ఎక్కువ తక్కువగా కలిసి ఉన్న ప్రాంతాలు కూడా ఎన్నో ఉన్నాయి. వీటిని మనం కోల్పోయాం. తెలుగువారికి సహజ లక్షణాలుగా మొదటినుండీ ఉన్న – విస్తరించే జీవన విధానం, అభివృద్ధే ప్రధానంగా పనిచేయడం, స్వంత భాషాసంస్కృతుల విషయంలో పట్టుదల లేకపోవడం – అనే అంశాలు సరైన భాషా రాష్ట్రాల ఏర్పాటుకు వ్యతిరేకాంశాలుగా నిలబడ్డాయి. అందువల్ల అనేక ప్రాంతాలను పొరుగు రాష్ట్రాలకు కోల్పోవలసి వచ్చింది.

పొట్టి శ్రీరాములుగారి బలిదానంవల్ల మద్రాసు నగరమూ మరికొన్ని తెలుగు జనాధిక్య ప్రాంతాలూ మనకి వచ్చి వుంటే – ఆ విధంగా వాస్తవాల ఆధారంగా నాటి మన నాయకులు పనిచేసివుంటే పరిస్థితి మరో విధంగా ఉండేది. మనకివ్వదలచిన ఆంధ్రరాష్ట్రపు సరిహద్దులను శ్రీరాములుగారి బలిదానానికి చాలా రోజుల ముందే కేంద్రం ప్రకటించినా ఆయన ప్రాణాలు పోయేదాకా దీక్షను ఎందుకు కొనసాగింప జేశారో సంజాయిషీ చెప్పుకోవడానికి నాటి నాయకులు ఇప్పుడు మనముందు ఎవరూ లేరు.

ప్రత్యేక తెలంగాణ ఉద్యమం జరుగుతున్నప్పుడు ఒకసారి కేసిఆర్‌గారు ఒక ప్రశ్నకు సమాధానం చెబుతూ 'మద్రాసు రాష్ట్రం నుంచి ఆంధ్రులు ఏ కారణాల మీద ఎందుకు విడిపోయారో ఆ కారణాల మీదే మేమూ ఇప్పుడు విడిపోతున్నాం' అని చెప్పారు. ఇదంతా గత చరిత్రే అయినా అందలి వాస్తవాలను విశ్లేషించుకొని వర్తమానంలోని సమస్యల పరిష్కారానికై ఉద్యమించాలి.

★ ★ ★

సరే...వేలాది సంవత్సరాల చరిత్రగల భాషాజాతికి చెందిన మన నేటి పరిస్థితి ఇది. ఏ జాతికయినా ప్రాణాధారం భాష. అంటే మాతృభాష...'అమ్మనుడి'. అమ్మనుడి ఆధారంగానే మన ఉనికీ మన బ్రతుకూ మన భవితా అంతా ఉంటుంది. భాష నశిస్తే జాతి నశిస్తుంది. ఊపిరి ఆడకపోతే ప్రాణం పోయినట్లు – భాష వాడిపోతే జాతీ వాడిపోతుంది. అంటే ఆ జాతికి సంబంధించిన మనుషులంతా చనిపోతారని కాదు. పరభాషాజాతీయులైపోతారు. ఆ మార్పుతో వారి వారసత్వ జ్ఞానమూ సంపదా సర్వమూ పరాయీకరణ చెందుతుంది.

భౌగోళికంగా తెలుగు రాష్ట్రాలుగా గుర్తింపు పొందిన రెండు రాష్ట్రాలలోను ఉన్న తెలుగు జనాభా తొమ్మిది కోట్లు కాగా మరి తొమ్మిది కోట్ల మంది పొరుగు రాష్ట్రాలలో ఉన్నారు. ఇందులో మూడు కోట్లమందికిపైగా తమిళనాడులోనే ఉన్నారు. వీరు తమ ఇళ్లలో తెలుగు మాట్లాడుకుంటున్నప్పటికీ బయట అన్ని వ్యవహారాల్లోనూ తమిళంలోనే వ్యవహరించక తప్పని పరిస్థితి ఏర్పడింది. భాషా రాష్ట్రాల ఏర్పాటువల్ల బాగా లాభపడింది తమిళులు. ఐతే తమిళనాడులో తెలుగుతోపాటు కొన్ని ఇతర భాషలు కూడా కొద్దిపాటి సంఖ్యలో ఉన్నా వీళ్లందరి భాషా హక్కులను క్రమంగా కాలరాచివేసి, రాజ్యాంగం ప్రకారం – తమిళనాడులో తెలుగుకు రెండవ అధికార భాషకు రావలసిన గుర్తింపు కూడా రానివ్వలేదు. జనాభా లెక్కలను చూపడంలోనే ప్రభుత్వం, రాజకీయ పార్టీలూ తమకుట్రను కొనసాగిస్తూనే ఉన్నాయి. తమిళమే ప్రధానంగా రాష్ట్ర పాలనా బోధనా విధానాలను ఇక్కడి ప్రభుత్వాలు అమలు పరిచాయి. తమిళుల స్వభాషాభిమానం ఎంత తీవ్రంగా ఉంటుందో అందరికీ తెలిసిందే.

2006 జూన్ 17న తమిళనాడు ప్రభుత్వం కరుణానిధిగారి హయాంలో ఇచ్చిన ఉత్తర్వు( 18640 ఎఫ్ 16) తో తమిళనాడులో మిగిలి ఉన్న నాలుగైదువందల తెలుగు మాధ్యమ పాఠశాలలు కూడా తమిళీకరణ చెందాయి. కావాలంటే ఐచ్ఛికంగా తెలుగును ఒక సబ్జెక్టుగా ఎవరికి వారు చదువుకోవడం తప్ప విద్యారంగంలో తెలుగుకు చోటే లేకుండా పోయింది. పరిపాలనకు సంబంధించి ఎప్పుడో ఇచ్చిన జి.వో ప్రకారం – కొద్ది మండలాలలో రెండవ భాష ప్రతిపత్తి ఉన్నా ఆచరణలో అదీ అణచివేయబడింది.

తక్కిన రాష్ట్రాలలో – తెలుగువారి భాషా హక్కుల పరిస్థితి కూడా ఇంచుమించుగా ఇలాగే ఉంది. ప్రజాస్వామ్య యుగంలో మనమంతా ఒకే దేశంలో ఉన్నాం కనుక బ్రతుకులు సాగిపోవడానికి వచ్చిన ఇబ్బందేమీ లేకపోవచ్చుగాక. కాని, ఎంతో ప్రాచీన చరిత్ర, గొప్ప భాషాసంస్కృతులకు చెందిన ఒక జాతి పరిస్థితి ఈ విధంగా చెదిరిపోయిందనే వాస్తవ స్థితి మనల్ని కలచివేస్తుంది.

భారతదేశంలో వివిధ రాష్ట్రాలలోని అధికార భాషకు చెందిన మెజారిటీ సంఖ్యకు చెందని మైనారిటీ భాషల వారికి ప్రాథమిక విద్యను వారి అమ్మనుడిలోనే నేర్పాలి అని రాజ్యాంగం స్పష్టం చేసింది. అయినా, ఎవరూ ఈ అంశాన్ని పట్టించుకొన్న దాఖలాలు లేవు. భారత రాజ్యాంగం 350 ఎ. లో ఈ విధంగా ఉంది. *'భాషా పరమైన మైనారిటీ పిల్లలకు ప్రాథమికస్థాయి విద్యాబోధన వారి తల్లి భాషలోనే జరిగేందుకు అవసరమైన సదుపాయాలను కల్పించేందుకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు, స్థానిక సంస్థలూ తప్పక కృషి చేయాలి. రాష్ట్రపతి, ఆ విధమైన సౌకర్యాలను కల్పించవలసిందిగా ఏ రాష్ట్రానికైనా అవసరమని భావించినపుడు ఆదేశాలను జారీ చేయవచ్చు'.*

★ ★ ★

ప్రపంచ వ్యాప్తంగా వేలాది మాతృభాషలకు మరణమృదంగం మోగుతున్న దశలో యునెస్కో వారు 2000 సంవత్సరం నుంచి గొంతెత్తి నినదిస్తున్న అంశం – ప్రపంచంలోని భాషా జాతులన్నీ తమతమ మాతృభాషలను కాపాడుకోవాలి అని. అయినా ఇప్పటికే దాదాపు మూడువేల మాతృభాషలు మరణించాయి. మనదేశంలో కూడా రాజ్యాంగం ఎనిమిదో షెడ్యూల్‌లో చేర్చిన 22 భాషలతో సహా సుమారు ముప్పయి భాషలు తప్ప తక్కిన చిన్నచిన్న భాషలను మాట్లాడేవారు

**ప్రజల భాషలో పరిపాలించేదే ప్రజాస్వామ్య ప్రభుత్వం**

మరణించడంతో వారి భాషలూ అంతమవుతున్నాయి. సంఖ్యలో అధికంగా ఉండడం వల్ల మాత్రమే సాంస్కృతికతను కలిగియున్నందువల్ల పెద్ద భాషలు తమదైన ఉనికిని కాపాడుకొంటున్నాయి. జన సంఖ్య రీత్యా ప్రపంచంలోని మొదటి పది పెద్ద భాషలలో మన మాతృభాష – 'తెలుగు' ఉన్నా మన భాషకు సంబంధించిన వాస్తవ స్థితి ఎంతో ప్రమాదకర స్థాయికి చేరింది.

17 ఏళ్ళ క్రితమే యునెస్కోవారు భాషలు ఎలా మరణిస్తాయో తెలుపుతూ ఒక కొలబద్దను ప్రకటించారు. దాని ప్రకారం ఏ భాషా జాతిలోనైతే మాతృభాషలో పాఠశాల విద్యను అభ్యసించని పిల్లలు 30 శాతంకంటె ఎక్కువగా ఉంటారో ఆ భాష పతన దిశగా ప్రయాణిస్తున్నట్లు అని వారు హెచ్చరించారు. ఆ లెక్కన తెలుగుజాతి పరిస్థితిని విశ్లేషిస్తే ఇతర రాష్ట్రాలలోని తెలుగు పిల్లలు మాతృభాషలో చదవడం దాదాపుగా ఏనాడో ఆగిపోయింది. మహా ఉంటే ఒకటిరెండు శాతం లోపల ఉండవచ్చు. రెండు తెలుగు రాష్ట్రాల పరిస్థితిని చూస్తే తెలుగుమాధ్యమాన్ని వదిలివేసినవారి సంఖ్య 30 శాతానికి ఎప్పుడో దాటిపోయింది. ఇప్పుడయితే ప్రభుత్వాలే తెలుగు మాధ్యమాన్ని తీసివేసి ఇంగ్లీషు మాధ్యమాన్ని ప్రవేశపెట్టడానికి పోటాపోటీగా కదులుతున్నాయి. కేవలం ఒక భాషగా మాత్రమే బోధించాలనే ఆలోచనకు వచ్చేశాయి. ఒక బోధనా మాధ్యమం (మీడియం) గా గాక ఒక అంశంగా మాత్రమే తెలుగును కుదించినప్పుడు ఆ భాష ఎదుగుదల ఆగిపోతుంది. బి టి విత్తనాల వలె ఆ భాషీయులు మిగిలిపోతారు.

ఈ ఆధునిక ప్రజాస్వామ్య కాలంలో – శాస్త్ర సాంకేతిక విజ్ఞాన పురోగతిలో తమదైన మాతృభాషల్ని అత్యాధునికంగా పెంపొందించుకోకపోతే, చదువులలో బోధనా మాధ్యమంగా వినియోగించుకోకపోతే త్వరత్వరగా ఆ భాషలు కనుమరుగయ్యే అవకాశముంది. విద్యారంగానికి తోడు విడదీయరాని రంగం పరిపాలనారంగం. పరిపాలనకు చెందిని అన్ని అవసరాల్లో మాతృభాషల్ని వాడకపోతే వాటి 'పలుకుబడి' పోతుంది. విద్యాపరిపాలనా రంగాల్లో భాష కనుమరుగయితే, ఆ భాషీయుల సాంస్కృతిక వికసనం, వారి ఘనమైన వారసత్వం, చరిత్ర రూపు మాసిపోతాయి. ప్రతి అవసరానికీ పరభాషను శరణుజొచ్చే ప్రజలు పురోగతిలో వెనుకబడే ఉంటారు. ఈ ప్రమాదాన్ని గురించి యునెస్కో పదేపదే హెచ్చరిస్తూనే ఉంది. అయినా మన దేశంలోని పాలక వర్గాలు అటు కాంగ్రెస్ కానీయండి, ఇటు భాజపా కానీయండి, కొన్ని ప్రాంతీయ పార్టీలు కానీయండి అంతా ప్రపంచీకరణ సుడిగాలిలో కార్పోరేట్ శక్తుల వలలోపడి కొట్టుమిట్టాడుతున్న రోజులివి. ఆర్థికస్థాయి మాత్రమే మనుషుల జీవితాలను శాసిస్తున్న పరిణామాల్లో భాషా జాతుల లేక సామాజిక వర్గాల మధ్య ఘర్షణతోపాటు ప్రమాదకరమైన, అనారోగ్యకరమైన దోపిడీ మనస్తత్వాన్ని పెంచే పోటీ నెలకొంది. ఈ సంఘర్షణలో మాతృభాషలు బలి అవుతున్నాయి. కనీసం తన సొంతభాషలో ప్రాథమిక విద్యను కూడా పొందలేని విధంగా బాల్యాన్ని బలిచేస్తూ భావి పౌరులనెత్తిన మేకు కొడుతున్నాం. ఇది ఎటువంటి విపరిణామాలకు దారి తీస్తుందో యునెస్కో పదేపదే చెబుతూనే ఉంది.

★ ★ ★

కొద్దిపాటి తేడాతో ఎన్నోచోట్ల భాషాపరమైన జనాభా సమస్య లున్నాయి. రాజ్యాంగ నిర్మాణ క్రమంలో భాష విషయంలో ముఖ్యంగా – జాతీయభాష, అధికారభాష, రాష్ట్రాలభాషలు, ఇంగ్లీషు ప్రతిపత్తి వంటి అంశాలమీద జరిగినంత చర్చ ఇంకే ఇతర సమస్యల మీదా జరగలేదు. కాని, సరియైన పరిష్కారాలను రాజ్యాంగ నిర్మాతలు చూపించలేక పోయారు. రాజ్యాంగం పదిహేడవ భాగంలోని నాలుగు అధ్యాయాలనూ 343 నుంచి 351 వరకు గల అధికరణాలను ఇందుకోసం కూర్చిపెట్టినప్పటికీ దేనిమీదా స్పష్టత లేనందువల్ల ఇవాళ దేశమంతా – ముఖ్యంగా మాతృభాషల అభివృద్ధి విషయంలో అస్పష్టత, గందరగోళ పరిస్థితి నెలకొన్నాయి. దాదాపుగా ఏడు దశాబ్దాలు పూర్తి కావస్తున్నా నానాటికీ ఈ పరిస్థితి మరింత క్లిష్టం అవుతున్నది.

ఇంతకు ముందే చెప్పుకొన్నట్లు– భారత రాజ్యాంగంలో 350 ఎ. అధికరణాన్ని ఏ మాత్రం అమలు చేయనందున – భారతదేశంలో వివిధ రాష్ట్రాలలోని అధికార భాషకు చెందిన వారుగాక, ఇతర మైనారిటీ భాషల వారికి కనీసం ప్రాథమిక విద్యను వారి అమ్మనుడిలో నేర్చుకొనే వీలు లేకుండా పోయింది. మొత్తంగా ఆ నాలుగు అధ్యాయాలను తిరిగి పరిశీలించి 343 నుంచి 351 వరకుగల అధికరణలను తగు సవరణలతో తిరిగి వ్రాయాల్సిన అత్యవసర పరిస్థితి ఏర్పడింది. దేశమంతా ప్రాథమిక విద్యను మాతృభాషలోనే బోధించాలని కేంద్రమూ, రాష్ట్రాలూ ఏకగ్రీవంగా ఆమోదించి రాజ్యాంగంలో ఆ నిబంధనను చేర్చాలి.

గత మూడేళ్ళుగా మాతృభాషలను రక్షించుకోడానికి దేశ వ్యాప్తంగా ఒక ఉద్యమం బయలుదేరింది. ఇందులో వివిధ భాషా శాస్త్రజ్ఞులు, ఉద్యమకారులు పాల్గొంటున్నారు. వారంతా 2015లో ఇదే చెన్నై నుండి మాతృభాష రక్షణకై కొన్ని డిమాండ్లతో ఒక ప్రకటనను విడుదల చేశారు. 2016 ఢిల్లీలో మరోసారి డిక్లరేషన్ విడుదల చేశారు. మూడో అడుగుగా బెంగళూరులో ఈ ఫిబ్రవరి 21న అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం నాడు మరింత స్పృహతో కూడిన డిక్లరేషన్‌ను ప్రకటించారు. దానితోపాటు 16 డిమాండ్లను కూడా ప్రభుత్వం ముందుకు తెచ్చారు. వీటి సాధన కోసం...'భాషాసమానత్వ హక్కుల ప్రచార సంస్థ'ను స్థాపించారు.

## 16 డిమాండ్లు

1. భారతదేశరాజ్యాంగంలోని ఎనిమిదవ షెడ్యూల్‌లో చేర్చేందుకు కేంద్ర ప్రభుత్వానికి విన్నపాలు పెట్టుకున్న భాషలను అన్నిటినీ ఒక కాలపరిమితిలోగా అలాంటి గుర్తింపునివ్వాలి. భారత ప్రభుత్వం, ఎనిమిదవ షెడ్యూల్లో గుర్తించేందుకు వీలుగా భాషలకోసం సమగ్రమైన ఒక పారదర్శక విధానంతో ముందుకు రావాలి.

2. భారతప్రభుత్వం, భారతరాజ్యాంగపు ఎనిమిదవ షెడ్యూలులోని అన్నిభాషలనూ సమాన హోదాకలిగిన అధికారభాషలుగా ప్రకటించాలి.

3. ఆయా రాష్ట్రాలలోని స్థానిక భాషలను ప్రాథమిక విద్యా మాధ్యమాలుగా ప్రకటించాలి. రాష్ట్రాలలోని అన్ని ప్రభుత్వ మరియు ప్రైవేటు విద్యాసంస్థలలో ఉన్నత విద్యలో విద్యా మాధ్యమాలుగా రాష్ట్రాల స్థానిక భాష (ల) విస్తరణ కోసం ప్రభుత్వ నిధులతో మద్దతునిచ్చి

**వాడని భాష వాడిపోతుంది...భాష నశిస్తే జాతి నశిస్తుంది.**

ప్రోత్సహించాలి.

4. ఆయా రాష్ట్రాలలోని స్థానిక భాషలను ఆ రాష్ట్రాలలోని ప్రతి పాఠశాలలోనూ తప్పనిసరి అధ్యయనం విషయంగా ప్రకటించాలి.

5. కేంద్ర ప్రభుత్వం యొక్క అన్ని రకాల విద్యాసంస్థలలో ప్రవేశానికి ప్రవేశ పరీక్షలూ ఇంటర్వ్యూలూఎనిమిదవ షెడ్యూల్లోని అన్ని భాషలలోనూ ఉండాలి.

6. కేంద్ర ప్రభుత్వంలోని అన్ని రకాల ఉద్యోగ ఉపాధి నియామకాలకూ జరిపే రాత పరీక్షలూ మౌఖిక పరీక్షలూఎనిమిదవ షెడ్యూల్లోని అన్ని భాషలలోనూ ఉండాలి. భారతీయ భాషాప్రావీణ్యం ఉద్యోగానికి తప్పనిసరి అర్హతగా నిర్ణయించాలి.

7. యూనియన్ ప్రభుత్వం తగిన యంత్రాంగాల ద్వారా అన్ని భాషలకూ సమాన ప్రోత్సాహమూ సరైన ప్రోత్సాహ కాలనూ అందించాలి.

8. ఎనిమిదవ షెడ్యూల్లో చేర్చని భాషలను అభివృద్ధిపరచడానికీ భద్రపరచడానికీ అవసరమైన అన్ని రకాల కనీస అవసరాలను అందించాలి.

9. రాష్ట్రాలలోని అన్ని ప్రభుత్వ, ప్రభుత్వ సహాయాన్ని పొందే సంస్థల అంతర్గత కార్యకలాపాలూ అధికారిక కార్యక్రమాలను ఆయా రాష్ట్రాలలోని స్థానిక భాషలలో నిర్వహించాలి.

10. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలూ, ప్రభుత్వ రంగ సంస్థలూ, ప్రైవేటు సంస్థలచే ఏర్పడిన స్వయంప్రతిపత్తిగల సంస్థలూ, అవి అందించే అన్ని రకాల సమాచార సేవలనూ తప్పనిసరిగా స్థానిక భాషలలోపొందే విధంగా, చట్టాలు చేయాలి.

11. ఉన్నతన్యాయస్థాన అధికార పరిధిలోకి వచ్చేటటువంటి రాష్ట్రాల అధికారిక భాషలను అన్ని వ్యవహారాలకూ లావాదేవీలకూ ఆ కోర్టు అధికారిక భాషలుగా చేర్చాలి.

12. అంతర్జాతీయంగా గుర్తించబడిన భాషా ప్రమాణాలకులోబడి శాస్త్రీయ సూత్రాల ఆధారంగా భారత ప్రభుత్వం భాషలను నిర్వచించాలి.

13. ప్రభుత్వ జోక్యంలేనివిధంగా ఏ లిపి లేదా లిపులను ఉపయోగించాలనే నిర్ణయాధికారం ఆభాషాసమూహానికి మాత్రమే ఉందని గుర్తించాలి.

14. రాష్ట్ర ప్రభుత్వాలు రాష్ట్ర ప్రాధికార భాషా సంస్థలను స్థాపించి స్థానిక భాషలకు సాధికారతను కల్పించాల్సిన అవసరం ఉంది, ఒకవేళ అవి లేని చోట ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు భాషా విధానాన్ని అమలు చేసేందుకు చట్టపరమైన విధానాలను రూపొందించాలి.

15. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంతరించిపోతున్న భాషలను పరిరక్షించడానికి ప్రజా నిధుల ద్వారా తక్షణ చర్యలు చేపట్టాలి.

16. భారత ప్రభుత్వమూ దాని ప్రాతినిధ్య సంస్థలూ విద్యా రంగంలో అన్ని భాషలనూ సమానంగా ప్రోత్సహించేందుకు కృషిచేయాలి.

తీర్మానాల పత్రంపై సంతకం పెట్టిన భాషాసమానత్వ హక్కుల ప్రచార సంస్థ' (CLEAR) ప్రతినిధులు పైన పేర్కొన్న అన్ని తీర్మానాలనూ వాస్తవం చేసేందుకు బాధ్యతతో పనిచేయడానికీ ప్రతి స్థాయిలోనూ పరిష్కారాలను కనుగొనేందుకూ నిర్ణయించుకున్నారు. పై లక్ష్యాలను సాధించడానికి, భాషాసమానత్వ హక్కుల సాధనకు అవసరమైన మార్గనిర్దేశానికీ ఇతరత్రా సహాయం కోసం ఈ సంస్థ తయారుగా ఉంటుంది.

ఇదే సమయంలో భారతదేశంలో అత్యంత ప్రభావవంతమైన సంస్థలలో మొదటిశ్రేణికి చెందిన రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆరెస్సెస్) కూడా అమ్మనుడి రక్షణకై ఏడు అంశాలతో కార్యక్రమాన్ని ప్రకటించింది.

అమ్మనుడుల రక్షణకై దేశంలోని సామాజిక, ప్రగతిశీల ప్రజాస్వామిక శక్తులన్నీ ఉద్యమించాల్సిన తరుణం వచ్చింది. తమిళనాడులోని తెలుగు సంఘాలు, తెలుగు మూలాలున్న రాజకీయ, సామాజిక నేతలు ముందుకు అడుగువేసి పనిచేయవలసిన సమయం వచ్చింది. విద్యాపరమైన అంశాలు కేంద్ర – రాష్ట్రాల ఉమ్మడి జాబితాలోకి వస్తాయి. కనుక కేంద్రపాలకులూ రాష్ట్రాల పాలకులూ కలసి కూర్చొని ఇంతవరకు వచ్చిన అనుభవాల, అవసరాల ప్రాతిపదికపై అమ్మనుడుల సాధికారతకూ అభివృద్ధికీ – తద్వారా భారతదేశపు ఘనమైన వారసత్వ సంపద పరిరక్షణకై, నడుం బిగించాలి.

తమిళనాడులోని తెలుగు సంఘాలు, ప్రముఖ వ్యక్తులు, వివిధ రంగాలలోని తెలుగు పెద్దలు కలిసి ఇప్పుడు పనిజేయాల్సిన అవసరం ఉంది. తెలుగు, తమిళ భాషలు రెండూ మూల ద్రావిడ నుంచి ఏర్పడినవేనన్నది భాషా శాస్త్రజ్ఞులంతా నిగ్గుతేల్చిన విషయం. కనుక ఈ రెండు భాషా జాతులకు, కన్నడిగులకు, మలయాళీయులకు అందరికీ మధ్య భాషాపరమైన తోబుట్టు సంబంధం ఉంది. ఒకరినొకరు వ్యతిరేకించవలసిన అవసరం లేదు. ఇదే సమయంలో అన్ని రాష్ట్రాలలో ఉన్న తెలుగు ప్రజలు తమ మాతృభాష మాట్లాడడమేకాక, వ్రాయడమూ చదవడమూ కూడా నేర్చుకుని అన్ని వ్యవహారాలలోనూ తోటి భాషీయులతో కలిసి ముందుకు సాగాలని, అందుకు తగిన విధంగా స్వాభిమాన ఉద్యమాన్ని నిర్మించుకోవాలి. మాతృభాషను రక్షించుకోవడానికి, అభివృద్ధి చేసుకోవడానికి అందరికీ గల హక్కు కోసం, భాషలన్నీ సమానమేననే శాస్త్రీయ దృక్పథాన్ని చాటి చెప్పడం కోసం అందరూ ముందుకు రావాలని విన్నవిస్తున్నాను.

అందరికీ మప్పిదాలు. – సామల రమేష్‌బాబు

(సదస్సు వార్త వివరాలు 44వ పుట – 3వ అట్టపై ఛాయా చిత్రాలను చూడండి)

**'అమ్మనుడి' లభించేచోట్లు**

నవోదయ బుక్ హౌస్, ఆర్యసమాజ్ భవనం ఎదురుగా, కాచిగుడా. **హైదరాబాదు – 500 027.** ఫోన్ :040–24652387

మైత్రీ బుక్ హౌస్, జలీల్ వీధి, కార్ల్‌మార్క్స్ రోడ్డు (ఏలూరు రోడ్డు) **విజయవాడ – 520 002**. ఫోన్ : 9866211995

మణి బుక్‌స్టాల్, షాప్ నెం.58, సండేమార్కెట్, **నెల్లూరు**–1. ఫోన్:7386223538.

బి.హనుమారెడ్డి, న్యాయవాది
94402 88080

# న్యాయస్థానాల్లో ప్రజల మాతృభాషల వాడకం ప్రజల హక్కు

రాష్ట్రాలలోని న్యాయస్థానాలలో ప్రాంతీయ మాతృభాషల వాడకంపై కేంద్రము మరియు రాష్ట్రాలలోని శాసన నిర్మాణవిభాగం (legislature), కార్యనిర్వాహక విభాగం (executive), న్యాయ విభాగం (Judiciary) తమతమ దృష్టిని సారించి రాజ్యాంగంలో 344(1) అధికరణం, 351 వ అధికరణంలలో చెప్పిన విధంగా రాజ్యాంగంలోని 8వ షెడ్యూలులో చేర్చిన ప్రాంతీయ భాషలను సంరక్షించటమేకాకుండా, సుసంపన్నం చేయవలసిన ధర్మం కేంద్ర ప్రభుత్వము మరియు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలపై వున్నది. అందుకు అనుగుణంగానే బ్రిటీషుపాలకులే న్యాయశాస్త్ర కార్యవిధాన గ్రంధాలైన సి.పి.సిని, సి.ఆర్.పి.సిని వ్రాసి ఎవరి మాతృభాషలను వారు న్యాయస్థానాల్లో వాడుకోమన్నారు.

రాజ్యాంగాన్ని, ప్రజలు, ప్రభుత్వాలు గౌరవించాలి. రాజ్యాంగంలో 22 భాషలను షెడ్యూలులో పెట్టి ప్రాంతీయ/మాతృభాషలకు ప్రతిపత్తిని, స్థాయిని, గౌరవాన్ని ఎందుకిచ్చారో ఆలోచించాలి. భారతీయులందరికీ ఒకేభాష, అది ఇంగ్లీషు మాత్రమే అని లేదా హిందీ అని రాజ్యాంగంలో రాయని సందర్భాన్ని గూర్చి ఆలోచించుకోవాలి. మనదేశంలోగల భాషా వైవిధ్యాన్ని గౌరవిస్తూ భాష ప్రాతిపదికగా రాష్ట్రాలను ఎందుకు ఏర్పరచారో, దాని ప్రాముఖ్యత ఏమిటో గమనించాలి. కేరళలో, ఆంధ్రప్రదేశ్‌లో, ఉత్తరప్రదేశ్‌లో అలా అన్ని రాష్ట్రాల్లో ఇంగ్లీషు భాషే లేదా హిందీభాషే ప్రజలభాష అని రాజ్యాంగంలో రాయలేదు. ఆనాటి ఆ నిర్ణయానికి ఒక విలువైన తలంపున్నది, ఆధారమున్నది, అవసరమున్నది. ఇప్పటి మాదిరిగా పిచ్చిముదిరి రోకలి తలకు చుట్టమన్న మాటలు, విధానాలు అప్పుడు లేవు. సర్వజనులను వారి భాషా సంప్రదాయాలను గౌరవించారు.

**న్యాయస్థానాలు రాజ్యాంగాన్ని గౌరవించటం లేదన్న వాస్తవాన్ని చెప్పటానికి సాహసించాల్సి వస్తుంది.** ఇది దురదృష్టం. ప్రస్తుతాంశం ఆంధ్రప్రదేశ్‌లో న్యాయస్థానాల్లో మాతృభాష తెలుగు వాడకం గురించే.

దేశ ప్రథమ పౌరుడు, రాష్ట్రపతి గౌరవనీయ రామ్‌నాద్ కోవింద్ న్యాయస్థానాల్లో ప్రాంతీయ భాషకు గౌరవం ఇవ్వాలని పిలుపు నిచ్చారు. ప్రస్తుత ఉపరాష్ట్రపతి గౌరవనీయ వెంకయ్య నాయుడు గారు ఉపరాష్ట్రపతి కాకముందు నుండి ప్రజలు, ప్రభుత్వాలు అన్ని సందర్భాలలో ప్రాంతీయ మాతృభాషలకు ప్రాముఖ్యమివ్వమన్నారు. భారతదేశంలోని అన్ని రాష్ట్రాలలో, ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అన్నివైపుల చుట్టుకొనివున్న రాష్ట్రాలలో భాషాభిమాన పరిస్థితిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వేసిన కమిటీ అధ్యయనం చేసి ఆ రాష్ట్రాలన్నీ వారి మాతృభాషలను గౌరవిస్తున్న వైనాన్ని ప్రభుత్వానికి తెలిపారు. భారతీయ భాషల ప్రతినిధులు చెన్నైలో (2015), ఢిల్లీలో (2016) బెంగుళూరులో (2018) సమావేశాలు జరిపి అన్ని ప్రాంతీయ స్థానిక భాషలకు, అన్ని ప్రభుత్వవిభాగలలో సమానహోదా, వినియోగం ఇవ్వాలని, అంతరించిపోతున్న భాషలను రక్షించాలని ప్రభుత్వలను ప్రజలను కోరుతూ తీర్మానాలు చేశారు. ఇంగ్లీషు మాత్రమే వినియోగించటం మంచి మార్గం కాదని తీర్మానించారు.

మన రాష్ట్రంలో తెలుగు భాషోద్యమ సమాఖ్య, రచయితల సంఘాలు, మేధావులు, భాషావేత్తలు, భాషాభిమానులు మన మాతృభాష తెలుగు బోధనా భాషగా, పాలనా భాషగా, న్యాయస్థానాల్లో భాషగా వుండాలని ముక్తకంఠంతో ప్రభుత్వానికి తెలిపారు.

ముఖ్యంగా మనం ప్రస్తుతం చర్చించుకొనవలసిన విషయమేమంటే, సుప్రీం కోర్టులోను, మన రెండు తెలుగు రాష్ట్రాల రెండు హైకోర్టులలో నున్న తెలుగు న్యాయమూర్తులు రెండు తెలుగు రాష్ట్రాలలో పలుచోట్ల సభలలో ఉపన్యాసాలిస్తూ, మాతృభాష తెలుగును ప్రేమించండి, మాతృభాషను రక్షించండి అని సందేశాలు, సూచనలు, సలహాలు ఇస్తున్నారు. చాల సంతోషం. కాని ఆ సలహాలు ఎవరికి ఇస్తున్నట్లు అర్థం కావటం లేదు. న్యాయవిభాగంలోని న్యాయమూర్తులకు, న్యాయసిబ్బందికి, న్యాయవాదులకు తప్ప మిగతా ప్రజానీకానికా? ఆ సలహా ఆంధ్రరాష్ట్రంలోని (ఆంధ్ర) న్యాయమూర్తులకు న్యాయస్థానాలలో సిబ్బందికి ఇవ్వటం వారి చేతిలో పనేకదా? సదరు న్యాయమూర్తులు జిల్లాలలో న్యాయస్థానాలలో ఇతర సభల, సమావేశాలలో మాట్లాడేటప్పుడు న్యాయస్థానాలలో మాతృభాషను రక్షించు చర్యలు తీసుకొనుటకు న్యాయమూర్తులకు, న్యాయస్థానాలలో సిబ్బందికి సూచనలుగాని, ఉత్తర్వులుగాని, సదుపాయాలుగాని ఇచ్చు చర్యలు చేపట్టవచ్చు. ఆయవకాశం వారికున్నది. జిల్లాలలో న్యాయమూర్తులతో చర్చలు జరిపి జిల్లా స్థాయిలోని న్యాయస్థానాలలో మాతృభాష తెలుగును వాడుటలో గల ఇబ్బందులను తొలగించి పరిపాలనా పరంగా రాజ్యాంగాన్ని, సి.పి.సిని, సి.ఆర్.పి.సి.ని గౌరవిస్తూ వారేగాని, వారి పై అధికారులచేగాని తగు ఉత్తర్వులు నిప్పించు విధంగా చర్యలు తీసుకొనవచ్చును. సాక్ష్యాలు తెలుగులో రాయించటం, తీర్పులు తెలుగులో రాయించటం, అవసరమొచ్చే అతికొద్ది కేసుల్లో అనువాదం చేయించుకోవటం వారి పరిధిలో లేదంటే చట్టము, న్యాయవాదులు నమ్మరు. న్యాయవాదులతో, జిల్లాల న్యాయమూర్తులతో, న్యాయస్థానాల సిబ్బందితో చర్చించి సాంకేతిక సహాయాన్ని ఏర్పాటు చేయవచ్చు. సంబంధిత అధికారులతో చర్చించవచ్చు. నిఘంటువులను, చట్టాలను, జి.వొలను తెలుగులో చేయునట్లు ఏర్పాటు చేయవచ్చు. న్యాయవాదులు దిగువ న్యాయస్థానాలలో తెలుగు వాడవచ్చు. ఏదిచేయాలన్నా తెలుగు హృదయం కావాలి. సభల్లో సభారంజకంగా ఎవరైనా వట్టి ఉపన్యాసాలిచ్చినంత మాత్రాన ఏమీ జరగదు. తెలుగులో సరియగు పదాలు దొరకవనే వంక, తెలుగులో కంప్యూటర్ మీద తెలుగు టైపుకు సిబ్బంది, సాఫ్ట్‌వేరు లేదనే వంక, అభినందించ దగినవికావు. తెలుగులో 5వ తరగతి చదువుకున్న పల్లెటూరు వ్యక్తి, వీధుల్లో కంప్యూటరు పెట్టుకొని డి.టి.పి. జాబ్ వర్క్ చేయటం మనం చూస్తున్నాము.

**న్యాయస్థానాల్లో ప్రజలభాషలో ప్రజలు న్యాయం పొందటం ప్రజలకు రాజ్యాంగం ఇచ్చినహక్కు. ఇది ప్రాథమిక హక్కుతో సమానం. ఉల్లంఘన న్యాయస్థానాలకు సంబంధించిన వ్యక్తులకు భావ్యముకాదు.**

కనుక ప్రభుత్వము, న్యాయస్థానాలు మాతృ హృదయంతో, మాతృభాషను రక్షించుకొను చర్యలు చేపట్టటం అవసరం.

లిపి సంస్కరణ చర్చ

ఆచార్య కస్తూరి విశ్వనాథం
09480770557

# రంగనాయకమ్మగారి ప్రతిపాదనలు...

ప్రముఖ రచయిత్రి రంగనాయకమ్మగారు తెలుగు అక్షరమాలను కొంత సంస్కరించుకోవాలి అని డిసెంబర్ 2017 సంచికలో వ్రాసిన వ్యాసంపై చర్చ జరుగుతున్నది. ఆ వ్యాసం మొదటి వాక్యంలోనే 'తెలుగు అక్షరాలలో కొన్ని అనవసరపు అక్షరాలున్నాయి' అన్నారు.

అనవసరమైతే అవి వేల సంవత్సరాల నుంచి వర్ణమాలలో ఎందుకున్నాయి? ఏ విషయం తీసుకొన్నా అన్నీ అందరికి అవసరమై యుండవు. ఒక అంగడికెళ్తే అందులో ఉన్న వస్తువులన్నీ అందరికి అవసరమై ఉండవు. కాని కొందరికి అనవసరమైనవి మరికొందరికి అవసరమైనవిగా ఉండవచ్చు. అందుచేత అంగడివాడు కొందరికి మాత్రం అవసరమైనవి ఉంచి మిగతావి తీసి వేయడు, అటువంటిదే వర్ణమాల కూడ. కొందరికి తాము వాడే భాషకు వర్ణమాలలోని అన్ని అక్షరాలతోను పని ఉండదు. మరికొందరికి, ప్రాచీన సాహిత్యాలు చదవదలచుకొన్న వారికి, అన్ని అక్షరాలు అవసరమై ఉంటాయి. పై రెండు వర్గాలలో ఏ వర్గంవారికేవి కావాలో వాటిని ఎంచుకుంటారు. చదువుతారు, వ్రాస్తారు కూడ. మొదటి వర్గంవారు తమకు కొన్ని అక్షరాలు అవసరం లేదు కాబట్టి వాటిని వర్ణమాల నుంచి తీసివేయమనటం సమంజసం కాదు. ప్రాచీన సాహిత్యం చదవాలనుకొనే వారికి అన్ని అక్షరాలు తెలిసి ఉంటేనే కదా అది వీలయ్యేది?

**2వ అంశం:** ఋ, ౠ, ఌ ౡ ల విషయం. దేశంలోని అన్ని భాషల మీదా – గిరిజన భాషలు తప్ప – అనాదిగా సంస్కృత ప్రభావం ఉంది. ఎన్నో సంస్కృత పదాలు తత్సమాలుగాను, తద్భవాలుగాను ఈ భాషలలో ప్రయోగంలో ఉన్నాయి. సంస్కృత పదాలను యథాతథంగా గ్రహించటానికి అనువుగా ఉండటానికి – అంటే ఋషి, ఋతువు వంటి పదాలను వ్రాయటానికి అన్ని భాషలవాళ్ళు లిపి సంకేతాలను సృష్టించుకొన్నారు. అట్లా సృష్టింపబడినవే తెలుగులో ఋ, ౠ, – ఌ ౡ లు కాలక్రమేణా ఌ ౡ లు వాడుకనుంచి జారిపోయాయి. ఋ ౠలు హల్లులతో కూడినప్పుడు ఉపయోగించటానికి వాటి ద్వితీయ రూపాలైన ృ, ౄ లు కూడా సృష్టించబడినాయి (ఉదా : కృతము, ధృతి, సంస్కృతం, కృష్ణుడు, పితౄణం).

ఇక్కడ శబ్దం అనే మాటను అక్షరం అనే అర్థంలో వాడారు (శబ్దం ఎప్పుడూ పదాన్నే సూచిస్తుంది గాని అక్షరాన్ని కాదు. (ఆ లోకూడా ఒక శబ్దమే. ఇ లో గాని, ఉ లో గాని, ఎ లోగాని ఒక్కొక్క శబ్దాలే' అన్నారు) అవి ధ్వనులు, శబ్దాలు కాదు.

'ఋ ను చూస్తే, దీన్ని రు గా చదవాలి. రు అంటే ర్ + ర్. ఉ=రు అవుతుంది' అన్నారు. కాని దాన్ని రు గా చదవటం కాదు, 'వ్రాయాలి'. అని ఉండాలి. అయినా ఇది స్పెల్లింగుకు సంబంధించిన విషయం. మనం ఈ రోజులలో నెత్తిన పెట్టుకొనే ఇంగ్లీషులో సైట్ అనే దానికి site అని, *cite* అని *sight* అని మూడు రకాల స్పెల్లింగులున్నాయి. వాటి తొలి అక్షరం *syllable* లో. అలాగే *(no, know)* లు కూడ. పైన ఇచ్చిన ఉదాహరణాలలో మొదటి దానిలో తొలి అక్షరం, రెండవ దానిలో మొత్తం పదంలో స్పెల్లింగులు వేరయినా ఉచ్చారణ ఒకటే. అటువంటి కంగాళీ భాషను ఈనాడు మనం నెత్తిన పెట్టుకొని ఊరేగుతున్నప్పుడు ఋ, రు ల ఉచ్చారణ ఒకటే అయినా స్పెల్లింగులు వేరు (*no, know* లాగా) అని ఎందుకు గ్రహించలేము. అవి రెండు ఒకే విధంగా ఉచ్చారణ కలిగి ఉన్నంత మాత్రాన ఒకదాన్ని తీసివేయటమేనా?

సంస్కృతంలోని ఋ తెలుగు రు కు సమానం కాదు. దాన్ని మనం సరిగ్గా ఉచ్చరించలేక, దానికి దగ్గరగా ఉన్న రు గా ఉచ్చరిస్తున్నారు, ఆంగ్లంలోని *f* కు సరియైన ధ్వని మన భాషలో లేదు కాబట్టి గ్రామీణులు దాన్ని ప గాఉచ్చరిస్తున్నారు. కాని వ్రాసేటప్పుడు ఫ వ్రాస్తున్నాము – అది ఫ కు సమానం కాకపోయినా కూడా – అనే విషయాన్ని ఈ సందర్భంలో గమనించాలి. ఌ ౡ లు ప్రస్తుతం వాడుకలో లేవు కాని సాంప్రదాయకంగా అని లిపిలో ఉంటున్నాయి. పనికట్టుకొని వాటిని తీసివేయవలసిన అవసరం లేదు. వాటిని వాడకపోతే సరిపోతుంది. ఒకప్పుడు అవి ఉండేవట అని తెలుసుకుంటే చాలు. వర్ణమాలలో ఉండటంవల్ల ఎవరికీ ఇబ్బంది లేదు. ఎవరూ వాటిని పిల్లల చేత వ్రాయించటం లేదు. నేను ముందే చెప్పినట్లు వాటితో అవసరమున్న వాళ్ళు వాటిని అంటే ఋ ౠ లను ఌ ౡ లను గ్రహిస్తారు. ఇంకొక విషయం. మనం ఈనాడు మాట్లాడేదే భాష అనుకొని దానికవసరం లేని వాటిని తొలగిస్తూ పోతే ఆ భాష వేళ్ళు, మొదలు లేని చెట్టవుతుంది. ఈ మధ్య వస్తున్న ఒకటవ తరగతి పుస్తకంలో ఌ ౡ లనే కాక ౠ ను కూడా వదిలిపెట్టి పుస్తకాలను తయారు చేస్తున్నారు. కనుక, కొన్ని పుస్తకాలలోను, పెద్ద బాలశిక్షలోను ఆ అక్షరాలు ఉన్నంత మాత్రాన ఎవరికీ ఇబ్బంది లేదు. వాటిని తొలగించాలి అనటం పిచ్చుక మీద బ్రహ్మాస్త్రం వెయ్యాలన్నట్లుంటుంది.

**3వ అంశం :** 'క లో శబ్దాలను చూడండి. క్ + అ = క,ఈ శబ్దాల్లో క్ అనేది మాత్రమే హల్లు. ఇది నిండు శబ్దం కాదు. ఈ సగం శబ్దానికి ఏదైనా ఒక అచ్చు శబ్దం చేరితేనే అది నిండు శబ్దమౌతుంది. 'క్' కి 'అ' అచ్చుశబ్దం చేరటం వల్లే అది 'క' అవుతుంది. ఇ శబ్దం చేరితే కి అవుతుంది' అని చెప్పారు. ఆమె శబ్దాలన్నవి ధ్వనులేకాని శబ్దాలు కావు. ఇదంతా అసంగతము, నిరర్థకము. శబ్దాలలో అంటే పదాలలో నిండు శబ్దాలు సగం శబ్దాలు అంటూ ఏవీ ఉండవు. ధ్వనులు శబ్దాలు కావని రచయిత్రిగారు గ్రహించాలి. ఇవన్నీ తప్పులే. వీటి మీద ఇటువంటి చర్చ అవగాహన లేమిని సూచిస్తాయి.

**4వ అంశం :** మళ్ళా ఋ, ఌ విషయం తెచ్చారు. ఋ (రు) అనేది సగం శబ్దంతోనే ఉందా? సగం శబ్దంతోనే కాదు., అ, ఆ, ల లాగా ఒక్క శబ్దంతో అయినా కాదు ర్ + ఉ గా రెండు శబ్దాలతో ఉంది. అలాంటి అక్షరం హల్లు కూడా అవదు' అన్నారు. ఇదంతా అనవసర ప్రసంగం. ఈ సగం శబ్దాలు, నిండు శబ్దాలు ఏమిటి? ఈ విశ్లేషణ ఏమిటి?

ఋ అనేది అచ్చు. అది కొన్ని సంస్కృత శబ్దాలలోనే ఉంటుంది. సాహిత్యంలో అవసరమనుకొన్న వాళ్ళు వాడుకొంటారు. అది వాళ్ళ ఇష్టం. ఇది కాదు, ఇవి వాడ కూడదు అని చెప్పటానికి ఇతరులకు హక్కు లేదు.

ఇంగ్లీషులో *site, cite, sight* అనే మూడు పదాల ఉచ్చారణ ఒక్కటే. కాని వాటి మొదటి అక్షరం, అంటే *syllable* లోని స్పెల్లింగులు వేరు ( *si,ci, si* ) అటువంటిదే *right, rite, write.* ఉచ్చారణ ఒక్కటే. మొదటి అక్షరంలోని స్పెల్లింగులు వేరు. అటువంటి అవకతవకల భాషను మనం నెత్తికెత్తుకొని ఊరేగుతున్న ఈ రోజులలో ఋషి లోని ఋ తోను, రుచి లోని రు తోను సర్దుకుపోలేకపోవడం ఏమిటి ? కూడా అటువంటిదే. వీటి మీద మళ్ళా వివరణ, చర్చ అనవసరం.

**5వ అంశం :** 'అసలు ఒక 'అక్షర' మంటే అది అచ్చుల్లోకిగాని, హల్లుల్లోకిగాని చేరేదిగా ఉండాలి. అలా కానిది అయితే అసలు అది అక్షరమే అవదు. అది, తర్కం లేకుండా తప్పుగా తయారు చేసిన గీతలు మాత్రమే అవుతుంది' అన్నారు. ఏమిటిది? దీనికర్థముందా?

**6వ అంశం :** మళ్ళా ఋ విషయమే. దీనిని గురించి పైన చాలా చర్చ జరిగింది. అంతకంటె దానిని గురించి మాట్లాడటం అవసరం లేదు. ఋ అచ్చుల్లో భాగమే. దాన్ని ఉపయోగించటం వాడేవారి వ్యక్తిగతం. కావాలనుకొన్న వాళ్లు వాడవచ్చు. ఆధునికులు వద్దనుకొంటే వదిలివేయవచ్చు.

**7వ అంశం :** 'హల్లుల్లో నుంచి కూడా నాలుగైదక్షరాలను తీసి వేయాలి. మొదట ఞ, ఙ, అనే అక్షరాల్ని చూడాలి. జని 'ఙ న్య' అని చదువుతాం. 'న్య' సంయుక్తాక్షరం. 'ఇన్య' లో ఉన్న మొత్తం శబ్దాల్ని చూస్తే 'ఇ+న్+య్+అ' గా 4 శబ్దాలు అవుతాయి. 4 శబ్దాలతో ఉండే అక్షరం, హల్లు అక్షరమా? – నవ్వాలి' అన్నారు.

**వివరణ :** ఎందుకు నవ్వాలి? రచయితగారు తెలుసుకోవలసిం దేమిటంటే – ఞ సంయుక్తాక్షరం కాదని, దాని ఉచ్చారణ ఇన్య కాదని, అది యేక ధ్వని అని. ముఖయంత్రం (*Vocal Apparatus*) లోని ఉచ్చారణావయవాలను క, గ లను ఉచ్చరించే స్థితిలో ఉంచి మృదు తారువును – తాలువు వెనుక భాగాన్ని కొండనాలుకతో సహా – క్రిందికి దించి 'ఊపిరితిత్తులలో నుంచి బయటకు వచ్చే గాలిని ముక్కు ద్వారా బయటకు పోయేటట్లుగా ఉంచి క నో గ నో ఉచ్చరించాలి. అట్లా చేస్తే వచ్చే ధ్వని ఙ. ఇది అనునాసిక వ్యంజనం. దీనిలో నాలుగు శబ్దాలు లేవు. ధ్వనులు కూడా లేవు. అది ఙ్ అనే ధ్వని, అనునాసిక ధ్వని. IPA (International Phonetic Alphabet) లో దీనిని ŋ గుర్తుతో సూచిస్తారు. టైపు చేస్తేనో వ్రాస్తేనో దానిని ŋ పైన చుక్క పెట్టి ṅ గా సూచిస్తాము. *పంకం, శంఖం అంగం, సంఘం* అనే మాటలలో క, ఖ, గ, ఘ అక్షరాలకు ముందు వినిపించేది ఙ్ కారా ధ్వనియే.

అట్లాగే,

'ఞ + ని అయితే 'ఇణి' అని చదవాలి. ఇందులో శబ్దాల్ని చూస్తే 'ఇ+ణ్+ ఇ' ఇవి మూడు శబ్దాలు. ఏమిటీ ఈ అక్షరాలు? పిల్లలకు నేర్పేటప్పుడు, క చ ట త ప లాంటి తేలిక అక్షరాల్ని నేర్పినట్లుగా ఞ ఙ లను నేర్పటం సాధ్యమేనా? సాధ్యమా కాదా – అని కాదు. అసలు అవి హల్లులుగా ఉండే అక్షరాలా? అవి, అలా ఉండటానికి పనికిరాని అక్షరాలు. కాబట్టి అక్షరమాలనుంచి ఈ అక్షరాలను కూడా తీసి వెయ్యాలి" అని అన్నారు రచయిత్రిగారు.

**వివరణ :**

ఞ కూడా పైన చర్చించిన ఙ లాంటిదే. రచయిత్రి గారు చెప్పినట్లు దీన్ని ఇణి అని చదువరు. దీనిలో ఇ+ణ్+ఇ అనే మూడు శబ్దాలుగాని, లేక ధ్వనులుగాని లేవు. దీనిని నోటిలోని తాలువును అంటే నోటిపై భాగాన్ని బాగా క్రిందికి దించి ఊపిరి తిత్తులలోనుంచి బయటకు వచ్చేగాలిని నాసికా వివరం ద్వారా – అంటే ముక్కు ద్వారా బయటకు పోయేటట్లుంచి, చ కారాన్నో జ కారాన్నో ఉచ్చరించాలి. అప్పుడు వినిపించేది ఞ. *పంచ, పింఛం, పుంజు, ఝుంఝు* శబ్దాలలో వినిపించే ధ్వని ఞ్ ధ్వనియే. 'పిల్లలకు నేర్పేటప్పుడు క చ ట త ప లాంటి తేలిక అక్షరాలను నేర్పినట్లుగా ఙ ఞ లను నేర్పటం సాధ్యమా' అని రచయిత్రిగారు సందేహం వెలిబుచ్చారు. నేను పైన ఉదాహరణలుగా ఇచ్చిన *పంకం, శంఖం, అంశం, సంఘం* శబ్దాలు, అలాగే *పంచ, పింఛం, పుంజు, ఝుంఝు* అనే శబ్దాలు పిల్లలు నేర్చుకొంటే ఙ, ఞ లు నేర్చుకొన్నట్లే అనేది రచయిత్రిగారు తెలుసుకోవాలి.

కనుక ఙ ఞ లు హల్లులే. అవి ఏకవర్ణాలే. వాటిని ఆ వర్గాలకు – క వర్గ చ వర్గాలకు చెందిన అనునాసికాలంటారు.

**8వ అంశం :** 'హల్లుల భాగంలో క్ష త్ర కూడా ఉన్నాయి. అవి ఇప్పుడు లేకపోయినా మా చిన్నతనంలో ఉండేవి' అన్నారు. తెలుగు వర్ణమాలలో క్ష ఉంది. కాని త్ర లేదు. దేవనాగరిలో కూడ క్ష త్ర లను అవి సంయుక్తాలయినా ఒకే అక్షరంగా వాడతారు. क्ष त्र కాబట్టి వాటికి వేరు గుర్తులను ఏర్పరచారు. క్ష హిందికి చెందిన దేవనాగరి లిపిలో కనిపిస్తుంది. (ఏది ఏమైనా క్ష, క, ష ల సంయుక్తం) త్ర, త, ర, ల తో ఏర్పడిన సంయుక్తం వీటిలో తెలుగులో క్ష ఉంది కాని త్ర లేదు. మీరు వ్రాసిన (8 కింద వ్రాసినది) ఈ పేరాగ్రాఫులోనే (8వ అంశంలో మొదటి పేరా) మీరు తీసివేయమంటున్న క్ష 12 సార్లు వచ్చింది. అది లేకపోతే మీరు దీన్ని ఎట్లా వ్రాయగలిగేవారు? మీరు కోరినట్లు క్ష అక్షరమాలలో చిట్ట చివరి అక్షరంగానే (అది సంయుక్తం కాబట్టి) వస్తుంది కదా. నిజానికి క, ష ల సంయుక్తాక్షరం క్ష అయినా అది క్ష అని వ్రాయబడకుండా క్రింద ష కారంలోని సున్న విడివడి కొమ్ములాగా ( ‿ ) వస్తుంది. దీనికి కారణం తెలుగు నోళ్ళ నుంచి వినబడే క్ష కు క్ష కు కొంత తేడా ఉంది. (ఉదా॥ రిక్షా, రక్ష) అందుచేత, దాన్ని ప్రత్యేక అక్షరంగా వర్ణమాలలో చివరన చేర్చారు. మరి దానిని ఎందుకు తీసివేయమంటున్నారు? దానిని తీసివేస్తే దానికి ప్రత్యామ్నాయం మీరు చూపించలేదు. రక్ష, భిక్షం, అక్షరం, వంటి వాటిని ఎట్లా వ్రాస్తారో సూచించలేదు.

**9వ అంశం :** అ. తెలుగు అంటే మాట్లాడేది పత్రికలలోవ్రాసేది మాత్రమే కాదు. దీనికి 2000 సంవత్సరాలకు పై బడిన లిఖిత సాహిత్యముంది. ఇప్పుడు మనం ఉచ్చరించటం లేదనే నెపంతో ఆ సాహిత్యాన్నంతా తగలబెట్టమంటారా? పాత సాహిత్యాన్ని చదివి అర్థం

పరభాషను అడ్డుపెట్టి తెలుగు కాంతినాపలేరు

చేసుకోవాలనుకునేవారికి వెసులుబాటు ఉండాలి కదా? నిజానికి ర, ఱ లను నేడు ఉచ్చారణలో తేడా లేదని వేరుగా వ్రాయటం మానేసినా, ఆరు – ఆఱు, వేరు – వేఱు, ఏరు – ఏఱు, అరుగు – అఱుగు వంటి శబ్దాలలో ర, ఱ ల కు తేడాలున్నాయి. అంటే అవి అర్థభేదాన్ని సూచిస్తాయి. కనుక ప్రాచీన సాహిత్యం చదివే వారికి సంకటం, సందిగ్ధత లేకుండా సులభంగా అర్థం చేసుకోవటానికి, అంటే ఉదాహరణానికి, అరుగు – 'కూర్చొనే తిన్నె', లేక అఱుగు 'జీర్ణమగు', ఏరు 'ఎన్నుకొను', వేరుచేసి ఎత్తుకొను' లేక ఏఱు = 'నది', లలో మాదిరిగా ఏ పదం ఏ అర్థంలో ప్రయోగింపబడిందో సులభంగా గుర్తించవచ్చు. సాంప్రదాయకంగా వ్రాస్తున్న పద్ధతిలో కాక, ర, ఱ లను రెండింటిని కలిపేస్తే రచయిత పదాలను ఏ అర్థంలో ప్రయోగించాడో పాఠకులకు సులభంగా అర్థంకాక పోవచ్చు. వేరుగా వ్రాస్తే అర్థంచేసుకోవటంలో పాఠకులకు ఇబ్బంది కలగదు.

ఏది యేమైనా ఈ కాలపు రచయితలు ర, ఱ లను వేరుగా వ్రాయటం వదిలి వేశారు. కాబట్టి అవి లిపిలో వేరుగా ఉన్నంత మాత్రాన ఎవరికీ ఇబ్బంది లేదు. కనుక వాటిని తీసివేయాలని పట్టు పట్టడం సమంజసం కాదు.

ర ను భాషా శాస్త్రజ్ఞులు తాడితం అంటారు. దీనిని r గుర్తుతో సూచిస్తారు. దీని ఉచ్చారణలో నాలుక కొన, పై పండ్లకు కొంచెం వెనుక, తాలువును ఒకసారి స్పృశిస్తుంది. ఱ ను కంపితం అంటారు. దీని ఉచ్చారణలో నాలుక కొన అదే స్థానంలో తాలువును ఒకటి కంటె ఎక్కువసార్లు వెంటవెంట కాలింగు బెల్లులో సుత్తిలాంటి కొన గిన్నెను కొట్టినట్లు తాకుతుంది. ఇది ఏఱు వంటి శబ్దాలలో ఆధునిక తెలుగులో వినిపించక పోయినా ద్విత్వంలో మఱ్ఱి, గొఱ్ఱె, గుఱ్ఱం వంటి శబ్దాలలో స్పష్టంగా వినిపిస్తుంది. ఆధునిక తెలుగులో ర్ర కూడా అటువంటి ధ్వనినే కలిగిస్తుంది. కనుక కొందరు ఱ ను లిపిలో చూపించవలసిన అవసరం లేదు అంటారు. కాని ప్రాచీన సాహిత్యంలోని పదాలను అర్థం చేసుకోవటం కోసం అది అవసరం అని నా ఉద్దేశం. ప్రాచీన సాహిత్యం చదువుతున్నప్పుడు ఏరు శబ్దం వచ్చినప్పుడు గులకరాళ్ళను కాయలను ఎత్తుకోవటం' అని, ఏఱు వచ్చినప్పుడు 'నది' అని సులభంగా గ్రహించవచ్చును.

**10వ అంశం :** ఇక్కడ ఏ సమస్య లేదు. తలకట్టుతో అంతమయ్యే అక్షరాలకు తలకట్టు తీసివేసి ఆ స్థానంలో దీర్ఘం (కా), గుడి (కి) గుడి దీర్ఘం (కీ), ఎత్వం (కె), ఏత్వనదీర్ఘం (కే), ఒత్వం (కొ), ఓత్వన దీర్ఘం (కో) ఐత్వం (కై), ఔత్వం (కౌ) తగిలిస్తాం. కొమ్మును తలకట్టు స్థానం నుంచి ప్రారంభించి పక్కన తగిలిస్తాము, దీర్ఘం కావలసి వస్తే ఆ కొమ్ముకే దీర్ఘమిస్తాము (కు, కూ). మ, య ల విషయం తీసుకొంటే ఆ అక్షరాలు కుడివైపు కొమ్ముతో పూర్తవుతాయి. ఈ అక్షరాలకు కూడా ఇలాగే చేయవచ్చు. తలకట్టు తీసివేసి అక్కడ గుడి గుర్తు ( ి ) దాని దీర్ఘం ( ీ ) ఏత్వం ( ె ) దాని దీర్ఘం ( ే ) తగిలించవచ్చు, అంటే మీ మె, మే లు మామూలుగానే ఉంటాయి. చెయ్యి ఎత్తకుండా కూడా మి, మీ, మె, మే లు వ్రాయవచ్చు.

రచయిత్రిగారు 'మీ అని వ్రాస్తే మ మీద ఇ గుర్తు ( ి ) ఒక చోట ఈ గుర్తు ( ే ) ఙు ఇంకొక చోట వచ్చినట్లు అవదూ, అంతే కాక ా అనే గుర్తు ఆ గుర్తు (ఆ అక్షరానికి చెందిన గుర్తు) అవుతుంది కాని ఈ గుర్తు ఎలా అవుతుంది' అని ధర్మ సందేహం వెలిబుచ్చారు. ఇక్కడ ఒక వివరణ అవసరం.

తెలుగు లిపిలో ా, ౕ రెండూ దీర్ఘానికి సంకేతాలే. మనం ఏది ఎక్కడ సరిపోతుందో దాన్ని అక్కడ ఉంచుతాము. అంటే ఆ (కా) ఊ (కూ) లకు ా గుర్తును, ఈ ౕ కీ), ఏ (కే) ఓ (కో) లకు ౕ గుర్తును దీర్ఘ సంకేతంగా వాడతాము. అంటే ా, ౕ గుర్తులు రెండూ దీర్ఘ సంకేతాలే.

కాబట్టి మి మీద దీర్ఘం రావలసి వస్తే పై రెండు సంకేతాలలో ఏదో ఒకటి వాడుకోవచ్చు. రచయిత అనుకూలానుసారంగా.

ఇక్కడ రచయిత్రిగారు ా, ౕ లు రెండు ఒకటే అని గుర్తిస్తే చాలు.

కాబట్టి, మి విషయంలో దీర్ఘం కావలసి వస్తే మీ, గాని మిా గాని వ్రాయవచ్చు. కాని ి బదులు మ కు, ా వాడాలనుకొంటే అది మౌ మీ లాగా తయారై చదవ వీలు కాకుండా పోతుంది. అలాగే కై, కె, కొ లకు దీర్ఘం పెట్టాలనుకొంటె అది ా మాత్రమే వీలౌతుంది. (కే, కో) ఇక్కడ ా పెట్టడం వీలుకాదు. అలాగే హ కు దీర్ఘం పెట్టాలనుకొంటే అది ౕ తోనే వీలవుతుంది. హా లాగా. ఇక్కడ రెండో దీర్ఘ సంకేతమైనా ా ను పెడితే అది హా, గా తయారై వ్రాతలోగాని ముద్రణలోగాని అసహ్యంగా కనిపిస్తుంది. అంతేకాక హా గా వ్రాయ వీలుకాదు. య కు కూడ పైన చెప్పినవన్ని వర్తిస్తాయి. కాని ఇక్కడ రచయిత్రిగారికి మరొక సందేహం ఏమిటంటే య కు ఇకారం వచ్చినప్పుడు ఇకారపు గుర్తును తగిలించకుండ తలకట్టుకు తొలగించి వదిలేస్తున్నారు. ఎందుకు అనేది. ఇది ముద్రణలో సాంప్రదాయకంగా వస్తున్నది. వ్రాతలో కాదు. మనం యి అని అని వ్రాస్తే ఎవరికి అభ్యంతరం లేదు కాబట్టి కొందరు యి గాను కొందరు యి గాను వ్రాస్తున్నారు. దాన్ని యి గా వ్రాసినా దీర్ఘమిచ్చేటప్పుడు యౌ అని గాని యీ అని గాని వ్రాస్తున్నారు.

11వ అంశం : మిగతా అక్షరాల మాదిరి మ విషయంలో ...అని ఎందుకు వ్రాయటం లేదు, అనేది రచయిత్రిగారి ధర్మ సందేహం. మొ, మో లను మొ మో లుగా వ్రాస్తే కొమ్ము, ఓత్వము కలిసిపోయి చదివే వాళ్లకు ఇబ్బందికరంగా ఉంటుంది. కనుక మొ, మో అని వ్రాస్తారు. అంటే, మ కు ఏత్వము, ప్రక్కన కొమ్ము కలిపితే మొ, ఏత్వము పక్కన దీర్ఘము ఇస్తే మో అవుతుంది. ఇదే ప్రాచీనము. దేశంలోని చాలా ఇతర భాషలలో కూడా ఇలాగే వ్రాస్తారు. 50 సంవత్సరాలకు ముందు తొ కొ లను తెు కెు లుగా తెలుగులో వ్రాసేవారు.

12వ అంశం : ద ధ, ద ధ, బ భ విషయంలో భ కు తలకట్టు తీసివేసి భ గా ఎందుకు వ్రాయ కూడదు. అన్నారు. 'భ, లో తర్కం ఉంది. 'భ లో తర్కం లేదు' అన్నారు. ఇందులో తర్కం ఏమిటి? వాటిని వ్యాకరణ పరిభాషలో అల్ప ప్రాణాలు మహా ప్రాణాలు అన్నారు. అంటే ఒత్తులేని అక్షరాలు, ఒత్త క్షరాలు అని అర్థం. భ కు తలకట్టు తీసివేస్తే అది వ్రాసేటప్పుడు ఖ గా అయ్యే ప్రమాదముంది. ఇంత వరకు వీటివల్ల

**తెలుగు ప్రాధికార సంస్థ ఏర్పాటుకై చట్టాన్ని వెంటనే తేవాలి**

ఎవ్వరికి ఏమీ కష్టం కలుగలేదు. మరి రచయిత్రిగారికేమి కష్టమయ్యిం దిక్కడ.

**16వ అంశం :**

ఇంగ్లీషులో ఉన్న తికమకలు, తలనొప్పులు తెలుగులిపిలో లేవు. ఇంగ్లీషులో ఒకే ధ్వనికి రెండు మూడు గుర్తులు, ఒకే గుర్తుకు రెండు మూడు ధ్వనులు వస్తూ ఉంటాయి. ఉదాహరణకు క(క్) ధ్వనికి *k,q,c* అనే మూడక్షరాలున్నాయి... అలాగే *u* గుర్తును *a,u* అనే రెండు ఉచ్చారణలున్నాయి *but* లో *a, put*లో *u*, తెలుగుభాషలో ఈ సంకటాలు దరిద్రాలు లేవు. అటువంటి ఇంగ్లీషును అభిమానించి ఆదరించే వాళ్ళు తెలుగులో ఏవైనా ఒకటి రెండు తేడాలుంటే నేర్చుకోలేరా? ఆంగ్లాన్ని ఆదరించి తెలుగును ఉపేక్షించటం వల్ల వచ్చిన పరిస్థితే ఇదంతా. ప్రారంభ కాలంలో అక్షరాలు కనిపెట్టినవాళ్ళు కొన్ని పొరపాట్లను చేసి ఉండవచ్చు. తర్వాత కాలం వాళ్ళు వాటిని సరిచేసుకో కూడదా' అన్నారు. తెలుగులిపి ఒకరు కనిపెట్టింది కాదు. ఇది దక్షిణ బ్రాహ్మి లిపి నుంచి వెయ్యి సంవత్సరాలకు పైగా మార్పులు చేర్పులతో ఈనాటి రూపానికి వచ్చింది. రచయిత్రిగారు తిరుమల రామచంద్రగారి **'మన లిపి పుట్టు పూర్వోత్తరాలు'**, అనే పుస్తకం చదివి ఉండకపోతే చదవమని మనవి చేస్తున్నాను. ఇది మళ్ళా చెప్పిందే చెప్పటమవు తుందిక్కడ. 13, 14, 15 అంశాలలో చెప్పారు కదా! మళ్ళా అదే కత ఎందుకు?

**18వ అంశం :**

పై చర్చ దృష్ట్యా తెలుగు లిపిలో నుంచి ఏ అక్షరాన్నీ తొలగించ నవసరం లేదు. రచయితలు, మాట్లాడేవారు ఎవరికి కావలసినవి వారు తీసుకొంటారు. నాకు ఇష్టం లేదనో, నేను వాడననో తీసివేస్తూ పోతే ఇప్పుడు లేక ఇంక కొన్నాళ్ళకు ళ ణ లు కూడా తీసివేయమంటారు. ఎందుకంటే, కొన్ని ప్రాంతాల ప్రజలు, ఆ ప్రాంతంలో పుట్టి పెరిగిన ఇతర ప్రాంతీయుల యువతరం వారి నోళ్ళ నుంచి ళ, ణ లు వినపడటం లేదు. ఇవి మనం, టి.వి. ల లోను, సినిమాలలోను చూస్తున్నాము. నీళ్ళు, కాళ్ళు, పెళ్ళి – నీల్లు, కాల్లు, పెల్లి అయిపోయాయి. అట్లాగే రాణి, కాణి, వాణి లు రాని, కాని, వాని గా వినిపిస్తున్నాయి. 18వ అంశంలోని చివరి వాక్యంలో 'వెనుకటి కాలపు విషయాల్ని మార్చ కూడదు అనుకో కూడదు'. అన్నారు రచయిత్రిగారు. మరి వేల సంవత్సరాల, అంటే వెనుకటి కాలపు సాహిత్యాన్ని ఏం చేద్దాం? కాబట్టి, ఏదీ మార్చాల్సిన అవసరం లేదు. ఇప్పటికే అరసున్నలు, విసర్గలు లేకుండా వ్రాయటంతో ప్రాచీన సాహిత్యం అర్థం చేసుకోవటంలో ఇబ్బందులు కలగటం, చ జ లు వదిలి వేయటంతో ఉచ్చారణ దోషాలు కోకొల్లలుగా వినిపించటం జరుగుతున్నది.

**19వ అంశం :**

రచయిత్రిగారూ! మీరు ఒకటవ తరగతి పుస్తకం వ్రాసినప్పుడు అక్షరమాల నుంచి 10 అక్షరాలను తీసివేసినట్లు, అలా తిరస్కరించిన మీరు 'జ్ఞానము అని రాయవలసి వచ్చినప్పుడు ఞ (ఇఞ)ని అప్పుడప్పుడు వాడే తప్పు చేస్తూనే ఉన్నాను' అన్నారు. ఇట్లా మీరు కొన్ని అక్షరాలను తీసివేసి వ్రాసిన భాష, మీకు, మిమ్మల్ని అనుసరించే అతి కొద్ది మందికి తప్ప ఇతరులకు అర్థం కాదు కదా? మరి అది ఎవరికోసం? ఏదైనా చేస్తే అది అందరికి ఉపయోగకరంగా ఉండాలి కదా!

"నేను ఞ ను కూడా వదిలేశాను కదా? కాని దాన్ని జ్ఞా అని రాసేటప్పుడు వాడుతున్నాను. 'నువ్వు వదిలేసిన అక్షరంతోనే ఆ మాట ఎందుకు రాస్తున్నావు?' అని నన్ను ఇప్పటివరకు ఎవ్వరూ అడగలేదు? అన్నారు. ఒకటి మీరు తప్పు లేకుండా వ్రాశారు కాబట్టి అది అడగలేదు". రెండు, మీరు వదిలేసి వ్రాసినదాన్ని ఎవ్వరూ చదవటం లేదని అనుకోవాల్సి వస్తుంది. ఎవరైనా చదివిన వాళ్ళు ఉంటే వాళ్ళు మీకు అతి దగ్గరివాళ్ళుగాని, మిమ్మల్ని పట్టించుకోని వాళ్ళుగాని అయి ఉంటారు.

**20వ అంశం :**

'మ్రు లో శబ్దాలు మ్ + ర్ + ఉ' అన్నారు. (ఇవి శబ్దాలు కావని ధ్వనులని నేను ముందే చెప్పాను) 'మ్రు, అనే అక్షరాన్ని మృ గా రాసే పద్ధతి కూడా ఉంది' అన్నారు. పద్ధతి కూడా ఉంది కాదు, అసలు పద్ధతి అదే. ఋ కారం మీద అంత వివరంగా మీ అభిప్రాయం తెలిపిన తర్వాత మీరిచ్చిన 3వ 4వ ఉదాహరణలలో చంధృడు – చంద్రుడు, కౄరము – క్రూరము అని ఇచ్చారు. చంధృడు, కౄరము ఎక్కడ నుంచి తెచ్చారు? అటువంటివి ఇంతవరకు తెలుగు భాషలో ఎక్కడా లేవు. మీ **'ఇదండీ మహా భారతం'** పుస్తకం అట్ట మీద కూడ కౄరత్వాలు అనేమాట ఇట్లాగా తప్పుగా ఉంది. క్షమించండి. మీరు మొదటి నుంచి కూడా క్రూను తప్పుగా (కౄగా) వ్రాయటం అలవాటు చేసుకొన్నారనిపిస్తున్నది. ఇటు వంటి ఉదాహరణాలు ఇచ్చేటపుడు మీకు స్పష్టంగా తెలియకపోతే ఏ నిఘంటువునో చూసి సరి చేసుకోవాలి కదా!

'ృ గుర్తు వాడకాన్ని వదిలేస్తే అక్షరం పక్కన చోటు తగ్గుతుంది. రాయడం తేలిక అవుతుంది' అన్నారు. గృహము అనే శబ్దాన్ని గ్రుహము అని వ్రాస్తే గృ లోని ృ కారం తొలగటం వల్ల చోటు తగ్గుతుంది అన్నారు. గ పక్కన ృ తొలగినా ఎడమవైపునో (గ్ర) లేక కింది వైపునో (గ్ర) చోటు పెరగటం లేదా? అంతే కాదు వట్రువసుడి ( ృ ) ని తొలగించి ఆ స్థానంలో గు అని గ కు కొమ్ము తగిలించటం లేదా? అంటే గృ లో వట్రసుడి (వట్రువసుడి) పోయి దాని స్థానంలో కొమ్ము (గు) ఆ పైన ఎడమవైపునో (గ్రు), క్రింది వైపునో (గ్రు) ర కారం వస్తే మీరు తగ్గించిన చోటు కంటే ఎక్కువ చోటును గ్రు ఆక్రమించు కొంటుంది. ఇదెక్కడి తర్కం, దీనివల్ల పొదుపు చేసిన చోటెంత?

మీరు మీ పుస్తకాలలో ఖ, ఘ, ఝ లను ఠ ను వదిలివేసి వ్రాసినట్లు, క, గ, జ, ట లకు నిలువుగానో, ఏటవాలుగానో గీతలు పెట్ట ప్రయత్నించినట్లు, కాని అవి టైపు చేయటానికి, ముద్రించటానికి వీలు కానట్లు ఒప్పుకొన్నారు. అంటే, మీ కొత్త సృష్టికి ఇంకా ప్రజల సహకారం లభించలేదని, టైపు మిషన్లు, కంప్యూటర్లు, సాఫ్టవేరు తయారు చేసే వాళ్ళు ఆ మార్పులకు అవకాశాలు కల్పించలేదని ఒప్పుకొన్నారు. మరి ఎవరికోసం మీరు ఈ ప్రయోగాలు, ప్రయత్నాలు చేస్తున్నారు? 'కొన్ని అక్షరాలను తీసివేసి వాటిని వాడటం మానివేశానుగాని ఠ, ఝ వంటి వాటిని వదిలెయ్యటం సాధ్యం కావటం లేదు' అని, సంస్కరణలను ఎక్కువమంది అంగీకరించటానికి అవసరమైన ప్రయత్నాలు చెయ్యాలి గాని, అది ఒంటరిగా సాధ్యం కాదు' అని మీరే ఒప్పుకొన్నారు. దీనికోసం

**ఓట్లు అడిగేది తెలుగులో...ఉత్వర్వులిచ్చేది ఇంగ్లీషులోనా?**

పత్రికలవారు, ప్రభుత్వ అకాడమీలు, భాషా శాస్త్రజ్ఞులు, భాషా బోధకులు, రచయితలు, చర్చించి ఒక అంగీకారానికి వచ్చి ప్రయత్నాలు ప్రారంభిస్తే కొన్నాళ్ళకిది సాధ్యం కావచ్చు' అని సెలవిచ్చారు చివరన. ఇటువంటి పనులు చేయడానికి ఎవరూ ముందుకు రారు.

**ముగింపు :**

లిపి భాష కాదు. అది భాషను సాహిత్యాన్ని పదిలపరచుకోవటానికి సృష్టించబడిన ఒక మాధ్యమం, ఒక సాధనం. ఇది ఈ నాడు మనం మాట్లాడే, వ్రాసే భాషా సాహిత్యాలనే కాక, ఇంతకు ముందు తరతరాలుగా వెలసిన సాహిత్యాన్ని కూడా ఇముడ్చుకోగలిగిన సాధనం అయి ఉండాలి.

మరొక్క మాట. ప్రపంచ వర్ణమాల సమావేశము, అంతర్జాతీయ వర్ణమాల సంఘము (world alphabetic conferance & International Alphabate Association) ప్రపంచంలోని అన్ని లిపులలో, అంటే దాదాపు 4900 లిపులలో తెలుగు లిపిని రెండవ అత్యుత్తమ లిపిగా ఎన్నుకొన్నారు (2016 జనవరిలో) మొదటిస్థానం కొరియా భాషా లిపికి పోయిందట. ఒక లిపికి కావలసిన లక్షణాలన్నీ ఉంటేనే కదా మరి ఇటువంటి గౌరవం లభించేది. అంటే ప్రపంచమంతటా మంచి లిపిగా గుర్తింపబడిన మన లిపిని రకరకాల సాకులు చెప్పి దాన్ని ఛిన్నాభిన్నం చేసే ప్రయత్నాలు చేస్తున్నారు కొందరు. దీనివల్ల తెలుగు భాషకు తెలుగు ప్రజలకు సత్ఫలితాలు లభించకపోగా నష్టాలే ఎక్కువ జరుగుతాయి.

కాబట్టి, తెలుగు లిపిని సంస్కరించ వలసిన అవసరం – అందులోను, రచయిత్రిగారు మరికొందరు సూచిస్తున్నంతగా – కనిపించదు. ఒక వేళ అవసరం అనుకొంటే చ కార జ కారాలను ఈ తరం వారు తప్పుగా ఉచ్చరిస్తున్నారు కాబట్టి దాన్ని సరి చేయటం కోసం చే, జే, లను పునరుద్ధరించాలి. కొన్ని పాఠ్య పుస్తకాలలోను, నిఘంటువులలోను చ జ లను చే జే లను వేరుగా చూపించారు. (ఉదా॥ చ – చక్రం, చామరం, చే, చే – చేలి, చేవు.

జ – జనం, జ – జలుబు, జాలి, జాతర, మొదలైనవి. కాని వ్యవహారంలో చాలా మంది తప్పుగా పలుకుతున్నారు. అలాగే, ఆంగ్లం, అరబ్బీ భాషల ప్రభావంతో తెలుగులో చేరిన *f* కు సమానంగా ఒక గుర్తును, ఆంగ్ల పదాలైన *Bank, Bat* వంటి వాటిలోని అచ్చుకు ఒక గుర్తును సూచించవచ్చు. ప్రస్తుతం f కు ఫ వ్రాస్తున్నారు. దీనివల్ల వచ్చిన కొత్త ప్రమాదం ఏమిటంటే, చాలా మంది ఫలం ఫాలం వంటి మాటలను falam faalam అనటం వినిపిస్తున్నది. కాబట్టి f కు ప ను ఒత్తున్నచోట చిన్న సున్న ం ను, *bank* వంటి మాటల్లో వచ్చే అచ్చుకు ఆ గుర్తునుగాని లేక పదం మొదట్లో యా (యాక్టరు) పదం మధ్యలో (*bank* వంటి వాటిల్లో య కారపు గుర్తు *bank* ను) గుర్తునుగాని, మరేదైనాగాని సూచించవచ్చు. లేకపోతే అవకతవకల ఇంగ్లీషు ఉచ్చారణను మనం అలవాటు చేసుకొంటున్నట్టే *f, fha* లను *a, x* చ, చ, జ, జ లతో సర్దుకొని అలవాటు చేసుకొంటే సమస్య తీరిపోతుంది. బళ్ళల్లో ఉపాధ్యాయులు పిల్లల ప్రారంభదశలో ఉచ్చారణను సరిగా బోధించ గలిగితే ఈ సమస్య తీరిపోతుంది.

కవిత

# అమ్మ చెప్పింది!

నీళ్ళంటే–
తెలియని వాళ్ళెవరుంటారు
అమ్మ ఉమ్మనీటిలో పెరిగిన నాటి నుండి
చివర తులసి తీర్థం పోసేదాకా
నీళ్ళే కదా ప్రాణాధారం
నీళ్ళల్లో తిరగకపోతే భూగోళం
ఈ చైతన్యం యీ జీవజాలం
వేటికీ మనుగడ ఉండదు
అంటాం కానీ –
సర్వేంద్రియానాం నయనం ప్రధానం అని
ఆ నయనాలకి తడిలేకపోతే
గుండెకి కదలిక ఎక్కడుంటుంది !!
నీళ్ళకి తడిలేకపోతే ప్రాణం మొలకెత్తనట్టు
ప్రాణానికి నీళ్లంటే ఏమిటో యీ ముడి
ఆకాశానికి నీళ్లంటే ప్రేమే
ఆవిరిగా పీల్చుకొని మేఘమై పరచుకొని
నీళ్ల ముంగిట్లో కళ్ళాపి చల్లుతుంది
అమ్మ నడిగాను
కన్నీళ్ళెప్పుడూ ఉప్పగానే ఉంటాయని
గుండెల్లో భారాన్ని తగ్గించేందుకు
కరిగే ఉప్పుని కన్నీళ్ళు తోడేస్తాయని
అమ్మ చెప్పింది – నిజమేనేమో
అమ్మ పోయినప్పుడు యింకి పోయే దాక
కన్నీళ్ళు కారికారి గుండె భారం తగ్గింది.

గుర్రాల రమణయ్య
9963921943

రంగనాయకమ్మగారి వ్యాసంలో ప్రస్తావించిన అంశాలపై ఇంత వరకు జరిగిన చర్చను ఇంతటితో నిలిపివేస్తున్నాము. దీనిపై రచయిత్రి స్పందన అవసరం అనుకొని, వ్రాసి పంపితే ప్రచురిస్తాము. ఆ పైన ఇంకొంత చర్చ అవసరమనిపిస్తే తెలిసినవారు వ్రాసి పంపవచ్చు. రంగనాయకమ్మగారికీ చర్చలో పాల్గొన్న విజ్ఞులందరికీ ధన్యవాదాలు


తెలుగుకు సాధికారతతోనే తెలుగు రాష్ట్రాల అభివృద్ధి

భాషోద్యమ కథానిక

సడ్లపల్లె చిదంబరరెడ్డి
9440073636

# జూసి

"...చూస్తే ఇంగ్లిష్...చదివితే తెలుగు.. .రెండుభాషలకూ వారధిలాగా ఉన్నదని చాలా మంది భాషోద్యమ కారులు తెగ మెచ్చుకొన్నారు. ఇప్పుడు "జూ సి" – అనే పేరుతో వస్తున్న కవితలన్నీ నేను రాసినవే" అంటూ మరికొన్ని కాగితాల్ని నా మీదకు తోశాడు.



సరిగా తడి అందక అంతంత మాత్రమే ఉన్న పూల మొక్కల మధ్య చాపకింద నీళ్లలా విస్తరిస్తున్న గడ్డీగాదాన్ని చేత నయినంత మట్టుకు గిల్లి పారేసి, ఇంటి ముందున్న తోటలో నుంచి వచ్చి అప్పుడప్పుడే వరండాలో కూర్చొన్నాను.

సుమారు నలభై యేళ్లు పైబడ్డ ఒక వ్యక్తి నా ముందుకొచ్చి నిలబడి "నమస్తే సార్! బాగున్నారా??" అన్నాడు.

ప్రతి నమస్కారం చేస్తూ అతని వైపు కళ్లు చికిలిస్తూ "ఎక్కడో చూసినట్లుంది! ఎవరా?" అని అంచనా వేస్తున్నంతలో... అతనే కల్పించుకొని, "సార్! మీరు గుర్తు పట్టినట్టు లేదు. కొన్ని యేళ్లకు ముందు మీరు మా ఊరిదగ్గర హయిస్కూల్లో పని చేశారు. ఇదుగో మా అబ్బాయి శౌంతి శ్రీకర్. అప్పుడు మీరు వీడ్ని ప్రేమతో శుంఠాకర్ అని పిల్చేవారు కదా!!"

అంటూనే ఇరవై ఏళ్ల వయస్సుకు దాదాపుగా ఉన్న ఒక శాల్తీ పళ్లిగలిస్తూ వచ్చి నా ముందు నిలబడింది.

ఎలుక శ్రవణాల్లా పక్కలకు నిక్కబొడుచుకొన్న చెవులు, ఈత చెట్ల రెమ్మల కొనల్లా తలనిండా నిటారుగ మేకులు దిగగొట్టినట్లున్న వెంట్రుకల ఆకారాన్ని జ్ఞాపకాల అడుగుపొరల నుంచి బయటికి లాగి గుర్తుపట్టాను.

ఆ అబ్బాయి ఆరు చదివే సమయంలో మొదటిసారి ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ మాధ్యమం మొదలయ్యింది.

ఆ సమయంలో వయస్సు పైబడిన నన్ను పిలిచి హెడ్మాష్టరు, "ఆంగ్ల అక్షరాల్ని కొంచెం బాగా చదవడం, రాయడం చేయగలిగిన వార్ని గమనించి ఆంగ్ల మాధ్యమంలో చేర్చుకోండి" అని నన్ను పురమాయించాడు.

అప్పుడు ఈ శ్రీకర్ గాడికి తెలుగు అక్షరాలు కాదుకదా వాని పేరుకూడా రాయడం వచ్చేది కాదు. అందుకే తెలుగు మీడియంలోనే ఉంచేశాను.

అయితే మరుసటి రోజు వాళ్ల నాన్న రెడ్డీరాయల్ చౌదరి బడికి వచ్చి వాళ్ల బాబును ఆంగ్లానికి మార్చుకొమ్మని హెడ్మాష్టరును అడిగితే అతన్ని నా దగ్గరకు పంపాడు.

ఇంగ్లీషు రాక తానెంత నష్టపోయిందీ ఏకరువు పెట్టి, ఎలాగైనా వాళ్ల అబ్బాయి పేరును ఆరోజే ఆంగ్లానికి మార్చమన్నాడు. అప్పుడు నేను....

"అయ్యా! మీరు ఆశపడడంలో తప్పు లేదు. అయినా మీ అబ్బాయికి అమ్మ, ఆవు.. అనే పదాలు రాయడం పలకడం కూడా రాదు అలాంటప్పుడు పరభాష నేర్చుకోవడం అంత సులభం కాదు!!" అన్నాను.

దానికతను "అక్కడే మీరు పొరబడుచున్నారు సార్!! తెలుగు పూర్తీ చదవడం, రాయడం వచ్చాక తలలో ఖాళీ మిగలదు! ఇక

**పరభాషా ద్వేషం, పరభాషా దాస్యం – రెండూ తప్పే**

ఇంగ్లీషును చేర్చుకోవడానికి చోటెక్కడ ఉండి చస్తుంది!!

మా అబ్బాయి బుర్రంతా ఖాళీయే కాబట్టి అందులోకి ఇంగ్లీషు అక్షరాల్ని చేర్చడం చాలా సులభం" అనే అతిపిత్తం లాజిక్కును లేవనెత్తాడు.

ఆ మాటల్తో నా ఒంట్లో కంపరం మొదలై హెడ్మాష్టరుకు విన్నవించుకొన్నాను.

అప్పుడు హెడ్మాష్టరు ఒంటరిగా నన్ను బయటికి లాక్కెళ్లి "అతను మామూలు వ్యక్తి కాదు! ఒళ్లంతా రాజకీయం బుద్ధులు జీర్ణించుకొన్న పొరుగూరి ప్రసిడెంటు. వీడికి డిపాజిట్టు కూడా రాదని ఆ వూరి ప్రజలంతా అనుకొన్నప్పటికీ ఏవో కుయుక్తులు చేసి అరకొర మెజార్టీతో గెల్చి ప్రసిడెంటుగిరీ చెలాయిస్తూ వుంటాడు. ఇటువంటి వారితో వాదించీ ప్రయోజనం ఉండదు. "గుడిలో గంట పోతే పూజారికి...అదేదో పోయినట్లు" అనే సామెత మీకు తెలియంది కాదు!! అని హితబోధ చేస్తే ఇంగ్లీషు సెక్షనుకు మార్పుచేశాను.

అయితే వాడు ఏ పరీక్షలోనూ ఒకటి రెండు మార్కులకు మించి ఎదగలేక పోయాడు. సరికదా...అయ్యవార్లే పిల్లలకు సరిగా పాఠాలు చెప్పడం లేదని రెడ్డీరాయల్ చౌదరి గారు తల్లిదండ్రుల సమావేశాల్లో మా మానాలు తీసేవాడు.

మేము నోరు విప్పేవారం కాము.

చివరికి ఒకరోజు మా ఇంటికి వచ్చి "సారూ! మీరు అడిగినంత ఫీజు ఇస్తాను, మావాడిని మీ ఇంటి దగ్గరే వదిలేస్తాను నాలుగు ఇంగ్లీషు ముక్కల్ని నేర్పండి" ప్రాధేయపడ్డాడు.

"అయ్యా! నాకు రెండురకాల బుద్ధులు, రెండురకాల బోధనలూ రావు!! వెనుకబడిన వారినంతా కొంతైనా ముందుకు తేవాలనే ప్రయత్నాన్ని శాయశక్తులా బడిలోనే చేస్తున్నా.." అని సున్నితంగా తప్పించుకొన్నాను.

అదే సమయానికి ఆ ఊళ్లో ఉన్న చిన్న బ్యాంకుకు బదిలీ పై కేరళ ప్రాంతపు వ్యక్తి వస్తే అతని భార్య అంతో ఇంతో చదివి బొత్తిగా రాని తెలుగుతో పిల్లలకు ట్యూషన్లు చెప్పడం మొదలు పెట్టింది.

అంతలో నేను బదిలీ పై ఆ పల్లెకు దూరం అయ్యాక తెలిసింది ఏమిటంటే.....ఆర్ ఆర్ చౌదరి ఇంటి వెనకాల పెద్ద పశువుల కొట్టు వుంటే దాన్ని కాన్వెంటుగా మార్చి "అంగట్లో ఆంగ్లం" అనే పేరుతో "అదర్ ద్యాన్ మదర్ టంగ్ – అదరగొట్టక పోతే అడగండి" అనే కాన్సెప్టుతో కేరళ అతని భార్యనే హెడ్మాష్టరుగా మొదలు పెట్టి ఆ ప్రాంతంలో చాలా తెలుగుబళ్ల వాకిళ్లకు కంపలు కొట్టేలా చేశాడట!! ఇంకా చాలా చాలా విషయాలు తెలుస్తూ ఉండేవి.

ఇక ఉద్యోగ విరమణ తరువాత ఈ బళ్లు చదువులను గురించిన వార్తలు నాకు తెలిసేవి కాదు.

ఇప్పుడు ఆ రెడ్డీరాయల్ చౌదరి గారు నన్ను కలవడానికి ఎందుకొచ్చాడో ఏమో? అర్థం కాక కుర్చీ చూపించి కూర్చొమ్మని చెప్పి విషయం అడిగాను.

అతను మరో ఉపోద్ఘాతం లేకుండా నేరుగా "సార్! ఆ నాడు మా అబ్బాయికి ఇంగ్లిష్ రాదన్నారుకదా? ఇటు చూడండి ఇరవై యేళ్ల లోపు పిల్లలు రాసిన ఉగాది కవితల పోటీల్లో మా శ్రీకర్ గాడికి రాష్ట్రస్థాయి బహుమతి వచ్చింది. ఏ తెలుగు, ఇంగ్లిష్ పత్రికల్ని చదివినా, ఏ ఫేసుబుక్కు, ఏ వాట్స్ యాపు గుంపుల్ని తెరిచి చూసినా వీడు రాసిన కవిత్వమే! ఎక్కడెక్కడో జరిగిన సన్మానాల ఫోటోలే..." అంటూ నాకు చూపబోయాడు.

అప్పుడు నేను "అయ్యా! నాకు కళ్లు సరిగా కనిపించవు" అని, బయట ఆడుకొంటున్న మనుమరాల్ని కేకేసి పిల్చి మేడ మీది గదిలోని అద్దాల్ని తెమ్మని, అతని నోటి ద్వారానే విందామని చదవ మన్నాను.

ఆ అబ్బాయి ఏదో పత్రికలాంటిది తీసి "పాడింది కోకిల, కూసింది చిలక, ఎగిరింది గువ్వ, తిరిగింది ఈగ, పూసింది వేప, కాసింది మామిడి, కట్టండి తోరణం, చేయండి సంబరం, మే మిప్పుడు పిల్లలం, రేపొతాం పెద్దలం... అంటూ చదువుతున్నాడు.

అంతలో మనుమరాలు సులోచనాలు తేస్తే ఇంకా ఏముందో చదువుదామని పేపరు చేతికి తీసుకొన్నాను....

padindi kokila

kusindi chilaka

tirigindi ega ....అని

ఇంగ్లీషు అక్షరాల్తో తెలుగు పదాలు...వాటిని కూడబలుక్కొని చదవలేక పోయి "ఇది తెలుగా? అంగ్లీషా? నువ్వు రాసింది కవిత్వమా???" అని ముఖాన్ని చిట్లించుకొన్నాను.

"అవును సార్! ఇంటర్ నెట్టు రావడంతో ప్రపంచం కుంచించుకు పోవడం మీకు తెలిసినట్లు లేదు. దానికి తోడు ఇంగ్లిష్ మీడియం, తెలుగు మీడియం అంటూ చదువరులంతా రెండు వర్గాలుగా విడిపోతున్నారు. ఆ ఇద్దర్నీ ఒకే తాటి మీదికి తేవడానికి ఆ మధ్య అంతర్జాతీయ విశ్వశాంతి సంస్థ ఇరవై యేళ్ల లోపు వారికందరికీ కవితల పోటీ పెట్టింది!! అదికూడా పెన్నూ, పేపరు యూజు చేయకుండా యూనీకోడ్ ద్వారా టైపు చేసి ఇంటర్నెట్లో ఒక వెబ్లో పెట్టమన్నారు.

అప్పటికప్పుడు స్మార్టు ఫోను తెచ్చి ఉగాది ప్రాశస్త్యాన్ని గూగులు నుంచి తెలుసుకొని కవిత రాశాను.

చూస్తే ఇంగ్లిష్...చదివితే తెలుగు...రెండుభాషలకూ వారధిలాగా ఉన్నదని చాలా మంది భాషోద్యమ కారులు తెగ మెచ్చుకొన్నారు. ఇప్పుడు "జూ సి" అనే పేరుతో వస్తున్న కవితలన్నీ నేను రాసినవే "అంటూ మరికొన్ని కాగితాల్ని నా మీదకు తోశాడు.

వాటిని తాకడానికి ఝుదుసుకొని "అవునూ నీ పేరు శొంఠి శ్రీకర్ కదా!! ఈ 'జూ సి' ఏంది జూలుకుక్క తోక లాగా అన్నాను.

"సార్! జూ అంటే జూనియర్ అని. సీ అంటే చిదంబరం... అది మీ పేరే!! "జూ చి" అంటే అదేదో ఛీదరింపులాగుంటుందని "చి" ని, "సి" చేసి "జూ సి" అనే కలం పేరుతో రాస్తున్నాను. మీ తదనంతరం మీ పేరు నిలబెట్టడానికి కంకణం కట్టుకొన్నాను..." అని ఇంకా ఏదో చెప్ప బోయాడు.

అంతలో నా తల తిరిగినట్లయింది. మరలా ఏమి జరిగిందో నే నెక్కడున్నానో తెలియడం లేదు! తెలిస్తే చెప్పండి!!

డా॥ వేదగిరి రాంబాబు
9391343916

# మరణంలేని మహనీయుడు

అయ్యకోనేరు దాటగానే ఉన్న మండువాలోగిలి మెట్లు ఎక్కలేక ఎక్కలేక ఎక్కుతున్న ఆయనను చూడగానే ఎవరికైనా చటుక్కున ఓ వింత అనుభూతి కలుగవచ్చు.

కింద హాల్లోనే కాస్సేపు కూర్చోవచ్చు కదానిపిస్తుంది, కాని ఆయన గది మొదటి అంతస్తులోనే ఉంది. అందుకే ఓపికనంతా కూడదీసుకుని ఒక్కో మెట్టు ఎక్కుతున్నాడు.

ఆయన మనకి వృద్ధుడిలా కనిపిస్తున్నాడు గాని మధ్య వయస్కుడే!

గ్లాస్కో దుస్తులే భారమనుకుంటున్న ఆ ఒంటిమీద, మూడు కోటులూ తలపాగానీ ఎలా మోస్తున్నారో కదా ననిపిస్తుంది. సన్నటి రివ్వులా ఉన్న ఆయన్ని చూస్తుంటే తల భారమై ఎక్కడ వెనక్కి పడి పోతారేమోనన్న భయం ఎవరికైనా అనిపించక మానదు. పైకెక్కగానే కుడి ప్రక్కన ఒక చిన్న గది, మరో పెద్ద గదీ, ఎదురుగా ఓ పెద్ద హాలుంది. ఆ సువిశాలమైన హాలు దాటితే ఆయన గది. ఎదురుగుండా ఉన్న పెద్ద గది లోకి అడుగుపెట్టబోయినవాడల్లా, మనవలూ మనవరాళ్లూ పాఠాల్ని బట్టీ పడుతున్న తీరు చూసి ఒక్కక్షణం ఆగారు.

పిల్లలు, ఆయన వచ్చింది కూడా ఎవరు గమనించలేదు. ఎవరి మానాన వారు ఎదురుగా ఉన్న పుస్తకాలు చదువుతూ బట్టీ పట్టడంలో మునిగిపోయారు.

చిన్నగా నిట్టూర్చిన ఆయన ఆ గదికి ఆనుకుని ఉన్న తన గదిలోకి అడుగు పెట్టారు. ఆయన ఎన్ని గ్రంథాలు చదివారో, ఎంతమందితో ఎలాంటి ముచ్చట్లు జరిపారో అన్న సమాచారమంతా అక్కడి పుస్తకాలూ, అక్కడి గ్రంథాలూ ఎవరికైనా చెప్పకనే చెబుతాయి.

"తాతయ్యా! మంచినీళ్ళు తీసుకురానా?"

చిన్న మనమడు తాతగారి దగ్గరకొచ్చాడు.

బట్టీలు పట్టి చదువుతున్న పిల్లలతీరు ఆ తాతగారికి బాధనిపించినా చిన్న మనమడు అలా అడిగేసరికి ఆనందపడిపోయాడు.

"వద్దులే నాన్నా" అంటూ వాడిని తీసుకుని పడకకుర్చీలో ఒళ్ళో కూర్చోబెట్టుకున్నారు.

"నాన్నా! ఏం చేస్తున్నార్రా?" అడిగారు.


"అదేంటి పుస్తకాలేసుకుని మేం పాఠాలు బట్టీపెడుతుంటే అల్లా అడుగుతున్నారు?'' ముందు గదిలోంచి మరో మనవడొచ్చి తాతగారినడిగాడు.

ఇంతలో పిల్లలందరూ తాతయ్య దగ్గరికి బిలబిలా వచ్చేశారు.

"అదేంటి తాతయ్యా? – మేము చదువుకుంటుంటే అలా అంటావ్?"

"మీరు చదివేవి పొట్టకూటి చదువులు" తాత పీక్కుపోయిన బుగ్గల సొట్టలు చిన్ననవ్వుతో కొంతవరకూ పూడుకుపోయాయి.

"మీరు ఆ పుస్తకాల్లో ఉన్న విషయాల్ని అర్థం కూడా తెలుసు



గురజాడ

కోకుండా కళ్ళు మూసుకుని బట్టీ పడుతున్నారు. కాని చదువంటే జ్ఞానాన్ని పెంచేది గాని ఇంత పొట్టకూటికి తోడ్పడేది కాదు. అర్థం తెలియకుండా అలా చదువుకుంటూ పోవడం వలన ఉపయోగం ఉందంటారా? ఒక్కసారి ఆలోచించండి– తెలుగు రాకుండా, తెలుగుజాతి ప్రజల గురించి తెలుసుకోగలరా?..." ఆయన ధోరణికి పిల్లలు విస్తుపోయారు.

ఇంతలో కోడలు అక్కడికి ఒక గ్లాసు నీళ్ళూ, మరొక గ్లాసు బార్లీతో వచ్చి ఆయనకిస్తూ "పెద్దవాళ్ళకే ఈ విషయాలు తెలియని రోజుల్లో పిల్లలకివన్నీ ఎలా తెలుస్తాయి చెప్పండి"

"అలా అనకూడదమ్మా! పిల్లలకు తెలియకపోతే పెద్దలు తెలియజెప్పాలి – జీవితాలు చదవడానికి ఈ అక్షరాలు తోడ్పడతాయి"ఒక్క గుక్క మంచినీళ్ళు తాగి తిరిగి గ్లాసు టీపాయ్‌మీద పెట్టేశారు.

"పిల్లల్లారా! పదండి భోజనాలకు" అనడంతోనే వాళ్ళు తమ అమ్మలతో భోజనాలకి దిగిపోయారు.

ఓ విరక్తి నవ్వు ఆయన పెదాలమీద మెరిసింది.

భోజనాలు....!

తనకి తెలిసిన భోజనం ఒక్కటే. అది హృదయాన్ని పెంచేది, మనసులోని మాలిన్యాన్ని తొలగించేది! అనిపించేదాయనకు.

అంతేకాదు, గతం కూడా ఒకసారి అతని కళ్ళ ముందు మెదిలింది. చిన్నప్పట్నుంచీ తను అర్భకుడు. అజీర్ణం, ఆస్త్మా లాంటివెన్నో అనారోగ్యాలు ఇబ్బంది పెడుతుండేవి, నెలలు నిండకుండా పుట్టడం వలన! భోజనం అరగడం లేదని కొన్నాళ్ళు పాలుతాగి గడపాలనుకున్నారు. కాని నోరంతా పొక్కిపోయింది. విధిలేక బార్లీ గంజిలాంటివి తీసుకుని కొన్నాళ్ళు గడపవలసి వచ్చింది.

ఆయన ఆలోచనలు ఆయనకే నవ్వు తెప్పించాయి. అయినా మొదట్నుంచీ తన ఆహారం మెదడుకేగాని పొట్టకు కాదు కదా! తానెప్పుడూ పొట్టకూటి చదువులకు వ్యతిరేకమే! నీరసంగా ఉన్నప్పుడు ఇలా ఏ ద్రవాహారాన్నో, కోడలో, పిల్లలో పైకి తీసుకొచ్చి ఇస్తారు. ఆయన తన గదిలోనే స్వీకరించి చుట్టూ ఉన్న గ్రంథపఠనంలో మునిగిపోతుంటారు. ఒంట్లో బాగుంటే, కాస్సేపు కింద కొచ్చి, భోంచేసేటప్పుడు నలుగురితో సరదాగా గడుపుతారు. ఆరోజు ఆయనకు నీరసంగా ఉండటంతో సరాసరి పై కొచ్చేశారు. నీరసంగా ఉండేటప్పుడు శక్తి మాటల ద్వారా కూడా వెళ్ళిపోతుంది. అందుకని ఆయన తక్కువగా మాట్లాడేవారు. ఈరోజు నీరసంగా ఉండటంతో సరాసరి పైకే వచ్చేశారు.

తన ఆలోచనలు రకరకాలుగా పోసాగాయి. తనకంతగా తిండిమీద ఇష్టముండదు. ఎప్పుడో ఓసారి మినపరొట్టె తినాలనిపించింది. మిత్రుడు నారాయణ దాసుగారు మినపరొట్టెలు బాగా వేస్తారు. అందుకని ఆయనను కోరి మరీ మినపరొట్టెను వేయించుకుని తినలేదూ తను? పైగా దాంట్లో నంజుకోవడానికి నెయ్యీ తేనె కావాలని కోరారు. తాను ఎక్కువగా ఇష్టపడే ఆహారం విజ్ఞానం. కాని మారుతున్న ఈ రోజుల్లో పిల్లలకి పెద్దలు అందిం చాలనుకుంటున్నది. మంచి ఉద్యోగాలు దొరికే చదువు అందించాలని. కాని నా పిల్లలకే కాదు నా తరువాత తెలుగువాళ్ళందరికీ కూడా విజ్ఞానాన్ని అందించే చదువు కావాలి...తన జాతి పిల్లలు బట్టీల చదవులకి కాకుండా లోకజ్ఞానాన్ని పెంచే చదువులు చదివితే, దేశం ఖచ్చితంగా ముందడుగు వేస్తుందనిపించిందాయనకు. అందుకని పిల్లలు పొట్టకూటికోసం పాకులాడే అవసరం రాకుండా పెద్దలు చూడాలి...ఇటువంటి ఆలోచనల మధ్య ఆయన కళ్ళు మూతలు పడ్డాయి.

గతంలోనుంచి మనం కనుక వర్తమానంలోకొస్తే, తాతగారికి –

తాతగారికి అనారోగ్యం, వయస్సూ ఇంకా ఎక్కువయ్యాయి. రాజాగారికొలువుకెళ్ళడం కూడా మానుకున్నారు. ఎక్కువసమయం ఇంట్లోనే...!

వైద్యంకోసం విశాఖపట్టణం, చెన్నైలాంటి పట్నాలకెళ్తూ ఉండే వారు.

ఆయన సమాచారం తెలియకపోవడంతో రాణివారే స్వయంగా ఆ తాతగారింటికొచ్చారు. 'మీకేమైనా ఇబ్బందులున్నాయా? అంటూ పలుకరించారు. తాతగారు "నాకే ఇబ్బందిలేదుగాని, ఓ చిన్నకోరికుంది" అన్నారు ఎంతో వినమ్రంగా.

'చెప్పండి' అన్నారు రాణి లలితాదేవిగారు.

'ఏం లేదండి – ఈ గదిలో ఉన్నవన్నీ నేను కష్టపడి సేకరించిన గ్రంథాలు. ఎన్నో విషయాలమీద ఎందరో మహానుభావుల అభిప్రాయాలు – ఇవన్నీ మన భావిపౌరులకు తెలిస్తే, వాళ్ళు జాతికి మరింతగా ఉపయోగపడగలరు. అందుకని దయచేసి వీటిని విజయనగరం ఎంఆర్ కాలేజీలో విద్యార్థుల కోసం ఉంచవలసిందిగా కోరుతున్నాను.

ఆయన కోరిక వినగానే రాణిగారితో పాటు అందరూ విస్తుపోయారు. 1915 నవంబరు 29 రాత్రి...తాతగారు పూర్తిగా మాటలు మానేసి సంజ్ఞల ద్వారా తన యిష్టాయిష్టాలు చెప్పే స్థితికొచ్చారు. నీరసంతో కళ్ళు తెరవడం కూడా కష్టమవుతుంది.

నెమ్మదిగా పెదాలు విప్పి చాలా చిన్నగా 'నా ఒంట్లో బాగాలేదు – కిందికి తీసుకెళ్లండి' చుట్టూ ఉన్న వాళ్ళతో అన్నారు.

కింది హాల్లోకి తీసుకొచ్చారు.

ఆయన మాట పూర్తిగా పడిపోయింది.

కళ్ళు కూడా మూతలు పడుతూంటే బలవంతాన వాటిని పెగల్చుకుంటూ తల్లివేపు చూశారు...

కింద టపటపా కన్నీళ్ళు రాలాయి.

తెలుగు వారందరికీ తాతగారైన ఆ మహనీయుడి దృష్టి తల్లి మీదే నిలిచి పోయింది. అప్పటికే తండ్రీ తమ్ముడూ విడిచి పెట్టి వెళ్ళిపోయారు. తనూ వెళ్ళిపోతూ తల్లికి మరింత బాధ కలిగిస్తున్నానన్న బాధ ఆ చూపులో.

ఆ తాతగారెవరో మీరందరూ ఇప్పటికే గమనించే ఉంటారు. ఆ పిల్లలకే కాదు మన తెలుగువారందరికీ తాతగారు. ఆయనే గురజాడ వేంకట అప్పారావు!

ఆయన తల్లికి కన్నీరు మిగిల్చినా మనందరికీ మన తెలుగు భాషను సాహిత్యాన్ని దగ్గరకు చేర్చాలన్న తపనతో, జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు.

మాష్టారు పాఠం చెప్పడం పూర్తి కాగానే సభ చప్పట్లతో మారు మ్రోగిపోయింది.

అవును పిల్లలూ మీరు ఒప్పుకుంటారా ఆయనకు మరణం లేదని. తెలుగువాళ్ళు బతికున్నంతకాలం వారి మనస్సుల్లో ఆయన బతికే వుంటారు.

# మీరు 'అమ్మనుడి' చందాదారులేనా?

'అమ్మనుడి పత్రికకు చందాదారులు పంపే చందా సొమ్మే ఆధారం. కనుక –పత్రికకు చందా పంపించి, ప్రతినెలా పత్రికను పోస్టులో అందుకోండి.

1. తాము చందాదారులైతే మీకు పంపే పత్రికపై చందా ఏ నెల వరకు ఉన్నదీ పేర్కొని వుంటుంది. దయచేసి దానిని గమనించి, సకాలంలో మీ చందా సొమ్మును పంపించి పత్రికను ఎల్లప్పుడూ అందుకోండి.


2. తాము చందాదారులు కాకపోయినా, తమకు గౌరవ ప్రతిగా (కాంప్లిమెంటరీగా) ఉచితంగా అందుతూ వుండవచ్చు. అటువంటి మిత్రులకు పత్రిక నచ్చితే, దయచేసి చందాను పంపించి తోడ్పడగలరు. పత్రిక నచ్చకపోయినా, మీకు ఆసక్తి లేకపోయినా 'పత్రికను పంపవద్దు' అని దయచేసి ఒక కార్డుపైగాని, ఎస్.ఎం.ఎస్ / మెయిల్‌గాని పంపించి సహకరించగోరుతున్నాము.

3. పత్రికకు చందాను చెల్లించేవారు తమ ఇష్టాన్ని బట్టి శాశ్వత చందా (రు. 5000/–)గాని, 5 సం॥ల చందా (రు. 1000/–లు)గాని, 3 సం॥ల చందా (రు. 700/–లు)గాని పంపి పత్రికను ఆర్థికంగా తోడ్పడగలరు. వీలుగాకపోతే సం॥ చందా రు. 240/–లు పంపించి ఏటా పునరుద్ధరించుకోవచ్చు. – ప్రచురణకర్త, అమ్మనుడి.

# మౌనంలోని మాటలు

7

**సంచారి రావోళ్ళ నాగప్ప ఆత్మకథ**



కన్నడ మూలం:
**డా. ఆర్. వి. బి. కుమార్**

తెలుగు అనువాదం :
**రంగనాథ రామచంద్రరావు**
9059779289

**పోలీసు ఆతిథ్యం :**

ఒక చిన్న సంఘటన వల్ల కారటగి వెళ్ళడం మానేశాను.

సంచారులమైన మాలాంటి వారికి ఒక ఊరు లేదు. ఒక నెలవు లేదు. సామాన్యంగా ఏదో ఒక పెద్ద ఊరు లేదా పట్టణం బయటి వలయంలో మేము గుడారాలు వేసుకుంటాం. ఆ పట్టణం చుట్టుపక్కల పల్లెలకు బిచ్చానికి వెళతాం. లేదా కూలీ పనులకు వెళతాం. మాలాంటివారికి కూలీనాలీ దొరకడం చాలా కష్టం ! ఎందుకంటే ఊరి జనం మమ్మల్ని అనుమానంతో చూస్తారు. అందువల్ల మమ్మల్ని కూలీకి పిలవడం చాలా అరుదు. ఖాళీ సమయంలో మగవాళ్ళు చిన్నచిన్న చేపలు, ఎండ్రకాయలు, కుందేళ్ళవంటి జంతువుల వేటకు వెళితే ఆడవాళ్ళు జోలెలు, బొంతలు కుడుతూవుంటారు. సామాన్యంగా మా వాళ్ళు ఏ ఊళ్ళో నాలుగు రోజులు ఎక్కువగా ఆగుతామో అదే మా ఊరవుతుంది. మీది ఏ ఊరు? అని అడిగితే ప్రస్తుతం ఏ ఊళ్ళో మకాం పెట్టామో ఆ ఊరి పేరు చెబుతాం.

ఈ పై విషయాలు చెప్పడానికి ఒక కారణం ఉంది.

ఇప్పటికి రెండు సంవత్సరాల వెనుక ఒక సంఘటన జరిగింది.

గంగావతిలో నివాసమున్న కుటుంబంలోని ఒక అమ్మాయిని కంప్లి కుర్రవాడికి ఇచ్చి పెళ్ళి చేశారు. అబ్బాయి అమ్మాయి ఇద్దరూ మా కులస్థులే. మాలో ఇంకా కులాంతర వివాహాలు జరగటం లేదు. ఎందుకంటే మా రచ్చబండ పంచాయితీ ఇంకా బలంగా ఉంది. మునుపట్లా తప్పు చేసినవారిని శిక్షించడానికి మా వాళ్ళు ఈ రోజున శ్మశానంలో శవాన్ని కాల్చిన బూడిదను తమ ఉమ్మితో గోలీలు కట్టించడం లేదు. అయితే వారు ఏర్పరిచిన కట్టుబాట్లు మాత్రం ఇంకా సజీవంగా ఉన్నాయి. అందువల్ల ఎవరూ కట్టుబాట్లను దాటిపోరు.


సరే, అదలా ఉండనీయండి. గంగావతి అమ్మాయి, కంప్లి కుర్రవాడి విషయానికి వద్దాం. పెళ్ళేమో జరిగింది. అమ్మాయి భర్త ఇంటికి వచ్చింది. అయితే ఆ అమ్మాయిని కారటగి కుర్రవాడు ఎత్తుకునిపోయాడు. ఆ కుర్రవాడు ఎవరో కాదు. అతను మా అక్క (పెదనాన్న కూతురు) మనుమడు. అమ్మాయి భర్త వైపు జనం – అమ్మాయి మరో కుర్రవాడితో పారిపోయి ఉండటం వల్ల కంప్లి పోలీస్ స్టేషన్‌లో కంప్లయింట్ ఇచ్చారు. కంప్లి పోలీసులు అమ్మాయిని, ఆమెను పిల్చుకునిపోయిన కుర్రవాడి బంధువులలో కొందరిని పిల్చుకుని వచ్చి పోలీస్ స్టేషన్‌లో ఉంచారు. వాళ్ళను విచారించాల్సి ఉంది. అయితే ఇన్‌స్పెక్టర్‌గారు ఏదో పనిమీద వేరే ఊరికి వెళ్ళి వున్నారు. అందువల్ల విచారణను మరుసటి రోజుకు వాయిదా వేశారు.

"మీ బంధువులు ఈ ఊళ్ళో ఎవరైనా ఉన్నారా?" అని పోలీసులు కారటగి వాళ్ళను అడగటంతో– కారటగివాళ్ళు పోలీసులతో నా పేరు చెప్పారట.

రాత్రి పదిగంటల సమయంలో పోలీసులు నాకు ఫోన్ చేసి స్టేషన్‌కు రమ్మని కబురు పెట్టారు. నేను అప్పటికే తాగి, తిని, పడుకోవటానికి సిద్ధమయ్యాను. పోలీసుల నుంచి పోన్ రాగానే పోలీస్ స్టేషన్‌కు వెళ్ళాను. ఒక పోలీస్ నాతో మాట్లాడి కారటగి జనం మీ పేరు చెప్పారు. ఆ కారణంగా ఫోన్ చేశాను. వాళ్ళను మేము స్టేషన్‌లో ఉంచుకోలేం. మీ ఇంటికి పిల్చుకునిపోయి రేపు ఉదయం పిల్చుకుని వచ్చి మాకు అప్పగించండి అని చెప్పాడు. గత్యంతరం లేక అంగీకరించాను. అంతలో పోలీస్ "కాస్త ఇక్కడికి వెళ్ళి వద్దాం రా" అని నన్ను నేరుగా బ్రాందిషాపుకు పిల్చుకునిపోయాడు. అక్కడ రెండు క్వార్టర్ ఓ.టి. (ఓల్డ్ టవర్స్) తాగాడు. దానికి డబ్బు నేనే ఇచ్చాను. తాగిన తరువాత పోలీస్‌ను స్టేషన్ దగ్గర వదలి, కారటగి జనాన్ని పిల్చుకుని ఇంటికి వచ్చాను. ఆడవాళ్ళనంతా మా ఇంటి ముందు పడుకోబెట్టాను. మగవాళ్ళనంతా సుడుగాడు సిద్దణ్ణ, సణ్ణహులుగప్పల గుడిసెల ముందు పడుకోబెట్టాను.

మరుసటి రోజు పొద్దున్నే చూస్తే మగవాళ్ళంతా కనిపించలేదు. నిజానికి వాళ్ళు అప్పటికే స్టేషన్‌కు వెళ్ళిపోయారు. అది నాకు తెలియదు. మా వీధివాళ్ళకూ తెలియదు. మగవాళ్ళు కనిపించకపోవటంతో వాళ్ళ ఆడవాళ్ళు కంగారు పడి దొడ్డికి పోయేస్తామని పోయి అటు నుంచి అదే బళ్ళారి రోడ్డు వైపు పారిపోసాగారు. వారు పారిపోవటం చూసిన ఒక వ్యక్తి మీ ఇంట్లో పడుకున్న ఆడవాళ్ళు బళ్ళారి వైపు పారిపోతున్నారని తెలిపాడు.

ఇటు మగవాళ్ళు కనిపించక, అటు ఆడవాళ్ళు పారిపోతున్నారనే విషయం విని నేను గాభరపడ్డాను. వెంటనే బైక్ వేసుకుని వాళ్ళను వెదుకుతూ వెళ్ళాను. బళ్ళారి రోడ్‌లో వెళుతున్న ఆడవాళ్ళను ఆపి ధైర్యం చెప్పి వాళ్ళను పిల్చుకుని పోలీస్ స్టేషన్‌కు వచ్చాను. అక్కడ వాళ్ళ మగవాళ్ళు ఉన్నారు. వాళ్ళను చూసి నా మనస్సు



కుదుటపడింది. అయితే కంప్లి జనం వేరే ఏదో ఫిర్యాదు ఉండవచ్చని అనుమానించారు. పోలీస్ స్టేషన్‌లో ఇద్దరిని కూర్చోబెట్టి రాజీ చేసి భర్త ఇంటికి అమ్మాయిని పంపారు. అయితే ఒక వారంలోనే ఆ అమ్మాయి మళ్ళీ పారిపోయింది. దాంతో కంప్లి వాళ్ళు కారటగిలో కులపంచాయితీ జరిపించారు.

పెళ్ళి చేసుకున్న భర్త వైపు వారు కులపంచాయితీ పెట్టి అమ్మాయిని పిల్చుకుని వచ్చారు. కులపంచాయితీకి బళ్ళారి రచ్చబండ, గంగావతి రచ్చబండ, సింధునూరు రచ్చబండ, రాయచూరు రచ్చబండ వాళ్ళను సమావేశ పరిచారు. రచ్చబండ పంచాయితీలో లేవదీసు కునిపోయిన కుర్రవాడికి పదహారు వేల రూపా యలు దండన విధించారు. ఇక కారటగి కుర్ర వాడికి, గంగావతి అమ్మాయికి స్నేహం కుదిర్చిన కుర్రవాడికి పద్దెనిమిది వేల రూపాయలు దండన విధించారు. కుర్రవాడికి అమ్మాయికి స్నేహం కుదిర్చిన వాడు అమ్మాయి అన్ననే (అమ్మాయి పినతండ్రి కొడుకు). మాలాంటి బిచ్చం అడు క్కుని జీవించే జనం అంత సొమ్మును ఒక్క సారిగా చూడటం అరుదు. ఇక దండన చెల్లించమంటే ఎక్కడి నుంచి చెల్లిస్తారు?

అయితే ఆ కుర్రవాడు ఎక్కడి నుంచో డబ్బు సమకూర్చి తెచ్చి ఇచ్చాడు.

కంప్లిలోని భర్త ఇంటివాళ్ళు అమ్మాయిని తమ వెంట పిల్చుకుని పోయారు.

ఇది జరిగిన ఒక వారానికి అమ్మాయి మళ్ళీ పారిపోయింది !

కంప్లి జనం ముందుగానే పిల్ల మళ్ళీ కారటగి వెళ్ళిందన్నది కచ్చితం చేసుకున్నారు.

ఒక రోజు సాయంకాలం ఒక లారీ తెప్పించి ఇంటికి ఒకరు అన్నట్టు లారీఎక్కి కర్రలను వేసుకుని వెళ్ళిపోయారు.

మా వాళ్ళతోపాటు మా వీధి పక్కన ఉన్న సుడుగాడు సిద్ధుల కొందరు కుర్రవాళ్ళు వెళ్ళారు.

ఈ విషయం నాకు తెలియనే తెలియదు.

వాళ్ళు నేరుగా కారటగిలోని మా జనం ఉన్న వీధిలోకి లారీని తీసుకుని వెళ్ళి దొరికిన వారిని దొరికినట్టు కొట్టడం ప్రారంభించారు. హఠాత్తుగా కంప్లి జనం దాడి చేయడంతో గాభరపడిన కారటగి జనం దిక్కుకొకరు పారిపోయారు. వారిలో కొందరు తప్పించుకుని పోలీస్ స్టేషన్‌కు వెళ్ళి పోలీసులకు విషయం తెలిపారు. పోలీసులు వచ్చేసరికి అక్కడ కంప్లి జనం ఎవరూ లేరు.

ఈ గొడవ జరిగిన మరుసటి రోజు నాకు విషయం తెలిసింది. వీళ్ళు గొడవ చేసిన రోజు నేను ఏదో పనిమీద కుడితినికి వెళ్ళాను. ఇక్కడ గొడవ జరిగింది. మరుసటి రోజు విషయం తెలియగానే కంప్లి జనాన్ని తిట్టి ఏదైనా పరి ష్కారానికి రావడానికి కూర్చుని మాట్లాడు దామని చెప్పాను.

కంప్లి జనానికి నా మాటల్లో విశ్వాసం లేదు. ఎందుకంటే నిందితుడు మా అక్క మను మడు.కారటగి వెళదాం రండి అంటే మా కులస్థులు ఎవరూ రావడానికి ఒప్పుకోవటం లేదు. చివరికి సుడుగాడు సిద్ధుల కులంలోని ముగ్గురు నలుగురు యువకులను పిల్చుకుని కారటగి వెళ్ళాను. కారటగిలో మా వీధికి వెళ్ళి ఏమైందని అడిగాను. అంతలో ఒక వ్యక్తి మాకు టీ తాగిస్తూ జరిగిన విషయమంతా చెప్పాడు. సరే దీనికి పరిష్కారం ఏమిటని అడిగాను. 'చూద్దాం ఆగండి, ఇక్కడ ఒకరిని చూసి వద్దాం రండి' అని చెప్పి నేరుగా పోలీస్ స్టేషన్‌కు దగ్గరికి పిల్చుకుని పోయాడు. అక్కడ ఎవర్నయినా కల వడానికి వచ్చాడేమోనని మేము అనుకుం టుండగా అతను పోలీస్ స్టేషన్‌లోకి పోయి ఓ పోలీస్‌ను పిల్చుకుని వచ్చాడు. పోలీస్ రాగానే "మా సార్ పిలుస్తున్నాడు రండి" అని పిలిచాడు. ఎందుకు పిలిచారా? అని లోపలికి పోతే పోలీస్ మమ్మల్నందరిని స్టేషన్‌లో ఓ మూలలో కూర్చో బెట్టాడు.

నాకు ఏం జరుగుతుందో అర్థం కాలేదు.

ఇది జరిగిన రెండు గంటల తరువాత ఇన్‌స్పెక్టర్ వచ్చారు.

రాగానే మమ్మల్ని చూసి "ఎవరు వాళ్ళు?" అని ఓ పోలీస్‌ను అడిగాడు.

"వీళ్ళు దురుగి మురుగి జనం సార్. మొన్న కారటగి జనం లారీలో వచ్చి కొట్టి పోయారు. వాళ్ళే వీళ్ళే" అన్నాడు.

అతని మాటలు విన్న ఇన్‌స్పెక్టర్ "ఎందు కయ్యా, మీకేమైనా తల చెడిందా? ఎందుకు ఈ ఊరు జనాన్ని కొట్టారు?" అని అడిగాడు.

"అయ్యా, ఇక్కడున్న మేము ఎవరమూ కొట్టడానికి వచ్చిన గుంపులోని వాళ్ళం కాదు. నిన్న ఏమి జరిగిందో తెలుసుకోవడానికి వచ్చాం" అని చెప్పాను.

"అరే, సంబంధం లేకపోతే మీరు ఎందుకు వచ్చారు?"

"సంబంధం ఉన్నందుకు ఇక్కడికి వచ్చినాము సార్" అన్నాం.

"ఏయ్, పి.సి. వీళ్ళందరిని సెల్‌లో వెయ్. బుద్ధి వస్తుంది" అని బెదిరించడానికి చూశాడు.

నాకు ఏం చేయాలో తోచలేదు.

నా వెంబడి వచ్చిన సుడుగాడు సిద్ధుల కుర్రవాళ్ళు భయపడిపోయారు.

చివరికి నేను ధైర్యం చేసి, "సార్, నేను ఆ కులసంఘానికి రాష్ట్రాధ్యక్షుడిని సార్. ఆ కారణంగా మా వాళ్ళు ఎందుకు కొట్టుకు న్నారు? ఏమైంది? అని తెలుసుకోవడానికి వచ్చాను. మా తప్పేమీ లేదు" అని అన్నాను.

ఆ మాటలు విని, 'సరే, ఈ రోజు మీరు ఇక్కడే స్టేషన్‌లో పడుకోండి. రేపు ఎవరైనా మీకు

తెలిసినవాళ్ళు వచ్చి చెబితే అప్పుడు మిమ్మల్ని వదలడం గురించి ఆలోచిస్తాను" అని దబాయించి వెళ్ళిపోయాడు.

చివరికి మరోదారి లేక ఆ రాత్రంతా కారటగి పోలీస్ స్టేషన్‌లో తెల్లవారేవరకు కాలం గడిపాం.

ఉదయం కంప్లి "సంచారుల సంఘం" నాయకులు వచ్చి చెప్పిన తరువాత మమ్మల్నందరిని ఇన్‌స్పెక్టర్ ఇంటికి పంపాడు.

**చెరువులో దొంగతనం :**

మేము మత్స్యకారుల సంఘం ద్వారా చెరువును కాంట్రాక్ట్ తీసుకున్నాం కదా ! మా సంఘం సభ్యులలో కొందరు దొంగతనం చేస్తున్నారనే విషయం తెలిసింది. నిజానికి అది వాళ్ళ తప్పు కాదు. చెరువులో చేపలు పట్టుకోవడానికి ఇచ్చే కూలీ అత్యల్పం. అందువల్ల ఏ కూలీమనిషికి కడుపు నిండేది కాదు. అందువల్ల దొంగతనం చేయకుండా వాళ్ళకు మరోదారి లేదు. అలాగని సభ్యులందరూ ఈ పని చేయడం లేదు. కేవలం అయిదుమంది సభ్యులు మాత్రమే దొంగతనానికి పాల్పడ్డారు. వీరి దొంగతనం వల్ల ఇతర సభ్యులకు, సంఘానికి అన్యాయం జరుగుతోందని నాకు అనిపించింది. దొంగతనం చేస్తున్న వాళ్ళను గుర్తించి వాళ్ళకు బుద్ధి చెప్పాలని నిర్ణయించుకున్నాను.

చివరికి ఆ పని చేసినవారిని పట్టుకున్నాను. ప్రతీ ఒక్కరికీ అయిదువందల ఒక్క రూపాయి దండన విధించాను. ఆందరూ కలిసి నూటొక్క రూపాయి ఇవ్వడానికి ముందుకు వచ్చారు. నేను అంగీకరించలేదు. మళ్ళీ అందరూ కలిసి అయిదువందల ఒక్క రూపాయి ఇవ్వటానికి వచ్చారు. దానికీ ఒప్పుకోలేదు. ఆఖరికి గత్యంతరం లేక ప్రతీ ఒక్కరూ అయిదువందల ఒక్కటి ప్రకారం తెచ్చి ఇచ్చారు. ఆ రోజు నుంచి దొంగతనం చేయడం మానేశారు. దొంగతనం చేయడం మాన్పించిన తృప్తి నాకు దక్కింది. అయితే వారిలో కొందరు నన్ను శత్రువుగా చూడటం మొదలుపెట్టారు.

**మొదటి పెళ్ళి :**

నాకు తెక్కలకోటలో మా నాన్న పిల్లను నిర్ణయించాడు కదా, ఆ పిల్లతోనే నాకు పెళ్ళి జరిగిపోయింది. నాకు అప్పుడు పదిహేడో, పద్దెనిమిదో ఉండొచ్చు. మా కులంలో పెండ్లి తంతు చాలా సరళం. ఏ బ్రాహ్మణ, జంగమ పురోహితుడి అవసరం లేదు. కులపెద్దలైనవారు, పూజారులు, ధర్మకర్తలంతా కలిసి పెండ్లి



జరిపిస్తారు.

కొత్తబట్టల అవసరం లేదు. బాసిగం అవసరం లేదు. కట్టుబట్టలతోటే పెండ్లి జరిగిపోతుంది. పెళ్ళి జరిగిన తరువాత కులపెద్దలు మొదలైనవాళ్ళు కలిసి కల్లుగానీ, సారాయి గానీ తాగితే పెండ్లితంతు పూర్తయినట్టే. అటు తరువాత ఉన్నది తిని, ఎవరింటికి వాళ్ళు వెళ్ళిపోతారు. అమ్మాయి పెండి చేసుకుని ఇంటికి వచ్చిందంటే మా సంసారం మాకు చెందింది. తల్లితండ్రులు తమ పాటికి తాము ఉంటారు. మాకు ప్రత్యేకమైన గుడారం వెలుస్తుంది.

అలా మాకూ ఒక గుడారం ఏర్పడింది!

**అపరాధ భావన :**

నన్ను ఈ నాటికి ఈ అపరాధ భావన వేధిస్తూవుంది. నేను పెళ్ళయిన కొత్తలో ఊరూర్లు తిరిగి బిచ్చం అడిగేవాడిని. బిచ్చాటనకు ఒక ఊరని లేదు. ఊరూర్లకు వెళ్ళి భిక్షం అడుక్కునేవాడిని. ఇలా ఊళ్ళకు వెళ్ళినపుడు గుడారాన్ని వెంట తీసుకుని పోయేవాణ్ణి కాదు. ఒకటి రెండు జోలెలు, దేవుడి బుట్ట, చాట, ఈరగోల్, కత్తి, గంట, ఉరుమ, తీసుకుని వెళ్ళేవాడిని. పడుకున్నప్పుడు కప్పుకోవడానికి చీరనో, బొంతనో ఉండేది. అలాగే ఒకటి రెండు సత్తుగిన్నెలు ఉండేవి. ఆ నాటి మా సంసారం అంటే అంతే.

ఏ ఊరికి పోయినా రాత్రి పడుకోవడానికి బడి అరుగునో, గుడినో మరేదో ప్రార్థనా స్థలంలోనో దిగేవాళ్ళం. పగలంతా బిచ్చం అడగటం, రాత్రి పడుకోవడానికి ఒక స్థలం దొరికితే అక్కడ పడుకుని మరుసటి రోజు మరో ఊరికి వెళ్ళేవాళ్ళం. మాకు కొత్తగా పెండ్లయింది. మేము ఏ గుడి, గోపురాలోన్లో, ప్రార్థనా స్థలంలోనో పడుకుని, రాత్రి ఏ దేవుడి భయం లేకుండానే కలిసేవాళ్ళం. మేము కలిస్తే ఈ పవిత్ర స్థలాలు మైల అవుతాయనే భయమూ ఉండేది కాదు. ఆ వయస్సు అలాంటిది. ఇప్పుడిప్పుడు అనిపిస్తుంది. ఆ సమయంలో ఎన్ని గుడులు, బడి అరుగులు మొదలైన ప్రదేశాలను మైల చేశాం కదా అని.

అయితే చేసింది తుడిచిపెట్టడానికి కాదు కదా ! ఏం చేయగలం?

**స్వప్న సుందరీమణులు :**

పెళ్ళయిన కొత్తలో నాకు సంసారం పట్ల అంతగా అవగాహన లేదు. నా భార్యకూ సంసారం గురించి అవగాహన లేదు. మాకు ఎవరూ అవగాహన కలిగించలేదు. అందువల్ల సంసారం గురించి నేను అజ్ఞానినే. పెండ్లియిన కొత్తలో నా భార్య బిచ్చానికి వెళ్ళేది. అది తప్పు అని చెప్పేటంత తెలివైనవాడిని కాను నేను. నేనేమో, నా పనేమో అన్నట్టు ఉండేవాడిని. ఎవరైనా బలవంతం చేస్తే ఆ రోజు బిచ్చాటనకు వెళ్ళేవాడిని. నాకు మొదట్లో సినిమా చూసే పిచ్చి ఉండేది కదా ! అది పూర్తిగా పోలేదు. తెలుగు, కన్నడ ఏదైనా సరే, సినిమా వచ్చిందంటే చూసేవాడిని. ఆ వయస్సుకు నాకు సినిమా ఒక మాయా ప్రపంచంలా కనిపించేది. సినిమా హీరోయిన్లందరూ దేవకన్యల్లా కనిపించేవారు. కేవలం వాళ్ళు వీళ్ళు ఇచ్చిన పాతచీరలు కట్టుకునే మా ఆడవాళ్ళెక్కడ? తళుకు బెళుకు డ్రెస్సులు వేసుకునే సినిమా హీరోయిన్లు ఎక్కడ? వీళ్ళంతా నా మనస్సులో రూపుదాల్చి నిలబడ్డట్టే

అనిపించేది. అది అటుతరువాత మెల్లమెల్లగా ప్రభావం చూపసాగింది.

నేను ఒకసారి చంద్రకళా టాకీస్‌లో సినిమా చూడటానికి వెళ్ళాను. సినిమా తెలుగుదో, కన్నడదో గుర్తు లేదు. ఆ సినిమా పేరు కూడా మరిచిపోయాను. సినిమాలోని దృశ్యాలు కొద్దికొద్దిగా గుర్తున్నాయి.

ఆ సినిమాలో చాలా గుర్రాలున్నాయి. ఒక దృశ్యంలో అనేక గుర్రాలు ఒకేసారి పరుగెత్తుకుంటూ వస్తాయి. ఆ గుర్రాలు పరుగెత్తుకొచ్చే శబ్దాన్ని టాకీస్ వాళ్ళు సైడు స్పీకర్‌లో సౌండ్ ఏఫెక్ట్ కోసం బిగ్గరగా వినిపించేవారు. ఆ గుర్రాల పరుగు చూస్తూ చూస్తూ అవి నా గుండె మీద కాలుపెట్టి పరుగెడుతున్నట్టు అనిపించసాగింది. ఆ గుర్రాల పరుగు శబ్దం నాలో భయాన్ని కలిగించసాగింది. ఆ భయానికి టాకీస్ లోపల నేను కూర్చోలేకపోయాను. టాకీస్ నుంచి బయటికి వచ్చాను. అయినా నాలో కలవరం తగ్గలేదు. గేటు తెరిపించి బయటికి వచ్చేశాను. ఇంటికి వచ్చి మా గుడారంలో పడుకున్నాను. అయినా ఏదో భయం. ఏదో బుగులు. గుడారం నుంచి బయటికి వెళ్ళాలంటే ఒళ్ళంతా బిగుసుకుపోతున్నట్టు భావన. అంతటి భయం నన్ను కమ్ముకుంది. బయటికి ఎక్కడా పోకుండా గుడారంలో ఉండసాగాను. నా ప్రవర్తనలో చిన్నచిన్న మార్పులు మొదలయ్యాయి. నాలో ఏదో మార్పు వచ్చిందని మా కుటుంబంలోని అందరికి అర్థమవసాగింది.

నాకు ఈ విధమైన భయం మొదలైన తరువాత పరిచయమున్న నూర్‌ఖాదర్ అనే ఆర్.ఎం.పి. డాక్టర్ దగ్గరికి వెళ్ళాను. ఆయనను తెక్కల కోట ఘని సాహెబ్‌గారి కుమారుడు పరిచయం చేశారు. ఖాదర్‌గారి దగ్గరికి వెళ్ళి ఎందుకో భోజనం సహించటం లేదని, భయం వేస్తోందని చెప్పాను. డాక్టర్ పరీక్ష చేసి నీకు ఏమీ కాలేదు, ఈ గోలీలు తీసుకో, సరిపోతుందని చెప్పి మందులు ఇచ్చి పంపేశారు. మందులు వాడుతున్నకొద్దీ నా సమస్య మరింత అధికమవ్వసాగింది. మందులు వాడటం మానేశాను. నా ముఖంలో వాపు వచ్చింది. ఆయాసం మొదలైంది. మళ్ళీ డాక్టర్ దగ్గరికి వెళ్ళి నాకేమీ తగ్గలేదని చెప్పాను.

నా మాటలు విని ఆ డాక్టర్‌గారు, తమ తండ్రిగారు ఇలాంటి జబ్బులను నయం చేస్తాడని చెప్పి ఆయన దగ్గరికి వెళ్ళమన్నాడు. ఆ డాక్టర్‌గారి తండ్రి దగ్గరికి వెళ్ళాను. ఆయన నన్ను చూడగానే, 'నీ పేరేమి? మీ ఇంటి దేవుడు ఎవరు? మీ తల్లితండ్రుల పేర్లేమి? పెళ్ళయిందా?' – ఇలాంటి ప్రశ్నలు అడిగి చేతిలో ఏదో లెక్కలు వేసి, "నీకు గ్రహదోషం ఉంది. ఆడగ్రహం నిన్ను పట్టుకుంది. దానికి తాయెత్తు కడతాను. సాంబ్రాణి ఇస్తాను. రోజు స్నానం చేసి సాంబ్రాణి వేసుకో. సరిపోతుంది" అని చెప్పి సాంబ్రాణి, తాయెత్తు ఇచ్చాడు. తాయెత్తు తెచ్చి ఇంట్లో కట్టుకున్నాను. స్త్రీ గ్రహం అంటే ఏమిటో నాకు తెలియదు. మా తల్లితండ్రులను ఆ విషయం అడిగితే వాళ్ళు మాకు తెలియదన్నారు. మా ఇరుగుపొరుగు గుడారాల్లో ఉండే వారిని అడిగాను. వాళ్ళూ తమకు తెలియదని చెప్పారు. నాకు కొత్త సమస్య మొదలైంది. ఆయన ఇచ్చిన తాయెత్తు, సాంబ్రాణి ఏమీ పని చేయలేదు. రోజు రోజుకు రోగం తీవ్రమవుతూ పోయింది. తాయెత్తు, సాంబ్రాణి వల్ల ఎలాంటి గుణం కనిపించలేదు.

ఎవరో ఒకరు హొసపేట డాక్టర్ దగ్గర చూపించమని చెప్పారు. ఇంటివాళ్ళు నన్ను హొసపేటకు పిల్చుకునిపోయారు. డాక్టర్ పరీక్ష చేసి ఏ రోగం లేదు. గ్యాస్ట్రిక్ సమస్య. దాంతో పాటు బి.పి. పెరిగిందని చెప్పి గోలీలు ఇచ్చాడు. అవి తీసుకున్నా ఏమీ ఉపయోగపడలేదు.

ఒక రోజు మా ఊరివారైన హేమయ్య స్వామి కనిపించారు.

నా ఆరోగ్యం బాగా పాడైందని తెలియజేశాను.

"నువ్వు సూళెకల్లుస్వామి దగ్గరికి వెళితే బాగవుతుంది. స్వామి అడ్రసు ఇస్తాను. వెళు" అని ఆయన అన్నారు.

ఆయన దగ్గర స్వామి అడ్రసు తీసుకున్నాను. అయితే సూళెకల్లుకు ఎలా వెళ్ళాలో నాకు తెలియదు. నేరుగా గంగావతికి వెళ్ళి ఇలకల్ బస్సు ఎక్కి సూళెకల్లులో దిగు, గంగావతికి ఆ ఊరు దగ్గరే అని ఎవరో అన్నారు. నేను గంగావతికి వెళ్ళాను. ఇలకల్ బస్సు ఎక్కి నేరుగా ఇలకల్‌కు టికెట్ తీసుకున్నాను.

ఇలకల్ బస్టాండులో దిగి, బయటికి వచ్చి, "ఈ స్వామిగారు ఎక్కడున్నారు? సూళెకల్లు ఎలా వెళ్ళాలి?" అని అడిగాను.

అక్కడ ఎవరికీ సూళెకల్లు గురించి తెలియదు. స్వామి గురించి కూడా ఎవరికీ తెలియదు.

నా పరిస్థితి చూసిన ఒక వ్యక్తి "ఇక్కడ ఒక స్వామి ఉన్నారు. ఆయన దగ్గరికి వెళ్ళి అడుగు" అన్నారు.

ఆ స్వామి దగ్గరికి వెళ్ళి అడ్రసు కాయితం ఆయన చేతిలో పెట్టాను. 'ఇంత దూరం ఎందుకు వచ్చావు నాయనా? మీ ఊరి దగ్గరే ఆ ఊరు' ఉందని ఆయన అన్నారు. 'గంగావతి బస్సు పట్టుకుని సూళెకల్లు అని చెబితే కండక్టర్ దింపుతాడు' అని చెప్పారు. సరే అని మళ్ళీ గంగావతి బస్సెక్కి సూళెకల్లు టికెట్ తీసుకున్నాను. కండక్టర్ సూళెకల్లులో దింపాడు.

బస్టాండు రోడ్డు నుంచి ఊరు చేరడానికి రెండు కిలోమీటర్లు నడవాలి. నా కడుపు ఖాళీగా ఉంది. దాంతో కాళ్ళల్లో శక్తి లేదు. ఏదో విధంగా కాళ్ళీడ్చుకుంటూ స్వామి మఠం చేరాను. అప్పటికి రెండు గంటలు దాటింది.

"ప్రసాదం తీసుకోవటానికి రండి" అని ఎవరో పిలిచారు.

ఆ రోజు అమావాస్య. వాళ్ళే పిలవటంతో వెళ్ళి కడుపు నిండా భోజనం చేసి వచ్చి స్వామి ఎదుట కూర్చున్నాను.

"ఏమయ్యా? నీ సమస్య ఏమిటి?" అని స్వామి అడిగారు.

నా కథంతా చెప్పాను.

"మెడ నిండా కేవలం తాయెత్తులే కట్టుకున్నావుకదా ! వాటన్నిటిని తీసి కాలువలో పారెయ్. నేనొక చిన్న తాయెత్తు ఇస్తాను. దాన్ని వేసుకో" అన్నారు.

తరువాత ఆయనే, "నాయనా, నీకు మనోవ్యాధి ఉంది. నువ్వు హుబ్బళ్ళికి కానీ, ధారవాడకు కానీ వెళ్ళి చూపించుకుంటే బాగవుతావు" అన్నారు.

ఆయనే డాక్టర్ అడ్రసు రాసిచ్చారు.

ఆడ్రసు తీసుకుని వచ్చిన రాత్రే ఇంటికి తిరిగి వచ్చాను.

మా కుటుంబంలోని కొందరిని పిల్చుకుని హుబ్బళ్ళికి పోయాను. డాక్టర్ మధ్యాహ్నం వస్తారట. అంతలో చీటి రాయించండి అన్నారు. మా దగ్గర కేవలం వెయ్యి రూపాయలు మాత్రమే ఉన్నాయి. 'డాక్టర్ రానీ, రాయిస్తాం' అన్నాం. మౌనంగా కుర్చున్నాం.

అంతలో గుండు చేయించుకున్న ఒక వ్యక్తి వచ్చాడు. నన్ను చూసి ఏమైందని అడిగాడు. నేను మొదటి నుంచి నా కథంతా చెప్పాను. నా కథ విన్న ఆయన, "మీరు చాలా పేదవాళ్ళను కుంటాను. ఇతను డాక్టర్ కాదు. రాక్షసుడు. నా ఆరోగ్యం బాగా లేదని మూడునెలల ముందు వచ్చి చేరాను. ఇప్పటిదాకా ఇతని దగ్గర చూపిం

చుకోవటానికి మూడు ఎకరాల పొలం అమ్ముకున్నాను. ఏం చేయాలో తెలియకుండా ఉంది. తమ్ముడూ, మనం పుట్టిన తరువాత చావాల్సిందే. చావటం కోసం ఈ నరకం ఎందుకు కోరుకుంటావు? ఊరకే మీ ఊరికి మీరు పోవటం మంచిది. ఆ పైన మీ ఇష్టం" అన్నాడు.

ఆ మాటలువిని నాకు వణుకు వచ్చింది.

నాతోపాటు వచ్చిన వాళ్ళు, "ఊరికి తిరిగి పోదాం పా, ఏమీ సూపించుకునే పన్లేదు. ద్వావర ఎట్లా పెడతాడో అట్లయితది" అని అన్నారు.

డాక్టర్ ముఖం కూడా చూడకుండా తిరిగి ఊరికి వచ్చాం.

మా చిన్నాన్నా మొదలైన వాళ్ళు నేను ముక్కుసూటి వ్యక్తిని కావటం వల్ల ఏవరో నాకు చేతబడి చేయించారేమోనని అన్నారు... ఇంకెవరో నాకుమందు పెట్టారేమోనని అన్నారు. వారి మాటలు నన్ను మరింత భయపెట్టాయి. మా తల్లితండ్రులు, నన్ను మ్యాసరహట్టి మారెమ్మ పూజారి దగ్గరికి పంపి నాకు పెట్టిన మందు తీయించాలని నిర్ణయించుకున్నారు.

గతంలో నేను కడుపు నొప్పికి చూపిం చుకోవటానికి మ్యాసరహట్టికి వెళ్ళాను కదా ! అదే ఊరి పూజారి దగ్గరికి పిల్చుకుని పోయారు. నేను, నాతోపాటు నా భార్య, ఇంటి పెద్దలు వెళ్ళాం.

పూజారి నన్ను చూసి, "మళ్ళీ వచ్చా వేమి? ఏమైంది?" అని అడిగాడు.

"నాకు భయం వేస్తుంది. పరుగెత్తితే ఆయాసం వస్తుంది" అని చెప్పాను.


ఆ పూజారి నా జబ్బును తాను నయం చేస్తానని అన్నాడు. అయితే అతను చూస్తే పచ్చి తాగుబోతు. రోజూ తాగడానికి అతనికి డబ్బులు ఇవ్వాలి. నా దగ్గర అంత డబ్బు లేదు. రోజూ నా భార్య అడుక్కుని వచ్చేది. దాన్నే ఇద్దరం తినాలి. నోటికి ఒక్కటీ రుచించేది కాదు. మేము మాంసం, మందు తినే జనం. నంజుకోవడానికి మాంసం లేకపోతే నోటికి కొంచెం కూడా రుచి అనిపించేది కాదు.

అందువల్ల నేను అదే ఆయాసంతోనే ఉడుతలు పట్టుకోవడానికి వెళ్ళేవాడిని. రెండు ఉడుతలు పట్టుకునేలోపే చాలైపోయేది. ఆయాసం వచ్చేది. అక్కడే కూర్చుని అలుపు తీర్చుకుని మరో రెండు ఉడుతలను పట్టుకునే వాడిని. దాన్ని తెచ్చి ఇస్తే నా భార్య వాటిని కాల్చి పెట్టేది. ఉడుత మాంసాన్ని నంజుకునే వాడిని. పూజారికి డబ్బు ఇస్తే మందు ఇచ్చే వాడు. లేకపోతే లేదు. మేము గుడి ముందు బయల్లో పడుకునేవాళ్ళం.

అదే మ్యాసరహట్టిలో మా వాళ్ళదొక జనతా ఇల్లు ఉంది. ఆ ఇంటివాళ్ళు బిటన చేస్తూ దేశాటనలో ఉన్నారు. ఆ ఇల్లు ఖాళీగా ఉంది. సింగారెప్ప అనే వ్యక్తి ఆ ఇంట్లో మా భార్యాభర్తల్ని నివాసం ఉండండని చెప్పాడు. రోడ్డు పక్కన ఇల్లు ఉంది. గుడి బయలుకన్నా ఇంట్లో ఉండటం మంచిదని అని ఆ ఇంట్లో నివాసానికి వెళ్ళాం. రాత్రి పడుకున్నప్పుడు రోడ్డు మీద వెళ్ళే లారీ, బస్సుల శబ్దాలకు భయం వేసేది. లారీ, బస్సులు గుండెల మీదుగా వెళ్ళినట్టు అని పించేది. దాంతో మళ్ళీ మారెమ్మ గుడి బయల్లోకి వచ్చాం. ఇలా కాలం గడుపుతుండగా ఎవరో ఒకరు చళ్ళకేరి డాక్టర్ దగ్గరికి వెళ్ళిరమ్మని చెప్పారు. అక్కడికీ వెళ్ళాను.

చళ్ళకేరి డాక్టర్ నన్ను చూడాగానే "నీకు ఏ జబ్బు లేదు" అన్నారు. మళ్ళీ, "అయినా ఈ వయస్సులో ఎంత మంది ముండల దగ్గరికి పోయావు?" అని అడిగారు.

"అయ్యా, ఉండే ఒక్క పెండ్లాం దగ్గర పండుకోవటానికి చేతకావటం లేదు. ఇంకెక్కడ ముండల దగ్గరికి పోతాను" అన్నాను.




ఆయన ఏవో మందులు ఇచ్చి పంపారు. అయితే ఆ మందులూ పని చేయలేదు.

మళ్ళీ మ్యాసరహట్టి మారెమ్మ గుడికి వచ్చేశాను. ఒక రోజు పూజారి, "నీకు పట్టింది స్త్రీ గ్రహం. అది వదాలాలంటే ఒకే ఊళ్ళో ఉన్న ఏడు ఆంజనేయస్వామి గుడుల నుంచి సింధూరం తీసుకుని రావాలి. దాంతో తాయెత్తు చేసి ఇస్తాను. దాన్ని వేసుకుంటే నీకు పట్టిన గ్రహం వదిలిపోతుంది" అని అన్నారు.

పూజారి ఏడు గుడుల ఆంజనేయుడి ఒంటి మీది సింధూరాన్ని తీసుకుని రమ్మన్నారు.

"ఒకే ఊళ్ళో ఉన్న ఆంజనేయస్వామి ఏడు గుడులను ఎలా వెదకాలి?"స అని అడిగాను.

"సరే, నేను ఏడు గుడుల ఆంజనేయుడి సింధూరం తెప్పిస్తాను. దానికి ఏడువందల రూపాయలు అవుతాయి" అన్నారు.

నా జబ్బు నయమైతే చాలునని అంతో ఇంతో కూడబెట్టిన డబ్బంతా పూజారికి ఇచ్చాం.

ఒక ఆదివారం తాయెత్తు చేసి ఇచ్చాడు.

దాన్ని కట్టుకున్నాను.

అదే సమయంలో 'చస్తే చస్తాను. ఇకపై దేనికీ భయపడకూడదు !' అని మనస్సులో దృఢంగా అనుకున్నాను.

ఆ తాయెత్తు మహిమనో లేదా నేను ఇకపై దేనికీ భయపడకూదని చేసుకున్న దృఢనిర్ణయమో – చివరికి నా కలలో వచ్చి నన్ను వేధిస్తూ, నా భార్య దగ్గరికీ పోనివ్వని సప్తసుందరీమణులు నెమ్మదిగా నానుంచి దూరం కాసాగారు. అటు తరువాత నా భార్య లోనే వాళ్ళను చూస్తూ జీవితం సాగించాను.

భయమూ నా నుంచి నెమ్మదిగా దూర మైంది.

నాకిప్పుడు ఇద్దరు భార్యలు.

అయినా ఒక్కొక్కసారి సినిమాలోని సుందరీమణులు అప్పుడప్పుడు కలలోకి దూసు కుని రావటం జరుగుతోంది.

వారి గురించి నేను ఇప్పుడు తలపాడు చేసుకోవటం లేదు !

డా. జె.వి.సత్యవాణి
9441134856

# కృష్ణాతీరప్రాంతాల్లో యక్షగానం





ప్రాచీన కాలం నుంచి ఆంధ్రదేశం పలు కళలను పెంచి పోషిం చింది. సాహిత్య, సంగీత, నాట్య, శిల్ప, చిత్రకళలకు ప్రపంచపటంలో తనదంటూ ఒక స్థానాన్ని విలక్షణంగా ఏర్పరచుకొన్న ఆంధ్రదేశం కళలకు కాణాచి. ఒక్కొక్క ప్రాంతం ఒక్కొక్క కళకు ప్రసిద్ధం. కాని, ప్రస్తుతం విడిపోయిన రెండు రాష్ట్రాలలోని పలు ప్రాంతాల్లో ప్రసిద్ధి పొందిన కళ – సంగీత, నాట్య, సాహిత్యాల కలయికైన యక్షగానం.

యక్షశబ్దభవమే 'జక్క' లేదా 'ఎక్క' లని ఒక మతమున్నా నేటికీ రాయలసీమ ప్రాంతంలో ఉన్న కొన్ని గ్రామాలు – (జక్కసాని గుంట, పత్తికొండ తాలూకా, కర్నూలు జిల్లా), (జక్కుల చెఱువు, గుత్తి తాలూకా, జక్కల చెఱువు, పెనుగొండ తాలూకా, జక్కసముద్రము, హిందూపురం, అనంతపురం జిల్లా ), (జక్కులాడికి, బళ్లారిజిల్లా) వంటివి జక్క జాతి వాచకమని సాక్ష్యమిస్తాయి. జక్కులు గాన, నాట్యాలలో సుప్రసిద్ధులైన ఒక సంచారజాతి అని ఎందరో ప్రసిద్ధ పరిశోధకులు నిరూపించారు. బి.ఎస్.ఎల్. హనుమంతరావు "Religions in Andhra States"లో "Tribes that made up the Andhra race the Nagas and Yakshas appear to be very prominent" (p.17-18). Mr. E. Thurston తన " Casts and Tribes of South Indian" లో "Jakkulu described as an inferior caste of prostitutes, mostly of the balija caste and as wizards and dancing theatrical caste. At Tenali and Krishna Districts it was customary for each family to give away one girl for prostitution. క్రీడాభిరామం వంటి కావ్యాలు జక్కుల ఆట పాటలను వర్ణించాయి. యక్షులు పురాణాలలో గాన నృత్య కళాకోవిదులుగా అభివర్ణింపబడ్డారు. యక్షరాజు కుబేరుణ్ణి ఓడించి రావణుడు లంక నుంచి వెళ్ళగొట్టాడని ఐతిహ్యం. ఆంధ్రదేశపు ఈశాన్య దిశలో కుబేరకుడనే యక్షరాజు దేవ రాష్ట్రాన్ని పాలించాడని సముద్రగుప్తుడి అలహాబాదు శాసనం సాక్ష్యమిస్తోంది. (E.1.xvNo.36 Vol.xxii p-171-185) ఇలా జక్కులతో సంబంధమున్న ఈ కళను తెలుగు సాహిత్యంలో పాల్కురికి నుంచి అనేకులు ప్రస్తావించారు. "కామవల్లీ మహాలక్ష్మి కైటభారి వలపు బాడుచు వచ్చె జక్కుల పురంధ్రి" ఈ యక్షగానాలకు సప్తకన్యకలకు సంబంధ ముందన్నది నిర్వివాదాంశం. దాదాపు 15శ. ద్వితీయార్థంలో రాయబడిన "సౌభరి చరిత్ర" తెలుగులో తొలి యక్షగానం. అది ఈ కథనే వర్ణించింది. కాలక్రమంగా అనేక కథలు ఆ ప్రక్రియలో రూపుదిద్దుకున్నాయి.

కోస్తాంధ్ర, రాయలసీమ, తెలంగాణాలలో యక్షగానాలు వెలువడ్డాయి. ఆచార్య ఎస్.వి. జోగారావుగారు యక్షగానాల సంఖ్యనిలా ఇచ్చారు : ఆంధ్ర ప్రాంత కవులు– 177; దక్షిణదేశ కవులు – 86; తెలంగాణ కవులు – 47. లబ్ధగ్రంథములు– 542 ; అలభ్యాలు – 260. విభేదాలు: పారిజాతాలు – 19, భామా కలాపాలు– 28, గొల్ల కలాపాలు – 14, కొరవంజులు– 21. సుప్రసిద్ధ కవి, పరిశోధకులు అయిన కీ.శే. ఆరుద్రగారు ఒకసారి అన్నమాటలను ఇక్కడ తప్పక ఉదాహరించాలి. "మిగిలిన భాషల్లో కన్నా ఒకటిన్నర శతాబ్దానికి ముందే పుట్టి, దాదాపు ఎనిమిది వందలపైగా రచనలు దొరుకుతున్నా యక్షగానం తమదని కన్నడిగులనుకునేలా వదిలేసుకున్న మన తెలుగువారిది దౌర్భాగ్యం అనాలా? నిర్లక్ష్యం అనాలా?" ఏమనాలో విజ్ఞులే నిర్ణయించాలి.

దక్షిణదేశవాఙ్మయం యక్షగానాలకు స్వర్ణయుగం, అయితే, కృష్ణా తీరానున్న కూచిపూడి ఈ సమాహారకళకు పుట్టినిల్లా? మెట్టినిల్లే దక్షిణదేశమా? లేకా రెండూ ఈ కళకు ఒక కొమ్మకు రెండు రెమ్మలా? ఈనాడీ కళకున్న ఆదరణ ఎలాటిది? అది ఇంకా ప్రదర్శనకు నోచు కొంటోందా? ఎవరు ఎక్కడ ఎలా ప్రదర్శిస్తున్నారు? వంటి ప్రశ్నలకు చేతనైన సమాధానాలు వెతకడానికి ఈ పత్రం. కృష్ణ, గుంటూరు, ప్రకాశం – కృష్ణాతీరంలో నేడు ఈ జిల్లాల్లో యక్షగానాల ప్రదర్శన గురించి అడిగితే కూచిపూడివారు కాని, సిద్ధేంద్ర కళాక్షేత్రం, కూచిపూడి వారు కాని ప్రదర్శిస్తారని తెలియవచ్చింది. ఆ విశేషాలను తెలియజేయటం కూచిపూడి – మేలట్టూరు నాట్యరూపకాలకు, యక్షగానాలకు గల సామ్య భేదాలను చూడటం ఈ పత్రోద్దేశం. ఇది దానికి భూమిక.

## పేరులో ఏముంది?

యక్షగానానికి పలు పేర్లున్నాయి. తెలుగు, కన్నడం– యక్షగానం తమిళం– కుఱవంజి – మలయాళం – కథాక్కళి – బెంగాలి – యాత్ర మరాఠీ – గంధర్వనృత్యం జావా – వాయంగ్, వోయంగ్ ; జాపనీస్ – నో రూపకాలు బర్మీస్ – యాగాన్ సింహళం – కోలామ్ నాటిమా టిబెట్ – మిస్టరీ నేపాలీస్ – గంధర్వగానం. ఇలా ప్రాంతానికో పేరు.



యక్షుల ప్రసక్తి బౌద్ధశిల్పాల్లోను, పురాణేతిహాసాల్లోను కనిపిస్తుంది. వాళ్ల ప్రాచీనతకు ఇది ఒక నిదర్శనం.

మొదట జాతివాచకమైన యక్ష ప్రత్యేక బాణీగా వినిపించి, దాంతో నృత్తాన్ని జోడించుకొని, నృత్య గాన కళల సమాహారంగా మారింది. అందులో ఎక్కడా అభినయానికి గాని, ఆహార్యానికి గాని ప్రాధాన్యత ఉన్నట్టు కనిపించదు.

నాటకాలు, కొరవంజులు అనే వివిధ పేర్లతో యక్షగానాలు కన్పిస్తున్నాయి. రఘునాథ నాయకుడు, వీరరాఘవ నాయకుడు, శహాజీ, వెంకపాటి సోమయాజి, రంగాజమ్మ, బాలపాపాంబ వంటివారు ఈ యక్షగాన రచనల్లో సుప్రసిద్ధులు. యక్షగానాలు, నాటకాలు, మహా నాటకాలు, విలాసాలు, కొరవంజులు, కలాపాలు ఈ కాలంలో ప్రసిద్ధి చెందిన రచనలు. ఇన్ని పేర్లున్నా ఈ రచనలు మాత్రం సంగీత, సాహిత్యాలకు సమపాళ్లలో ప్రాధాన్యతనిచ్చాయి. ఆహార్య అభినయాలు వాటికి తోడైనాయి. ఈ రకంగా పరిశీలించి చూస్తే కవి తన మనసుకి తోచిన విధంగా పేరు పెట్టుకున్నాడని తెలుస్తుంది. కాని రచనల పరంగా నిజానికి పెద్ద భేదం కనపడదు.

**పోలికలు – తేడాలు :**

శ్రీకృష్ణదేవరాయల అనంతరం దక్షిణానికి తరలి వెళ్ళిన ఎందరో కళాకారుల్లో యక్షగానాలను ప్రదర్శించిన వాళ్ళు కూడా ఉన్నారు. అచ్యుతప్పనాయకుడు అచ్యుతపురం అనే పేర ఆ ప్రదర్శకులకు దాన మిచ్చిన గ్రామం ఆనాటికే వారు సంతరించుకున్న ప్రాధాన్యతను సూచిస్తుంది. కాని అంతకు ముందే ఆంధ్రదేశంలో సుమారు వంద సంవత్సరాలుగా ఈ కళ ప్రదర్శింపబడుతోంది.

దక్షిణాది యక్షగానం – కూచిపూడి నృత్యనాటకాలు వేరు వేరనీ వాటికి పోలికలున్నా యక్షగాన ప్రభావం కూచిపూడి నృత్య నాటకాల మీద లేదనీ డా. వేదాంతం రామలింగ శాస్త్రి గారు తమ 'తెలుగులో కూచిపూడి నాటక వికాసము'లో పేర్కొన్నారు. రచనలపరంగా రెండింటా కొన్ని తేడాలున్నా రెండూ ఒక కుదుటిలోవేనని చెప్పవచ్చు. ఇటీవల మేలట్టూరు భాగవతుల ముఖాముఖీ 'అమ్మనుడి' (–16లో వచ్చింది. వాళ్ళు కూడా తాము ఆ కూచిపూడి నుండి వలస వెళ్ళిన వారుగా చెప్పుకోవడం లేదు. కాని, వాళ్ళు అర్థం తెలిసినా తెలియకపోయినా వేదంలా వల్లె వేస్తున్న యక్షగానాల రచనలన్నీ తెలుగువే! డా. వేదాంతం రామలింగ శాస్త్రిగారు శ్రీమాన్ తిరువళికేణి రామానుజయ్యసూరి రచించిన 'ప్రహ్లాదనాటకము' శ్రీకృష్ణదేవరాయల కాలంనాటిదని పేర్కొంటూ ఒక సీస పద్యంలోని మూడు పాదాలను మాత్రం ఉదాహరించారు.

"శ్రీ కిధామంబౌ చు చెలగు నద్దంకి తాతాచార్య శిష్య ప్రధానుడనగ
వన్నెకెక్కిన తిరువళికీణి వంశాబ్ది సోముడా నరసయ సూరికిప్రియ సుతుడు
వేంకటరామసోదర గురుచంద్ర సుతుడ రామానుజసు కవి వరుడ"

ఈ పద్యంలో వేంకటరాయుడు కవిగారికి సోదరుడు, గురువు అనీ, వాళ్ళిద్దరూ నరసయసూరి కుమారులనీ, నరసయసూరి తిరువళికీణి వంశాబ్ది సోముడనీ, అతడు అద్దంకి తాతాచార్యుల శిష్య ప్రధానుడనీ పేర్కొన్నారు. (154–155) అద్దంకి తాతాచార్యులన్న పేరిట ప్రసిద్ధి చెందిన వారు శ్రీకృష్ణదేవరాయల కాలానికి చెందినవారే కనుక, కవి తండ్రి ఆ కాలం వారనీ, పాతిక ముప్ఫై ఏళ్ళ తేడాతో కవి గారు ఉండి ఉండవచ్చనీ ఆయన అభిప్రాయపడ్డారు. కాని, రామానుజుల శిష్య పరంపర, ఆదిశంకరుల శిష్యపరంపర, మాధ్వ శిష్య పరంపర, బసవ పరంపర వంటివి నేటికీ ఆయాశాఖల్లో కనిపిస్తూనే ఉన్నాయి. కనుక, కవిగారి తండ్రి నేరుగా తాతాచార్యుల శిష్యుడా లేక శిష్య పరంపరకు చెందినవాడా అన్నది అనుమానమే! తిరువళికీణివంశాబ్దిసోముడు – నరసయసూరికి ప్రియసుతుడు వేంకటరాముడు ఆతని సోదరుడు గురుచంద్రుడు – ఆతని సుతుడు రామానుజసుకవి అన్న అర్థం చెప్పుకోవాలి. వేంకటరామసోదర గురుచంద్రుడు" అన్నప్పుడు ఈ అర్థమే పొసుగుతుంది. ఆ కారణంగా తిరువెళికీణిలో వెలిసిన 'ప్రహ్లాద చరిత్ర నాటకం' భామాకలాపాదుల తర్వాతదని చెప్పటం వల్ల తప్పకుండా ఆ నాటకం 17వ శబ్దం లేదా 18వ శతాబ్దానికి చెందినదే తప్ప ముందుది కాదనడం సబబు. ఈ చర్చ ఎందుకు అంటే ప్రహ్లాద చరిత్ర నాటకం అన్న రచన పేరు కోసం. సౌభరి చరితాదులు యక్షగానాలన్న పేరిట వెలువడ్డాయి కనుక ఈ రెండూ వేరని వారి వాదన.

యక్షగానాలకు, కూచిపూడి నాటకాలకు (నాట్యనాటకాలు లేదా నృత్య రూపకాలనటం సరిగా ఉంటుంది. ఎందుకంటే ఇవి సంగీత, సాహిత్యాలతోపాటు అభినయ ఆహార్యాలకు చోటిస్తాయి. నాటకంలో సంగీతం ఉండవచ్చు, లేకపోవచ్చు) పోలికలున్నాయి. ఈ రెండింటిలోను ఆహార్యానికి తగిన వాటిని తయారు చేసుకొనే పద్ధతి దేశీయమే! (ఇప్పుడు మార్పు కనిపిస్తోంది) కూచిపూడి గ్రామవాసి, ఆ నాట్యకళాచార్యులు అయిన పసుమర్తి రత్నయ్యశర్మగారు చెప్పినవి – పుణిక, బొడితెచెక్కలతో కిరీటాలు తొలిచేవారు, భుజకీర్తులు చేసేవారు. ఆ చెక్క బరువుండదు. చింతగింజలు నానబెట్టి రుబ్బి, మూకుట్లో ఉడకబెట్టి, తవుడు కలిపి 'మక్కుడి' చేసి దాన్ని పుల్లతో తీసి పెట్టి, ఆపైన తెలుపు ఎఱుపు లాంతరు అద్దాలు, బంగారు కాయితాలు అంటించి ఆభరణాలు చేసుకునేవారు. గోర్లు గిల్లడానికి మంగళ్ళువాడే గోరుగిల్లతో వాటికి చిన్నరంధ్రం చేసి నల్లతాళ్ళతో కనపడకుండా కట్టేవారు. ఇవన్నీ యక్షగానాల్లో పాత్రల ఆహార్యానికి సరిగ్గా సరిపోతున్నాయి. ఈ ఆధునిక కాలంలో గిల్టునగలు, ముందే కుట్టి తయారు చేసిన వస్త్రాలు వేసుకుంటున్నా కిరీటాలు, భుజకీర్తులు, గదలాంటి ఆయుధాలు ఈ నాటికీ అట్టలతో తయారు చేసినవే వాడుతున్నారు.

డా.వేదాంతం రామలింగశాస్త్రిగారి అభిప్రాయం ప్రకారం – యక్షగానాల్లో దరువులు ఎక్కువ. ఒకే రాగాన్ని ఎక్కువ సార్లు పాడటంవల్లా


చాపుతాళాన్ని దరువులకు వాడటం వల్లా అభినయానికి అంతగా అవకాశాన్నివ్వడం లేదు. కూచిపూడి నృత్య నాటకాల్లో భామాకలాపాదులు కాకుండా ప్రహ్లాద చరిత్ర, రామ నాటకాల వంటివి పూర్తిగా మార్గ పద్ధతికి చెందినవి. ఎక్కడైనా దేశీ పద్ధతి తొంగి చూడవచ్చు. యక్షగానం పూర్తిగా దేశీపాదులో పుట్టింది.

సంగీత, సాహిత్య, నాట్యాది ఏ కళ అయినా ఈ ప్రపంచ చరిత్రలో దేశి నుంచి పుట్టి మెల్లగా పరిణామక్రమంలో నిర్ణీతమైన రూపాన్ని సంతరించుకొని మార్గగా స్థిరపడుతుందన్నది చారిత్రిక సత్యం. ఆ పరిణామ క్రమాన్ని అనుసరించే భాషలు కూడా ఏర్పడతాయి. కళలు ఆ దారిలో నడిచినవే. నేడు మార్గ పద్ధతిని అనసరిస్తూ జాతి, వృత్తి పద్యాలను పఠిస్తూ, కొన్నిచోట్ల అనువైన సంభాషణలను ఆశువుగా చెప్తూ నృత్యనాటకాలను ప్రదర్శించడం అన్నది విద్య వల్ల వచ్చిన ఎదుగుదల, సమయస్ఫూర్తి. కాని, మేలట్టూరు మొదలైన భాగవతులు ప్రదర్శించేవి తరతరాలుగా మౌఖికంగా నేర్చుకొన్నవి. ఏది ఏమైనా రెండింటికీ సంబంధించిన రచన ల్లోని పాఠాలు కాస్త తేడాగా ఉన్నా రెండు కళలూ భాగవతుల చేతే ప్రదర్శింపబడుతున్నాయి. ఈ రెండు కళల ఆశయం ఒకటే. ఆహ్లాదం పంచడం. రెండూ చాలా వరకు భాగవతేతివృత్తాలే! అందుకే అవి ప్రద ర్శించే వారు భాగవతులయ్యారు.

## కృష్ణాతీరజిల్లాల్లో వివిధ నృత్యనాటికలు:

కృష్ణాతీరజిల్లాలు – కృష్ణ, గుంటూరు, కర్నూలు, మహబూబ్ నగర్, నల్గొండ. వీటిలో ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ లో మూడు, తెలంగాణలో రెండు ఉన్నాయి. ప్రస్తుతం కృష్ణ గుంటూరు, కర్నూలు జిల్లాల్లో యక్షగానాలు లేదా నృత్య నాటికలు ప్రదర్శించేది కూచిపూడి భాగవతులు, తెలుగు విశ్వవిద్యాలయపీఠమైన సిద్ధేంద్రయోగి పేరిట వెలసిన కూచిపూడి కళాక్షేత్ర విద్యార్థులు, అధ్యాపకులు అని వ్యాసకర్త క్షేత్ర పర్యటనలో తెలిసింది. కూచిపూడి వాస్తవ్యులు పసుమర్తి రత్తయ్య శర్మగారు చెప్పింది ఆహార్యం విషయాలు ముందే ప్రస్తావించాం. పొడవు చేతుల అంగరకా, చెమ్కీ గుడ్డలు ఇటీవల కొన్ని దశాబ్దాల్లో వచ్చి చేరాయి. తెలుపు, ఎఱుపు, పసుపు, గంగ సింధూరం, బులుగు పొడర్లలో కలిపివాడుతారు. కాటుక డబ్బా కనుబొమ్మలకు, కన్నులకు తప్పక ఉపయోగిస్తారు. పాత్రధారులు తమకు తామే అలంకారం చేసుకోవాలి. రాజుపాత్ర వేసే వాళ్ళకు మాత్రం ఎవరో ఒకరు అందించాలి. వస్త్రధారణ మడమల పై దాకా ఉండాలి. అప్పుడే తరంగం ఆడేటపుడు పళ్ళాలు పైన నాట్యం చేసేటప్పుడు జాగ్రత్తగా ఉంటుంది. మధ్యమావతి తోడిరాగాలు వీరరసానికి, శివరంజని, ధన్యాసిరాగాలు శోకరసానికి సాధారణంగా వాడుతారు. సత్యభామ దరువు, కూచిపూడి దరువు వేరు. చినసత్యంగారు దాన్ని మార్చి పాత్ర ప్రవేశానికి జతిని ప్రవేశపెట్టారు. ఇటువంటి చిన్న చిన్న మార్పులనేకం కాలాను గుణంగా లేదా పరిణామక్రమంలో చోటు చేసుకోవడం సహజం.

కూచిపూడి నృత్యనాటకాల్లో సిద్ధేంద్రయోగికి పూర్వం తర్వాత అని విడదీసుకున్నట్లే వెంపటి చిన సత్యంగారికి ముందు – తర్వాత అని కూడా విడదీయాలేమో! దశవతారాలు మొదట్లో మిశ్రంలో ఉండేది, చినసత్యంగారు చతురశ్రంలోకి మార్చారు. ద్విపదలు ఖండగతిలోను, రగడలు, మిశ్ర, చతురశ్ర గతుల్లోను పాడబడతాయి. దరువు మార్గ రీతికి చెందిందిగా వాడబడుతుంది. జయదేవుడి అష్టపదులు, కృష్ణలీలా తరంగిణి వంటివి వాడబడుతున్నాయి. మోహినీ భస్మాసుర నాటకంలో 'క్షీరసాగర మథనం లక్ష్మీ జననం' దాదాపు అరగంట నృత్య ప్రదర్శన జరుగుతుంది. నిజానికి యక్షగానానికి నృత్య నాటకానికీ ప్రధానమైన తేడా ఇదే! నృత్యనాటకం అంతా నృత్య రూపంగానే సాగుతుంది. ఒకే పాత్ర మొత్తం కేళికను ప్రదర్శిస్తే ఏకపాత్ర కేళికవుతుంది. అలాగే పాత్రల



సంఖ్యను బట్టి కేళిక పెరుగుతుంది. కాని, యక్షగానం మొత్తం నృత్యరూపకంలా కాక మధ్యలో నాటకంలో పాత్రలు తగిన చోట నిల్చొని మాట్లాడవచ్చు. నడుస్తూ కూడా మాట్లాడచ్చు. దీన్నిబట్టి చూస్తే కూచిపూడి నృత్య నాటకాలన్న పేరున్నా అవి కూడా యక్షగాన భేదమే అనవచ్చు, కూచిపూడి నృత్య నాటకాలు, ప్రదర్శకులు, రచయితల్లో కొందరు:

పసుమర్తి వేణుగోపాలకృష్ణశర్మగారు. శ్రీవేదాంతం పార్వతీ శంగారు, యామినీ కృష్ణమూర్తిగారు, శ్రీరాజరాధారెడ్డిగార్లు, శ్రీవన శ్రీ జయ రామారావు, డా. మొవ్వ జయలక్ష్మి, శ్రీ పసుమర్తి కేశవప్రసాద్ శ్రీయామినీ రాజీకుమార్గారు, శ్రీవేమూరి రామలక్ష్మిగారు, శ్రీపసుమర్తి రత్తయ్య శర్మగారు ప్రముఖులు. ఈ పేర్లన్నీ ఈ తరానికి ముందు రెండు తరాలకు చెందినవి మాత్రమే! రచనల్లో బాలాంత్రపువారు, దేవులపల్లి కృష్ణ శాస్త్రిగార్లకు ఒరవడి పెట్టిన శ్రీ యస్.పి.భుజంగరాయశర్మగారు, శ్రీదండిభట్ల వెంకట శాస్త్రిగారు, శ్రీ వేదాంతం పార్వతీశ్వరశాస్త్రిగారు. ఒకప్పుడు శ్రీ వేదాంతం పార్వతీశ్వర శాస్త్రిగారు అంటే కూచిపూడి భాగవతం అనీ ఆయనంటే కూచిపూడి అనీ పేరొందారు. పైన పేర్కొన్న వాళ్ళేకాక కూచిపూడి శ్రీసిద్ధేంద్ర కళాక్షేత్ర ప్రిన్సిపల్ డా. వేదాంతం రామలింగ శాస్త్రిగారు రచయిత, ప్రదర్శకులు కూడా! ప్రస్తుతం ఈ కళాక్షేత్రంలో ఎందరో ఔత్సాహిక కళాకారులు కూచిపూడి నాట్యాన్ని, నృత్య నాటకాలను నేర్చుకుంటున్నారు.

**తెలంగాణాలోని ప్రదర్శకులు రచయితలు:**

బొడ్డుపల్లె చంద్రయ్య : రామాయణం, బాలనాగమ్మకథ

దుప్పల్లి శ్రీరాములు – ఛత్రపతిశివాజీ, అల్లూరి సీతారామరాజు, వివేకానందుడు,

సామాజిక నాటకాలు : లాలయ్యపంతులు

బ్రహ్మంగారి చరిత్ర : మన్యమౌనికృష్ణయ్య (సామాజికాంశ నాటకాల కళాకారులు ప్రధానంగా)

నిరక్షరాస్యత నిర్మూలన, మూఢనమ్మకాలు : బుద్దుల భాస్కర్

జై బోలో తెలంగాణా, సప్తస్వరాలు పేరిట జన్మభూమిలోని 7 అంశాలపైన ప్రదర్శనలిచ్చారు – శివనాగులు

వరకట్న నిర్మూలన, ఎయిడ్స్, కుల వివక్షత మొదలైనవి ఇంతేకాక సురభివారి నాటకాలను పండుగలపుడు ప్రదర్శిస్తారు.

గోరేటి వెంకన్న, బుదల భాస్కర్, మన్య మౌనికృష్ణయ్యలు సహోధ్యాయులు పలు సామాజికాంశాలను కళారూపాలతో నిరక్షరాస్యులకు కూడా వివరించారు.

కృష్ణాతీర ప్రాంతాల్లో యక్షగానం, నృత్యగానం, నృత్య నాటకం, నాటకం అనే పేర్లతో ప్రదర్శింపబడుతున్న అనేక కళారూపాలు ఒకే కుదుటిలోంచి పెరిగి రకరకాల రూపాల్ని సంతరించుకున్నాయని చెప్పవచ్చు. ఈ కళారూపాల్లో కాలక్రమేణ వచ్చిన మార్పులు ప్రధానంగా కొన్ని విధాలుగా విభజించవచ్చు.

**పాత్రలు:**

మొదట్లో భామాకలాపం, యక్షగానం, కూచిపూడి భాగవతుల నృత్య రూపకాలన్నిటిలోను స్త్రీ పాత్రలను పురుషులే ధరించేవారు. భామాకలాపంలో ప్రసిద్ధమైన సత్యభామ జడను ధరించడానికి పోటీలు జరిగేవి. ఉష, చెలికత్తె, లీలావతి, మోహిని, సీత, లక్ష్మి, పార్వతి, సత్యభామ, చిత్రలేఖ మొదలైన పాత్రలతోపాటు ఎఱుకత వేషాలు కూడా వేసేవారు. కాని ప్రస్తుతం స్త్రీ పాత్రలను స్త్రీలే ధరిస్తున్నారు. కొన్ని నృత్య నాటకాలను స్త్రీలు మాత్రమే వేస్తున్నారు. శ్రీకృష్ణుడు, శివుడు వంటి పాత్రల్ని స్త్రీలు ధరిస్తున్నారు. ఇది కాలం తెచ్చిన ప్రధానమైన మార్పు. అలాగే మొదట్లో అన్ని పాత్రలను బ్రాహ్మణులే పోషించేవారు, కాని ప్రస్తుతం ఆసక్తి ఉన్నవారందరూ ఈ కళను అభ్యసిస్తున్నారు.

**ఆహార్యం:**

చెక్కలతో చేసిన కిరీటాలు భుజకీర్తులకు బదులు మిగిలిన నగలలాగే గిల్టునగలు వచ్చాయి. పెట్టుడు మీసాలు, గడ్డాలు, రకరకాల సిగలు బయలుదేరాయి. చివరకు వస్త్రాలు కూడా కచ్చపోసి కట్టే చీరలు, పంచెలు కుట్టినవి తయారుగా దొరుకుతున్నాయి.

**రచనాంశం:**

ఒకప్పుడు కేవలం భగవత్ సేవకు, కీర్తనకు ప్రారంభమయిన ఈ కళారూపాలన్నీ కాలక్రమంలో ప్రదర్శనలో చారిత్రక, సామాజికాంశాలను కూడా రచనల్లో పొందుపరచుకున్నాయి. కూచిపూడి, దక్షిణాది కళారూపాల్లో ఈ మార్పులు పెద్దగా కనిపించకపోయినా, మహబూబ్ నగర్ లోని రచనల్లో మాత్రం సమాజంలోని రుగ్మతలను, హెచ్చు తగ్గులను నిర్మూలించడానికి వీటిని వాడుకున్నట్లు తెలుస్తోంది.

జానపద కళారూపంగా మొదలై నృత్త, గానాలతో, వాయిద్యాలతో కలిసిన యక్షగాన ఫణితి ప్రత్యేక నృత్య గాన రూపాలను సంతరించుకొని, కాలంతో పెరిగి ఒక్క పాత్రతో కాక పలు పాత్రలను జతచేర్చుకొని కథను అల్లుకొని సంగీత, సాహిత్య, నృత్యాలతో కలగలసిన రూపకంగా ఎదిగింది. ఒక చెట్టుకుదుట్లో పలు కొమ్మలు విరిసినట్లు, ఒకే తోటలో పలుపూవులు పూసినట్లు చిన్న చిన్న మార్పులతో వివిధ కళారూపాలుగా నేటికీ అలరిస్తున్న ఈ కళలు కృష్ణాతీరాన వ్యాపించి పలువుర్ని అలరిస్తున్నయన్నది అక్షర సత్యం.



డా॥కాళిదాసు పురుషోత్తం
9247564044

# తెలుగువాళ్లు మరచిపోయిన గొప్ప భాషా పరిశోధకులు
# వేదం వెంకటాచలపతిరావు



వేంకటాచలయ్యరు అనబడే కళాప్రపూర్ణ వేదం వేంకట రామశాస్త్రి, తమ్ముడు తమ పూర్వులు తమిళదేశం నుంచి ఆంధ్రదేశానికి వలస వచ్చారని, తమ మాతృభాష తమిళమని చెప్పుకోడానికి పేరు చివర అయ్యరు పదాన్ని చేర్చుకున్నారు తప్ప తమకాలంతో వెంకటాచలయ్యగారనేదే స్థిరపడింది. ప్రాచీన సాహిత్యాన్ని, భారతీయ చరిత్రను, జ్యోతిష శాస్త్ర గ్రంథాలను, భారతీయ సంస్కృతిని ఆధునిక శాస్త్రీయ దృష్టితో చక్కగా అధ్యయనం చేసిన విద్వాంసులు.

వేదం సోదరుల తండ్రి వేంకటరమణశాస్త్రి 19వ శతాబ్ది పూర్వభాగంలో కోస్తా జిల్లాలలోని ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు పండితులుగా పనిచేసి, రాజమండ్రి ప్రభుత్వ కళాశాలలో ఆంధ్రో పన్యాసకులుగా పదవీ విరమణ చేశారు. వెంకటాచలయ్య రాజమండ్రి కళాశాలలో బి.ఎ చదివి, మొత్తం మదరాసు ప్రెసిడెన్సీలోనే ప్రథమ స్థానంలో నిలిచి విజయనగరం, గోటే సంస్థానం వారి నగదు పురస్కారం 550/– రూపాయలు బహుమతిగా పొందారట!

వీరు కొద్దికాలం రాజమండ్రి ఇన్నీసుపేటలో అధ్యాపకులుగా ఉన్న రోజుల్లో చిలకమర్తి ప్రకాశం పంతులు వంటి ప్రతిభామూర్తులు విద్యార్థులుగా ఉన్నారట. ఈ ఇద్దరు తమ స్వీయ చరిత్రలో వేంకటాచలయ్యరును ఆత్మీయంగా ప్రస్తావించారు.

వేంకటాచలయ్య రెండవగ్రేడు వకీలు పరీక్ష పాసై, కొంతకాలం నెల్లూరులో ప్లీడరుగా ఉండి, 1894లో మద్రాసు లా కళాశాలలో చేరి బి.ఎల్.పాసై నెల్లూరు కోర్టులో న్యాయవాదిగా స్థిరపడ్డారు. వీరు సత్యవాదులని, తప్పుడు కేసులు వాదించరని పేరు తెచ్చుకున్నారు. ఆనాటి ఇంగ్లీషు న్యాయాధిపతులు వీరి న్యాయశాస్త్రజ్ఞానాన్ని, ఆంగ్ల సాహిత్య పాండిత్యాన్ని గుర్తించి అప్పుడప్పుడు ఛాంబరులోకి పిలిపించుకొని, న్యాయశాస్త్ర సూక్ష్మాలను అడిగి తెలుసుకొనేవారట.

వేంకటాచలయ్య విశ్రాంతి సమయంలో గ్రంథ పఠనంలో, పరిశోధనలో గడిపేవారట! దేశదేశాలనుంచి పుస్తకాలు తెప్పించి గొప్ప సొంత గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసుకొన్నారు. ఇప్పటికీ వీరి వ్యక్తిగత గ్రంథాలయం వారసుల సంరక్షణలో పదిలంగా ఉంది. వేంకటాచలయ్యగారి జ్ఞానతృష్ణ వారు బహుభాషలు నేర్చుకొనేట్లు చేసింది. సంస్కృతంతోపాటు పార్సి, అవెస్తా, హీబ్రూ, ఫ్రెంచి వంటి భాషల పరిచయం, పాశ్చాత్య విద్వాంసులతో శాస్త్ర విషయాలమీద ఉత్తర ప్రత్యుత్తరాలు జరపడం ఆనాటి పండితుల్లో అరుదైన విషయం. ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో 'అస్సీరియాలజి' లో ప్రొఫెసరు ఏ.జె.సైసి తదితరులతో 'ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపి సందేహ నివృత్తి చేసుకొనేవారట'.

ఒకవైపు న్యాయవాద వృత్తి కొనసాగిస్తూనే, అనేక విశ్వవిద్యాలయ పరిశోధన జర్నల్స్‌కు, కలకత్తా నుంచి వెలువడే "మోడరన్ రెవ్యూ"కు వ్యాసాలు రాసేవారు వెంకటాచలయ్య.

హిందూ లా మీద రాసిన ఒక పుస్తకం (1902', "Notes on a study of the prelimanary chapters of the mahabharatha - an Attempt to seperate the genuine from the spurious" (1922) పేరుతో వ్యాసభారతం మీద వీరు రచించిన ఒక విమర్శ మాత్రం అచ్చయ్యాయి. ఆంధ్ర మహాభారతం తొలి పర్వాలు 4వ శతాబ్దికి చెందినవి కనుక, అవి మూలానికి దగ్గరగా ఉన్నవి కనుకే, దాన్ని 'వ్యాస భారత ప్రతి' రూపంగా స్వీకరించవచ్చని ఈ పుస్తకంలో వెంకటాచలయ్య ప్రతిపాదించారు. వ్యాసుడు గణేశుణ్ణి లేఖకుడుగా కోరుకున్న కథ దక్షిణభారత దేశ ప్రతుల్లో కన్పించదు. ఈ కథను ఉత్తర దేశ ప్రతుల్లో ప్రక్షిప్తం చేసి ఉంటారని వారు భావించారు.

'ఆర్య భాషలు' మాట్లాడే ప్రజల పూర్వులు సప్త సింధు ప్రాంతానికి తరలి వచ్చారనే సిద్ధాంతం ప్రాతిపదిక మీదే వెంకటాచలయ్య రచనలన్నీ బోధపరుచుకోవాలి.

వెంకటాచలయ్య 'కతిపయ శబ్దార్థ, శబ్ద స్వరూప విచారము' శీర్షికతో భారతి మాసపత్రికలో ప్రచురించిన ఐదు వ్యాసాలను హైదరాబాదులోని 'తెలుగు గోష్ఠి' సంస్థవారు 1995లో పుస్తక రూపంలో తెచ్చారు. ఈ వ్యాసాల్లో వెంకటాచలయ్య భారతీయ భాషల్లో కన్పించే అనేక 'లోన్ వర్డ్స్'ను చర్చించి వాటి మూలాలను ప్రదర్శించారు. ఈ వ్యాసాలలో చర్చ భాషా శాస్త్రం, జ్యోతిశ్శాస్త్రం, నరశాస్త్రం (ఆంత్రోపాలజి), ప్రాచీన దేశ చరిత్రవంటి అనేకానేక అంశాల చుట్టూ పరిభ్రమిస్తుంది.

'బడబా' శబ్ద విచారం చేసి, 'బాగ్‌సా' అరబీగా ...వేగాన్ని, పారసీక హయాల వంటి దేహదారుఢ్యాన్ని, కలిగినవి. వాయువేగంతో దౌడుతీసే గుర్రాలనే అర్థంలో అరబ్బీ, పార్సీ పదాల నుండి పుట్టినదని విశదీకరించారు.

'కకుప్' అంటే సంస్కృతంలో దిక్కు అని అర్థం. ఈ పదం అస్సీరియన్ భాషలలోనిదని, బాబిలోనియనులు – అస్సీరియన్ వంశపూర్వుల భాషలో 'కకబు' అనగా నక్షత్రము. అస్సీరియన్ గణములో చేరిన అరబ్బుల భాషలో ఈ మాట కొంచెం రూప భేదంతో స్థిరపడింది. కారబ్ = నక్షత్రం. ఖగోళ విజ్ఞానాన్ని, జ్యోతిశ్శాస్త్రాన్ని మొట్టమొదట కనిపెట్టి ఈ భూమిమీద వ్యాప్తి చెందించినవారు అస్సీరియన్‌లు. వారు నక్షత్రాలను, నక్షత్రాలను బట్టి దిక్కులను గుర్తించడం అలవాటు చేసుకొన్నారు. అందుచేత 'దిక్కులకు నక్షత్రాలకు అభేదాధ్యవసాయము" కలిగి ఆ నక్షత్రం పేరే అక్కడ స్థిరపడిందని వివరించారు.

పరభాషల నుంచి, ఇతర ద్వీపాల నుంచి మన భాషలో పదాలు చేరాయంటే కొందరికి అవమానం. ఇట్లా చెప్పడం తప్పు. సంస్కృత భాషలో ఇతర భాషా పదాలు చేరాయన్నవారిని మనవాళ్లు వేద బాహ్యులుగా, దేశ ద్రోహులుగా పరిగణిస్తారని వెంకటాచలయ్య ఈ సందర్భంలో వ్యాఖ్యానించారు. విదేశాలలో నైఘంటికులు శోధించి ఒక్కొక్కమాట పుట్టుకను, చరిత్రను నిఘంటువుల్లోకి ఎక్కిస్తున్నారు. ఇటువంటి నిఘంటువులు భారతీయ భాషలకు అవసరమని ఆయన అభిలషిస్తారు. తెలుగు నిఘంటువుల్లో తెలుగు పదాలు, అరబ్బీ నుంచి వచ్చి చేరిన విదేశ్యాలుగా చూపించారని, ఇందుకు నిదర్శనంగా అరబ్బీలోంచి పార్శీభాషలోకి, దాని నుంచి తెలుగులోకి వచ్చిన కిటికీ, దుకాణం వంటి పదాలను పేర్కొన్నారు. మన దేశంలోమహమ్మదీయులను మ్లేచ్ఛులని, వారు వ్యవహరించే భాషను మ్లేచ్ఛభాషని అంటారని, అది పొరపాటని హిందూస్థాన్‌లో హిందువులు వాడే భాషలవంటిదే ఇది కూడా అని వ్యాఖ్యానిస్తారు.

**వేతాళ – బేతాళ శబ్దోత్పత్తి**

ఇది హీబ్రూభాషలోని మాట. ఆ భాషలో బెత్ అనగా నివాసము, ఇల్లు. ఎల్ అనగా దేవుడు. దైవానికి నివాసమయినది. అట్లాగే పిశాచాలకు నెలవు అని కూడా వాడుకలోకి వచ్చింది. బెత్ అరబీలో బైత్‌గా మారిందని వివరించారు.

**గారె – శబ్దం గురించి**

గారె శబ్దం గారె శబ్దం పుట్టుక గురించి తెలియలేదని, కన్నడంలో 'గారిగె' అని ఉందని అంటారు. 'గారిసు' అను ధాతుపదం – బాణలిలో తైలంపోసి పదార్థాన్ని వండడం – అనే భావం నుంచి – మూలం నుంచి గారిగె శబ్దానికి 'ఉత్పత్తి కలిగినట్లంటారు. ఇతర భాషల్లో ఈ మాట కనబడదని, శబ్ద రత్నాకరంలో దీన్ని 'వైకృతం' అన్నారని, ఎట్టి వైకృతమో చెప్పలేదని అంటారు.

**వడశబ్దం గురించి**

మన పురాణాల్లో, క్రతు కర్మల్లో దీనినే వటుక అని పేర్కొన్నారు. వటపత్రాకార సామ్యంవల్ల వటకలైనట్లు ఊహించారు. 'కటకము వడగామారియుండునా అని సందేహం వెలిబుచ్చారు. ప్రశ్న వేసుకొన్నారు. వటపత్రం, ఆ జాతిలో చేరిన అశ్వత్థపత్రం 'అమ్మవారి సంజ్ఞా పరిచ్ఛేదములోనివి.

**సుగియ – శబ్దం గురించి**

సుగియలు, సుఖియ, సుకియ, సుగియ రూపాలు వాడుకలో ఉన్నవి. కన్నడంలో సుగ్గి నుండి – సుగ్గి ఉంటే – పదానికి అర్థం బియ్యం పేలపిండిగ చేసి, దానితో బెల్లం, టెంకాయ 'కోరు'ను కలిపి చేయబడిన ఉండ అని కన్నడ నిఘంటువుల్లో ఉంది. సుగ్గి నుండే – సుగ్గి ఉండె తప్ప సుగియ రూపం కన్నడ భాషలో లేదు'. 'సుగ్గి పదానికి మహారాష్ట్రలో, మహారాష్ట్ర ప్రభావం కలిగిన మైసూరు సీమలో "వసన్తర్తువుకు ఆరంభమని యర్థము". బహుశా మధుమాసాగమనంలో ఇటువంటి పదార్థాలు చేసి దేవతలకు నివేదించి భుజించే ప్రాచీన వాడుక ఉండేదేమో అంటూ సుగియ శబ్దం యొక్క వ్యుత్పత్తిని నిశ్చయంగా చెప్పటమని చర్చ ముగిస్తారు.

**బూరె – శబ్దం గురించి**

బూరె శబ్దం నెల్లూరు మండలంలో ప్రశస్తమైనమాట కాదట! ఆ మాటను స్త్రీలు గుహ్యావాచిగ అన్వయింతురు". "బూరె దర్శనం బువ్వనాశనం" అని ముసలమ్మలు పరిహాసంగా అనేవాడుక. బూరె శబ్దం అశ్లీలార్థకం. ఈ శబ్దం సంస్కృత భ్రూణ శబ్దం రెండూ హీబ్రూ భాషకు సంబంధించినవంటారు. హీబ్రూలో ఆ మాటకు స్త్రీ గర్భమని అర్థం. శిశుజననం తాలూకు తంతు, 'అమ్మవారికి' సంబంధించిన శబ్దం. ఇది. ఇందుకు వెంకటచలయ్య కృతి ప్రమాణాన్ని చూపారు.

"గారెలు లేక వడలు స్త్రీ విషయిక ప్రకృతి రూపము; బూరెలు గర్భిణీ రూపము. బూరెల లోపల చణక (శనగ) బీజముల 'పూర్ణ' ముందును. ఇది గర్భములోని 'భ్రూణ' ద్యోతకము".

మోదకము, లడ్డు, ఉండ్రాళ్లు


"ఇవి పురుషాకృతిని అనుసరించి పురుష దేవతకు ముఖ్యమయిన భక్ష్యములు". మోదకం లేదా కుడుము నిడువుగా ఉంటుందని, లడ్డు, ఉండ్రాళ్ళు గుండ్రంగా ఉంటాయని, భావం సుబోధకమని అంటారు. మోదము అంటే సంతోషము అనే మాట నుంచి మోదక శబ్దము నిష్పన్నమయినట్లు ఊహించారు. మహారాష్ట్ర భాషలో 'మోఢ' శబ్దానికి పుట్టుట, పుట్టించుట అనే అర్థాలున్నాయట. ప్రథమాక్షరంలోని దీర్ఘం హ్రస్వమయిన ఎడల, వెంబడి ఉండు హల్లు ద్విరుక్తం కావడం అనేక భాషల్లో ఉందని, తెలుగులోను అటువంటి పదం ఒకటి వాడుకలో వచ్చి ఉండడాన్ని ప్రస్తావించి 'మోఢకము' అవాచ్యంగా ఉంటుందని, కనుక మోదకంగా మారి ఉంటుందని అన్నారు.

వెంకటాచలంగారు ఏదీ సిద్ధాంతంగా చెప్పరు; తమ అభిప్రాయాలను మాత్రమే తేలికపాటి గ్రాంథిక భాషలో వివరిస్తారు. ఈ వ్యాసాల్లో వారి బహుశాస్త్ర పాండిత్యం, పరిశ్రమ వ్యక్తమవుతాయి. ఆలోచనల్లో సమకాలీకులకంటే చాలా ముందున్నా, నిత్యజీవితంలో నైష్ఠికులు. ఏమయినా, నెల్లూరు బ్రాహ్మణ్యం – వారిని వేదబాహ్యునిగా పరిగణించి వెలివేయడానికి ప్రయత్నించడం గమనార్హం.

*(ఈ వ్యాసంలో వెంకటాచలయ్యరు జీవితాంశాలను **'కతిపయ విచారము'** పుస్తకానికి నెల్లూరు వి.ఆర్. కళాశాల ఆంగ్లోపాధ్యాయులు శ్రీ వేదం వెంకటరామన్ రాసిన పరిచయం నుంచి గ్రహించాను)*

తెలుగులో పేరుపలక (బోర్డు) లేని అంగళ్లలో కొనుగోళ్లు చెయ్యవద్దు

మధురాంతకం నరేంద్ర
98662 43659




# వైజ్ఞానిక కథలు–ఒక పరిచయం

సమకాలీన సమాజపు అన్ని పార్శ్వాలనూ సమగ్రంగా చిత్రించే సాహిత్య ప్రక్రియనే ఆ కాలపు ప్రధాన ప్రక్రియగా పేర్కొంటారు. ఆ నిర్వచనం మేరకు గమనిస్తే తెలుగు సాహిత్యంలో యిప్పుడున్న ప్రధాన ప్రక్రియగా కథానిక నిలబడుతుంది. తెలుగు కథానిక యెంత సాధికారికంగా వుందో నిరూపించడానికి యిటీవల వెలువడుతున్న అనేక కథానికా సంకలనాలే ఉదాహరణగా నిలుస్తాయి. యీ వరసలో యిటీవల సాహిత్య అకాడెమీ వాళ్ళు తీసుకొచ్చిన 'వైజ్ఞానిక కథలు' సంకలనం కూడా ప్రధానమైనది.

'సైన్సు ఫిక్షన్' అని యింగ్లీషులో పిలుచుకునే కథానికా ఉప ప్రక్రియకు–యీ కథల సంకలనం సంపాదకులు నాగసూరి వేణుగోపాల్, నామిని సుధాకరనాయుడులు చేసిన నామకరణం 'వైజ్ఞానిక కథలు' అని. 'సైన్సు' అనే యింగ్లీషు పదానికి విజ్ఞానము, శాస్త్రము అనే అర్థాలున్నాయి. అప్పుడు 'సైన్స్ ఫిక్షన్' అనే మాటను శాస్త్రీయ కాల్పనిక సాహిత్యమని గూడా పిలవవచ్చు. 'వైజ్ఞానిక కథలు' అనే మాట ఉన్నంత సహజంగా శాస్త్రీయ కాల్పనిక కథలు అనే మాట వుండదు. శాస్త్రీయమైనది శాస్త్రమయితే కేవలం కల్పన ఆధారంగా తయారైనది కాల్పనిక సాహిత్యమవుతుంది. అలా చూసినప్పుడు 'శాస్త్రీయమైన కల్పన' అనే మాట విరోధాభాస మవుతుంది. మనిషిలో వుండే శరీరమూ, ఆ శరీరపు అవయవాలూ శాస్త్రీయంగా పనిచేస్తుంటాయి. అయితే మనసన్నది మాత్రం శాస్త్రీయతలకు లొంగదు. నిజానికి 'మనిషే' గొప్ప శాస్త్రీయ కల్పన ద్వారా రూపొందినవాడు. కాల్పనికమైన మానవ మేధస్సే శాస్త్రాల్ని రూపొందిస్తోంది. శాస్త్రీయమైన పరిశోధనలు కాల్పనికతతో పోటీ పడుతూ ఉంటాయి. అందుకే వైజ్ఞానిక కథలెప్పుడూ ఆసక్తికరంగా వుంటాయి.

ఇంగ్లీషుతో మాత్రమే కాకుండా, ఇతర భారతీయ భాషలతో పోల్చి చూసినా, తెలుగులోనే తక్కువగా వైజ్ఞానిక కథలు వచ్చినట్టు తెలుస్తోంది. యిందుకు కారణమేమిటో విమర్శకులు పరిశీలించాలి. వైజ్ఞానిక కథలను యెన్నిక చేయాలనుకున్న సంపాదకులకు ముందుగా యేవి ఆ కోవకు చెందుతాయో నిర్ణయించవలసి వచ్చింది. అందుకని వాళ్ళు చాలా మంది విమర్శకులు, ఆ పద్ధతిలో రాసిన రచయితల నిర్వచనాల్ని సేకరించారు. శాస్త్రీయ పరిశోధనలకూ, సాంకేతికమైన విజ్ఞానాలనూ ఆధారంగా చేసుకొని రాసిన కల్పిత కథలే వైజ్ఞానిక కథలని కొందరంటారు. కొత్త విషయాలకు అద్దం పడుతూ మనకు అందుబాటులో వస్తూనే అందకుండా పోయే రహస్య సమాచారాన్ని వైజ్ఞానిక కథలని కొందరు నిర్వచిస్తే అవి వాస్తవ జగత్తుకూ, స్వప్న జగత్తుకూ మధ్య వుండే పలచని పొర అని యింకొందరన్నారు. వైజ్ఞానిక రచయితలు రాయగా, వైజ్ఞానిక సాహిత్యకారులు ప్రచురించగా, వైజ్ఞానిక పాఠకులు చదివేదే వైజ్ఞానిక సాహిత్యమని మరో విమర్శకుడు చిత్రంగా నిర్వచించాడు. యీ చివరి నిర్వచనాన్ని గమనించినపుడు వైజ్ఞానిక కథలను స్పష్టంగా నిర్వచించడం కష్టమన్న విషయం బోధపడుతుంది. శాస్త్రీయతకూ, కాల్పనికతకూ రకరకాల ధోరణులతో, భిన్నమైన మార్గాలలో ముడిబెడుతూ రాసిన విభిన్నమైన అనేక కతలను యీ సంపుటంలోకి చేర్చడం ద్వారా సంపాదకులు వైజ్ఞానిక సాహిత్యపు పరిధినీ, విస్తృతినీ ఉదాహరణ సహితంగా నిర్వచించినట్లయింది.

వైజ్ఞానిక కథలు అనగానే వెంటనే గుర్తుకొచ్చే హెచ్.జి.వెల్స్ (ది టైం మిషన్, యిన్ విజబుల్ మేన్) ఆర్.ఎల్.స్టీవెన్సన్ (డాక్టర్ జెకిల్ అండ్ మిస్టర్ హైడ్) ఎడ్గార్ ఎలాన్ పో (విలియం విలియం సన్, ది గోల్డ్ బగ్)ల మార్గంలో తరువాత చాలా మంది రచయితలు వైజ్ఞానిక కథలను రాశారు. అపరాధ పరిశోధన నవలలు, కథలు చాలా వరకూ శాస్త్రీయతనాధారంగా చేసుకుని రాసినవే! యెర్ల్ స్టాన్లీ గార్డినర్ అనే యింగ్లీషు అపరాధ పరిశోధక నవలా రచయిత వొక నవలకు రాసిన పెద్ద ఉపోద్ఘాతంలో – జరిగిన నేరాన్ని తెలుసుకోడానికి 'వ్యాధి నిర్ణయశాస్త్రము', న్యాయ వైద్యశాస్త్రము యెంత అవసరమో విపులంగా చర్చిస్తాడు.

వైజ్ఞానిక కథలను చాలా వరకూ, శాస్త్రవేత్తలూ, వైద్యులూ, వున్నత విద్యలు చదువుకున్న రచయితలూ రాశారు (కొందరు యిందుకు మినహాయింపు. కానీ ఆ రచయితలకు పెద్దపెద్ద పట్టాలు లేకపోయినా వాళ్లు శాస్త్రీయ గ్రంథాలను బాగా చదువుకున్న వాళ్ళయి వుంటారు). తెలుగు కథానిక 1900 ప్రాంతంలో పుడితే తొలి తెలుగు వైజ్ఞానిక కథ 1927లోనే పుట్టిందని సంపాదకులు పేర్కొన్నారు. "పరమాణువులో మేజువాణి' అనే తొలి వైజ్ఞానిక కథ రాసిన సిరిగూరి జయరావు హైదరాబాదులో బిఎస్సీ చదివిన తర్వాత కలకత్తా వెళ్ళి ప్రసిద్ధ శాస్త్రవేత్త సి.వి.రామన్ దగ్గర పరిశోధనలో చేరినవాడు గావడం యాదృచ్ఛికమని అనిపించదు. అప్పట్లోనే ఐసిఎస్ చేసి మధ్యప్రదేశ్‌లో కలెక్టరుగా పనిచేసిన జయరావు తన 33 సంవత్సరాల లేత వయసులో ప్రమాదంలో మరణించాడు. నాల్గవ పరిమాణం ఆధారంగా రాసిన ఈ కథ ఎర్రా ప్రగడ రాసిన పద్యంతో ప్రారంభం కావడం అందమైన ఆరంభంగా

మురిపిస్తుంది. అణువు చుట్టూ న్యూట్రానూ, ప్రోటానూ, ఎలెక్ట్రానూ చేసే పరిభ్రమణాలు జయరావుగారికి రంగస్థలంపైన ప్రధాన నర్తకి చుట్టూ మిగిలిన నర్తకులు చేసే నాట్యంలాగా కనబడింది.

'ఓర్తు కరతాళ మొనరింప, నోర్తు సమద
గీతి పచరింప, సరితాలగింపనోర్తు
మధుర మదిరా రసోల్ల సమత్తయగుచు
నాడెనొక్కతె లలితాంగి హావగతుల'


అనే ఎర్రాప్రగడ పద్యంలోంచీ తొలి తెలుగు వైజ్ఞానిక కథ పుట్టిందని యీ సంకలనం చెబుతోంది. అలాగే పాదలేపన సహాయంతో హిమాలయాలకు వెళ్లిన ప్రవరుని అవస్థలను పెద్దనగారి అనేక పద్యపాదాలతో వివరిస్తున్నప్పుడు వైజ్ఞానిక సాహిత్యపు మూలాలు గూడా ద్యోతకమవుతాయి. 'అన్నీ వేదాల్లో వున్నాయిష' అనే ఛాందస నమ్మకం మంచిదిగాదు గానీ, వొకప్పుడు రచయితలూ, కవులూ చేసిన ఊహల్ని శాస్త్రజ్ఞులు తర్వాత నిజాలు చేశారనయినా గుర్తించవచ్చు. శాస్త్రజ్ఞులు రకరకాలుగా పరిశోధనలు చేయడానికి సాహిత్యకారులు తమ భావుకతతో స్ఫూర్తిని కలగజేశారనీ భావించవచ్చు.

తొలి తెలుగు వైజ్ఞానిక కథకూ, 'అదృశ్యవ్యక్తి' అనే రెండో కథకూ వేదిక కలకత్తా నగరం గావడం మరో గుర్తుంచుకోవల్సిన అంశం. యీ సంపుటంలోని కథలు చదువుతున్నప్పుడు, యీ అంశాలనాధారంగా చేసుకుని వచ్చిన అనేక సినిమాలు జ్ఞాపకం వస్తాయి. తెలుగు సాహిత్యానికి వైజ్ఞానికాంశాలను జోడించిన ప్రసిద్ధ కథకుడు కొడవటిగంటి కుటుంబరావు దగ్గరి నుంచీ, ఆ కోవలోచాలా రచనలు చేసిన యన్.ఆర్. నంది, కే.ఆర్.కె.మోహన్, పురాణపండ రంగనాథ్, మైనంపాటి భాస్కర్, కస్తూరి మురళీకృష్ణ వంటి వాళ్ళు చాలా వైజ్ఞానిక కథలు రాశారు.

దాదాపుగా తెలుగు వైజ్ఞానిక కథకు పర్యాయపదంగా మారిన రచయిత కె. సదాశివరావు. ఆయన వైజ్ఞానిక కథలన్నీ యిటీవలే సంపుటంగా వచ్చింది. 'పాలపిట్ట' మాసపత్రికలో ఆయన అనేక యితర భాషల వైజ్ఞానిక కథా రచయితలనూ, రచనలనూ సమగ్రంగా పరిచయం చేశారు.

చంద్రమండల యాత్రలు, రోబోలూ, వైద్య సంబంధమైన అంశాలూ, యెగిరే పళ్ళాల్లో వచ్చే గ్రహాంతరవాసులు మొదలైన అనేక అంశాల గురించి రాసిన వైజ్ఞానిక కథలు అనేక మానవీయమైన అంశాలను ఆత్మీయంగా, రసవత్తరంగా గూడా ఆవిష్కరిస్తాయి. శాస్త్రీయత మనిషినెంత యాంత్రికంగా మార్చినా, అతనిలోని మానవీయ లక్షణాలు మరుగున పడవని చెప్పే కొమ్మూరి వేణుగోపాలరావుగారి 'మరమనిషి' గొప్ప తెలుగు కథల జాబితాలో యెప్పుడూ వుంటుంది. శాస్త్రీయతనాధారంగా చేసుకుని ఆధునిక సమాజాన్ని తూర్పారబెట్టడమెలాగో కవనశర్మగారి 'బచావో' చూపెడుతుంది.

యీ సంకలనంలోని 27 కథలను వో విమర్శకుడు 27 నక్షత్రాలతో పోల్చడం గూడా వైజ్ఞానిక ధోరణినే ప్రతిపాదిస్తోంది. తెలుగు కథానిక సమకాలీనతనూ, సమగ్రతనూ, సాధికారికతనూ నిరూపించే యిటువంటి కథల సంకలనాలు మరింత విరివిగా రావల్సిన అవసరం ఉంది.





# బౌద్ధం - వైజ్ఞానిక మార్గం

బొర్రా గోవర్ధన్
93906 00157

## 13. శూన్యవాదం నుండి 'సున్నా'

బౌద్ధం విశేషంగా అభివృద్ధి చేసిన శాస్త్రాల్లో గణితం మరొకటి. గణిత శాస్త్రం భౌతిక ప్రపంచం నుండి నేర్చుకునేది కాదు. అది మనో సృష్టి. మానవ మేధస్సు నుండి ప్రపంచంలో అనేక విషయాల్ని కొలిచే శాస్త్రం. గణితం అంటేనే లెక్కించడం లేదా కొలవడం.

సంఖ్యలు, లీటర్లు, గ్రాములు, డిగ్రీలు.. ఈ కొలతలేవీ భౌతిక సామాగ్రి కాదు. ప్రపంచాన్ని తన అనుభవంలోకి తెచ్చుకోవడం కోసం మనిషి ఆవిష్కరించుకున్న ఒక అద్భుత విధానం.

అందుకే...ఎప్పటికీ మానవ నాగరక సమాజంలో గణిత శాస్త్రానికి ఒక విశేష ప్రాముఖ్యత ఉంటూనే ఉంటుంది.

ప్రపంచంలో ఎన్నెన్ని నాగరికతలు ఉన్నా...అవి మనకంటే అనేక విషయాల్లో ముందున్నా, మనల్ని అగ్రస్థానంలో నిలిపేది 'గణితం' ఒక్కటే!

ఈనాడు ఇంగ్లీషు ప్రపంచ భాషగా రూపొందినట్లు - భారతీయుల గణితమే ప్రపంచ గణితంగా పరిఢవిల్లుతోంది!

ఈనాడు ప్రపంచం వాడే గణిత విధానాలన్నీ భారతీయులవే!మన గొప్పతనాన్ని ప్రపంచ శిఖరం మీద నిల్పిన ఈ గణితాన్ని తీర్చిదిద్దిన వారు బౌద్ధులే!!

### బౌద్ధులకు ముందు

బౌద్ధులకు ముందున్న వేదాల్లో గణిత ప్రక్రియల గురించి విశేషాలేమీ లేవుగాని, అంకెలు, సంఖ్యల ప్రస్తావనలు అనేక చోట్ల వచ్చాయి. రుగ్వేదంలో 1, 2, 3, 4, 5, 6, 7, 8, 9, 10, 20, 30, 40, 50, 60, 70, 80, 90, 100, 333, 990, 1000..ఈ సంఖ్యల ప్రస్తావనలున్నాయి. యజుర్వేదంలో శుద్ధగణితం (అర్థమెటిక్స్) లోని ఈ సంఖ్యల వివరాలు మరి కొన్ని ఉన్నాయి. 17వ అధ్యాయం రెండో మంత్రంలో ఇలా ఉంది: ఒకటి, పది, వంద($10^2$), వేయి ($10^3$), ఆయుతం($10^4$), నియుతం($10^5$), ప్రయుతం($10^6$), అర్బుదం($10^7$), సముద్రం($10^8$), మధ్యమం($10^9$), అంతమం($10^{10}$), పరార్థం($10^{11}$). పరార్థం అంటే 10000,00,00,000 (పదివేల కోట్లు)...ఈ సంఖ్యల గురించి ఉంది.

ఒక సమాజంలో పెద్దపెద్ద సంఖ్యలు వినియోగంలో ఉన్నాయంటే..ఆ సమాజంలో వస్తువినియోగం గణనీయంగా పెరిగిందన్నమాట.

శుక్ల యజుర్వేదం (12-76)లో మాత్రం 1000×1000 (వేయివేలు) అనే గుణకార ప్రయోగం కన్పిస్తుంది. కృష్ణయజుర్వేదంలో (4-2-1)లో లక్ష సంఖ్య గురించి ఉంది. అంటే...

యజుర్వేద కాలానికి లక్షలు,కోట్ల సంఖ్యల్ని గుర్తించే స్థాయికి గణితం అభివృద్ధి చెందిందన్న మాట.

యజుర్వేదానంతరం మూడొందల సంవత్సరాలకి బౌద్ధయుగం ప్రారంభమైంది...బుద్ధుని ప్రవచనాల్లోగానీ, ఇతర పిటకాల్లోగానీ నైతిక ప్రబోధాలే ప్రధానంగా ఉన్నాయి. వాటి మధ్యమధ్య చిన్నచిన్న సంఖ్యల ప్రస్తావనలే వచ్చాయి. బుద్ధుని పరి నిర్వాణానంతరం వందేళ్లలో వచ్చిన 'లలిత విస్తరం' అనే గ్రంథంలో గణితం గురించిన వివరాలు విశేషంగా ఉన్నాయి.

### లలిత విస్తరం - తొలి గణిత గ్రంథం

లలిత విస్తరం ఒక బౌద్ధ పురాణం. బుద్ధుణ్ణి పురాణ పురుషునిగా మలిచిన మహాయాన గ్రంథం. అశోకుని కాలానికే ఉన్న తొలి బౌద్ధ సంస్కృత గ్రంథం.

ఈ గ్రంథంలో 11వ భాగమైన 'శిల్ప సందర్శన పరివర్తం'లో ఆనాటి గణ రాజ్య యువకులకు జరిగే విద్యా ప్రదర్శన పోటీల్లో ఈ గణిత విషయం ప్రధానంగా ఉంది.

లిపులకు (భాషలకు) సంబంధించిన పోటీని 'విస్వమిత్తుడు' అనే గురువు న్యాయ నిర్ణేతగా నిర్వహిస్తాడు. 62 లిపుల్లో పరీక్ష పెడతాడు.

మొత్తం 90 రంగాల్లో పరీక్షలు జరుగుతాయి. వాటిలో మొదటిది లిపి పరీక్ష. కాగా రెండోది 'సంఖ్యా గణన' పరీక్ష. ఈ పరీక్షని 'అర్జునుడు' అనే మహామంత్రి నిర్వహిస్తాడు.

అర్జునుడు పోటీ ప్రారంభిస్తూ "ఆయుతం...ఆ పైనుండే సంఖ్యలతోనే పోటీ మొదలవుతుంది" అని ప్రకటిస్తాడు.

ఆయుతం అంటే యజుర్వేదంలో 10వేలు గదా! ఆనీ ఇక్కడ ఆయుతం అంటే...100,00,00,000 (నూరు కోట్లు) దీన్ని మనం $10^9$ అంటాం (10×10×10×10×10×10×10×10×10): పది తర్వాత 9 సున్నలు ఉండే సంఖ్య – ఆ తర్వాత సంఖ్యలు ఇలా ఉన్నాయి.

ఆయుతం... $10^9$ = 100 కోట్లు.

నియుతం... $10^{11}$ = 10 వేల కోట్లు.

కంకరం ... $10^{13}$ = 10 లక్షల కోట్లు.

వివరం... $10^{15}$ = 10 కోట్ల కోట్లు.

అక్షోభ్యం... $10^{17}$ = వెయ్యి కోట్ల కోట్లు.

వియహం... $10^{19}$ = లక్ష కోట్ల కోట్లు

ఉత్సంగం... $10^{21}$ = 10 లక్షల కోట్ల కోట్లు

బహుళం ... $10^{23}$ = 100 కోట్లకోట్ల కోట్లు.

మీకు గుర్తుందా!!? మాయాబజార్ సినిమా. ఘటోత్కచుడు తన అనుచరులతో..." హయ్ లంబు..హాయ్ జంబు... మన సైన్యం ఇక బహుళం...ద్విగుణం కావాలి" అంటాడు. అంటే..బహుళానికి రెట్టింపు అని. ఇక,..

పైన చెప్పుకున్న ప్రతిదీ ఒక దానికి మరొకటి వంద రెట్లు పెరిగే సంఖ్య. అలాగే...

100 బహుళాలు...ఒక నాగబలం = ($10^{25}$)

100 నాగ బలాలు...ఒక తిటి బలం = ($10^{27}$)

100 తిటి బలాలు...ఒక ప్రజ్ఞప్తి = ($10^{29}$)

100 ప్రజ్ఞప్తులు...ఒక హేతుహిలం ($10^{31}$)

ఇలా... హేతుహిలం... ఆ తర్వాత కరఘువు ($10^{33}$), హేత్రింద్రయం($10^{35}$), సమాప్త లంబం($10^{37}$), గణనాగతి($10^{39}$), నిరవత్యం($10^{41}$), ముద్రాబలం($10^{43}$), సర్వబలం($10^{45}$), విసంజ్ఞాగం($10^{47}$), సర్వ సంఖ్య ($10^{49}$)....

100 సర్వ సంఖ్యలు...ఒక విభూతంగమం ($10^{51}$)

100 విభూతాంగాలు...ఒక తల్లి క్షణం...

తల్ల క్షణం అంటే $10^{53}$

పదివేల తలక్షణాలు = ఒక మేరువు ($10^{57}$)

పదివేల మేరువులు = ఒక ధ్వజాగ్రం ($10^{61}$)

పదివేల ధ్వజాగ్రాలు = ధ్వజాగ్రపతి ($10^{65}$)

పదివేల ధ్వజాగ్రపతులు = ఒక ధ్వజాగ్ర నిశామణి ($10^{69}$)

పదివేల విశామణులు = ఒక వాహన ప్రజ్ఞప్తి ($10^{73}$)

మరలా...ఇలా...వాహన ప్రజ్ఞప్తిపై ($10^{77}$), కురుడ ($10^{81}$), కురుటావి ($10^{85}$), సర్వనిక్షేప ($10^{89}$), అగ్రసార ($10^{93}$), ఇలా... చివరికి

10 వేల అగ్రసారలు = ఒక పరమాణురజః ($10^{97}$)

ఇలా... ఈ పరమాణురజః అనే సంఖ్య వరకూ అర్జునుడు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టుతాడు –

సిద్ధార్థుడు తప్ప మరెవ్వరూ ఈ సంఖ్యల గురించి వివరించలేరు. పరీక్షకుడైన అర్జునునికి కూడా ఇంతకు మించి తెలియదు. అప్పుడు సిద్ధార్థుడు...

"మహామంత్రీ! తమకు పరమాణురజఃకు మించిన సంఖ్యలు తెలుసా?" అని అడుగుతాడు. అర్జునుడు తెలియదంటాడు. అప్పుడు సిద్ధార్థుడు దానిపై సంఖ్యల్ని చెప్తాడు.

ఆ తర్వాత సంఖ్యల్ని ఏడురెట్లు పెంచి చెప్తాడు.

7 పరమాణురజఃకులు = 1 అణువు.

7 అణువులు = 1 తృతి

7 తృతులు = 1 వాతాయన రజస్సు.

అంటూ...ఈ పరమాణువుల్ని గంగానదీ తీరంలోని సన్నని ఇసుక రేణువులతో పోల్చి, ఆ కణువుల్ని ఒకదాని ప్రక్కన ఒకటి చేర్చి...సంఖ్యామానాన్ని దూరమానంలోకి తీసుకు వస్తాడు సిద్ధార్థుడు.

**సంఖ్యామానం నుండి దూరమానం**

పైన చెప్పిన వాతాయన రజస్సులు...(ఆ తర్వాత ప్రతిదీ 7 రెట్లు పెరుగుతూ వస్తాయి) శశ రజస్సు, యేడక రజస్సు, గో రజస్సు, లిక్షా రజస్సు, సర్షపం, యవం......

7 యవలు....1 అంగుళీ పర్వం

12 అంగుళీ పర్వలు...1 వితస్తి

2 వితస్తలు...1 హస్తం.

4 హస్తలు...1 ధనుస్సు

వేయి ధనుస్సులు...1 మార్గం

(ఈ 'మార్గం' అనే కొలత నుండే 'ఫుర్రో లాంగ్' ఫర్లాంగు పుట్టింది.)

రెండు మార్గాలు...1 కోసు

4 కోసులు...1 యోజనం

"యోజన పిండం" అనేది అతిపెద్ద కొలత.

ఈ కొలతతో జంబూ ద్వీప వైశాల్యం 7000 యోజనాలని ఉంది. ఇలా సంఖ్యాశాస్త్రాన్ని , దూరమానంగా, క్షేత్రమితాగా మలచడం గొప్ప విషయం.

ఇలా సంఖ్యాశాస్త్రంలో గుణిజ సంఖ్యల్ని, వర్గ సంఖ్యల్ని లలిత విస్తరంలో చూస్తాం. మనకి ఇప్పటి వరకూ దొరికిన అధారాల్నిబట్టి గ్రంథం రూపంలో దొరికిన మొట్టమొదటి గ్రంథం ప్రపంచంలో 'లలిత విస్తరం' మాత్రమే.

లలిత విస్తరం తర్వాత 200 ఏళ్లకి వచ్చిన అధర్వణ వేదంలో

అమ్మనుడిపై నెనరు లేనివాడు కన్నతల్లినీ, పుట్టిన నేలనీ ప్రేమించలేడు..

కూడా ఇంత గణిత పరిజ్ఞానాన్ని చూడలేం.

ఆ తర్వాత గుప్తుల కాలంలో మరలా గణిత శాస్త్రం ఊహించని మలుపు తిరిగింది. భారతీయుల గణితం ప్రపంచగణితంగా మారడానికి కావలసిన భూమిక ఈ కాలంలోనే పడింది. దీనికి వేదిక నలంద విశ్వవిద్యాలయం. అందుకు కారణం ఆర్యభట్ట.

## అరియ భత్థ లేదా ఆర్యభట్ట

అరియ భత్థ అనేది పాళీపదం. సంస్కృతంలో ఆర్య అంటారు. అరియ శబ్దాన్ని పేరుకు ముందు విశేషణంగా బౌద్ధులే వాడారు. అరియ అంటే గురువు,పూజనీయుడు అని. అరియ అష్టాంగ మార్గం, నాలుగు అరియ సత్యాలు, ఆర్య శూరకవి...ఇలా ఆర్యశబ్ద ప్రయోగం బౌద్ధంనిండా ఉంటుంది. ఆర్యభట్టు కాదు ఆర్యభట్ట. భత్థ అంటే వరిధాన్యం అని. 'భత్థ' అనేపేర్లు ఉన్న భిక్షువులు కొందరున్నారు.

ఆర్యభట్ట నాలందా విశ్వవిద్యాలయంలో చదివాడు. ఆ తర్వాత అక్కడే కొంతకాలం ఆచార్యునిగా పనిచేశాడు. ఆ తర్వాత ఆ విశ్వవిద్యాలయం కులపతిగా చాలాకాలం పనిచేశాడు. బౌద్ధేతరులు నాలందలో చదవవచ్చు. ఆచార్యునిగా , కులపతిగా బౌద్ధేతరులు ఉండటానికి వీలులేదు.

ఆర్యభట్ట కాలంలో విశ్వవిద్యాలయంతో ఉన్న ప్రధానమైన ఏడు శాఖల్లో గణిత, ఖగోళ శాఖ ఒకటి. ఈ రెండు శాఖలు ఆయన నిర్దేశకత్వంలోనే నడిచాయి. అవిభాజ్యంగా సాగాయి.

లలిత విస్తరం తర్వాత గణితశాస్త్రానికి గాను మనకు దొరికిన రెండో ఆధారం ఆర్యభటీయమే! లలిత విస్తరం సంపూర్ణ గణిత గ్రంథం కాదు. కానీ, ఆర్యభటీయం సంపూర్ణ గణిత గ్రంథమే!

ఈ గ్రంథంలో ఆర్యభట్ట తన పుట్టుక తేదీని గురించి గణిత ఖగోళ అంశాలతో ఎలా ముడిపెట్టి చెప్పాడో చూడండి...

"షష్ట్యబ్దానాం షష్టిర్యందా

వ్యతితాస్త్రయాశ్చ యుగపాదాః

త్ర్యయాధికా వింశతిరాబ్దాస్తధిః

మమ జన్మనోతి తాః" –

అంటే..."మూడు యుగాలు గడిచిపోయాయి. నాలుగో యుగంలో అరవై సంవత్సరాల కాల చక్రం అరవైసార్లు తిరిగింది. ఆపై ఇరవై మూడేళ్ళు గడిచాయి – " అని.దీన్ని బట్టి ఆర్యభటీయం రచనా కాలం కలియుగంలో 3,124 సంవత్సరాలనాటిది.

ఇక , ఆయన పుట్టిన సంవత్సరం చూడండి..

60×60= 3,600 సంవత్సరాలు + 23 సంవత్సరాలు =

మొత్తం 3,623 సంవత్సరాలు

3124 – 3623 = 499.

అంటే క్రీ.శ. 499 లో ఆర్యభట్టీయం రాశాడు. అప్పటికి ఆయనకు ఇరవై మూడేళ్ళు. అంటే క్రీ.శ. 476 ఆయన పుట్టిన సంవత్సరం.

ఇక, ఆయన పుట్టిన ప్రదేశం గురించి ఆ తర్వాతి వారు చెప్పారు. 1వ. భాస్కరుడు ఆర్యభట్ట అశ్మక దేశీయుడు అని చెప్పాడు. ఆర్యభటీయాన్ని అశ్మక తంత్ర అనీ, ఆర్యభట్ట సిద్ధాంతాన్ని నమ్మేవాళ్లని "అశ్మకేయులు" అని రాశాడు.

ప్రముఖ గణిత శాస్త్రవేత్త 15వ శతాబ్దికి చెందిన నీలకంఠుడు కూడా ఆర్యభట్టను 'అశ్మిక జనపదానికి' చెందినవాడు అని రాశాడు.

ఈ అశ్మిక ప్రాంతం మగధ రాజ్యంలోని పాటలీపుత్రం. (పాట్నా) దానికి దగ్గరలోని "కుసుమపురం" ఆయన జన్మస్థానం అని తేల్చారు.

వేయేల.. ఆరియ భత్థ నలందా కులపతిగా పనిచేసిన బౌద్ధా చార్యుడు. బౌద్ధ భిక్షువు.

## ఆర్యభటీయం

ఆర్యభటీయం 121 శ్లోకాల గ్రంథం (రెండు సంఖ్యల్లో ఒకే అంకె వచ్చే, రెండు ప్రధాన సంఖ్యల లబ్ధం : 11×11= 121)

ఇందులో 4 అధ్యాయాలున్నాయి. మొదటి రెండు అధ్యాయాలూ (13+33=46 శ్లోకాలు ) గణితానికి సంబంధించినవి. మిగిలిన రెండు అధ్యాయాలూ (25+50=75 శ్లోకాలు) ఖగోళానికి చెందినవి.

ఈయన రాసిన రెండో గ్రంథం "ఆర్యభట సిద్ధాంతం". ఇది పూర్తిగా దొరకలేదు. 34 శ్లోకాలే లభించాయి. వాటిలో ఖగోళ పరిశీలనా పరికరాల నిర్మాణం, పనితీరుల గురించి ఉంది. ఇప్పుడు ఆయన అందించిన గణిత పరిజ్ఞానాన్ని గురించి చూద్దాం.

## సంఖ్యామానంలో 'సున్న'

మనం ఇంతకు ముందు వేదాల గురించి, లలిత విస్తరం గురించి చెప్పుకున్న సంఖ్యలన్నీ అంకెల రూపంలో లేవు. పదిని దశ అని, వందను 'శత'అని , వెయ్యిని సహస్ర అనే పదంతో నే సూచించారు. ఇలా '100' అనే సంజ్ఞా రూపంలో కాదు. అప్పటికి అంకెల్ని సంజ్ఞలుగా రాసే విధానం లేదు.

అంకెలకు సంజ్ఞల రూప కల్పన జరిగాకే గణితం అభివృద్ధి చెందింది. మొదట పదిని రెండు స్థాన సంఖ్యగా (10 గా) చూపించే దశాంశమాన విధానం లేదు. ఉదా॥ రోమన్ విధానంలో పదిని 'x' గా సూచిస్తాం. తొమ్మిదిని 'IX' లా సూచిస్తాం. 50 ని ' L ' గా, వందని ' C ' గా 98 ని 'XCVIII' గా సూచిస్తాం. దాదాపుగా ప్రపంచంలో అన్నిచోట్లా ఇలాంటి స్థాన విలువలు లేని అంకెలతోనే సంఖ్యలు ఉండేవి. ఈ అంకెల వల్ల గణిత ప్రక్రియలు చేయడం చాలా కష్టం.

34+49 ని కూడాలంటే మనం ఒకదాని క్రింద ఒకటి వేసుకుని కూడేస్తాం. తీసివేయాలంటే తీసివేస్తాం. మరి దీన్నే రోమన్ సంఖ్యల్లో వేస్తే :

(C X X X I V) + (X L I X)

(34) + (49)

ఎలా కూడగలం – కాబట్టి ఇలాంటి ప్రక్రియలవల్ల గణితం వేగం పుంజుకోలేదు –

అయితే అంకెలకు స్థానాలు కలిగించి ఉపయోగించే విధానం

తెలుగు మాధ్యమాన్ని తీసివేస్తే తెలుగు వర్ధిల్లదు

సింధూ ప్రజలకు తెలుసు. వారు చిన్నచిన్న సంఖ్యల్ని ద్విసంఖ్యామానం (బైటరీ సిస్టం) లో, పెద్దపెద్ద సంఖ్యల్ని దశాంశ మానంలో (డెసిమల్ సిస్టం)లో రాశారు. అయినా వారికి 'సున్నా' తెలియదు.

ఈ సింధూ ప్రజల సంఖ్యామానం బుద్ధుని కాలానికే కనుమరుగై పోయింది. ఆటవిక ఆర్యులు సింధు ప్రజల గణిత స్థాయిని అందుకోలేక పోయారు. దీనివల్ల ఆ విజ్ఞానం కాల గర్భంలో కలసి పోవాలి. దాదాపు కలిసిపోయింది కూడా. కానీ , మూలవాసులల్లో ఏదోమూలన పడి మూలుగుతూ ఉండిఉంటుంది.

ఆ సింధూ విజ్ఞానం...తిరిగి ఆర్యభట్ట రూపంలో అంకురించింది. సింధూ ప్రజల సంఖ్యామానం ఆర్యభట్టకి తెలుసో తెలియదో మనకి తెలియదు. కానీ వారి దశాంశ మానానికి నూతన ప్రాతిపదికలు సమకూర్చాడు. ఆర్యభట్ట విశేష ప్రజ్ఞ ఏమంటే 'సున్న' ను – ఆవిష్కరించడం.

'చక్రం' కనిపెట్టాక నాగరికత ఏ విధంగా పరుగులు పెట్టిందో.... 'సున్న' ను ఆవిష్కరించాక గణితశాస్త్రం కూడా అలాగే పరుగులు పెట్టింది.

**ఆర్యభట్ట దశాంశ విధానం**

ఆర్యభట్ట ఈ నాడు మనం " ఒకట్లు, పదులు, వందలు, వేలు..." అని చెప్పుకునే సంఖ్యల స్థానాలకి, ఆయన అక్షరాల్ని భూమికగా తీసుకున్నాడు.

అచ్చుల్ని స్థాన విలువల స్థానాలుగా ఉంచాడు.

వాటిని ఎడమ నుండి కుడికి రాశాడు –

ఇలా...

12 11 – 10 9 – 8 7 – 6 5 – 4 3 – 2 1

ఔ ఓ – ఐ ఏ – ౠ ఋ – ఊ ఉ – ఈ ఇ – ఆ అ

। । । । । । । । । । । ।

0 0 00 0 0 0 0 0 0 00

పైన చెప్పిన వాటిలో బేసి స్థానాలైన అ, ఇ, ఉ, ఋ, ఏ, ఓ, స్థానాలు "వర్గ" స్థానాలు. సరి స్థానాలైన ఆ, ఈ, ఊ, ౠ, ఐ, ఔ లు "అవర్గ" స్థానాలు –

ఇక స్థాన విలువలు చూద్దాం : హల్లులకి అంకెల రూపం ఇచ్చాడు:

క్ = 1 ఖ్ = 2 గ్=3 ఘ్ = 4 ఙ = 5

చ్= 6 ఛ్ = 7 జ్=8 ఝ్= 9 ఞ = 10

ట్ = 11 ఠ్ = 12 డ్= 13 ఢ్ =14 ణ్ = 15

త్ = 16 థ్ =17 ద్ = 18 ధ్=19 న్ = 20

ప్ = 21 ఫ్ =22 బ్=23 భ్ =24 మ్=25

య్=30 ర్=40 ల్=50 వ్=60

శ్=70 ష్=80 స్=90 హ్ =1000

ఉదాహరణకి "కా + కి' అనే అక్షరాల్ని అంకెలుగా మార్చి, స్థానాల్లో వేద్దాం : ఎలాగంటే :

"కా" అంటే : క్ + ఆ

"కి" అంటే : క్ + ఇ

క్ అంటే 1 గదా !

| | ఏ | ఊ | ఉ | – ఈ – | ఇ – | ఆ – | అ |
|---|---|---|---|---|---|---|---|
| కా= | | | | | | 1 | 0 |
| కి = | | | | | 1 | 0 | 0 |
| కా+కి = | | | | | 1 | 1 | 0 |

అంటే 'క్' అంటే ఒకటి కాబట్టి దానిని 'ఆ' అనే పదం స్థానంలో వేయాలి. అది రెండో స్థానం. పదుల స్థానం. అలాగే మరో ఒకటిని 'ఇ' అనే పదం స్థానంలో వెయ్యాలి. అ, ఆ ,ఇ ,ఈ ..ల స్థానాలు ఇవి:

అ = ఒకట్ల స్థానం

ఆ = పదుల స్థానం

ఇ = వందల స్థానం

ఈ = వేల స్థానం

ఉ = 10వేల స్థానం

ఊ = లక్షల స్థానం

ఇలా స్థాన విలువల్ని రూపొందించాడు ఆర్యభట్ట. దీనితో 'చతుర్విధ ప్రక్రియలు' తేలికైపోయాయి. అయితే, 'సున్న' ను ఇలా 'o' ఈ రూపంలో ఆర్యభట్ట రాయలేదు. ఆయన ఆ శూన్య స్థానంలో ' .' ఇలా చుక్కను ఉంచాడు.

ఆ "శూన్య" స్థానం అనేది లేనిది కాదు. ఉన్నదీ కాదు. సున్నకు విలువ లేదు. కానీ అది మిగిలిన సంఖ్యల విలువల్ని పెంచుతుంది. అంటే ఉందన్న మాఇట. అది ఉంటుంది, అంతలోనే లేనట్టుగానూ




గుండెలోతుల్లోంచి వచ్చేదీ, మనసు విప్పి చెప్పగలిగేది అమ్మనుడిలోనే.

ఉంటుంది. అంటే...అది 'క్షణికం' అన్న మాట. బుద్ధుడు చెప్పిన ప్రతీత్యసముత్పాదమే క్షణికవాదం. "మారే వస్తువు కూడా అంతే...కొత్తగా ఉంటుంది. కానీ పూర్తిగా కొత్తదీ కాదు. పాతది కాదు, పాతది కాకుండానూ పోదు..." ఈ భావనే ఆ శూన్య స్థానానికి 'శూన్య, సున్న' అనే స్థాన విలువకు ప్రాతిపదిక అయ్యింది.

బౌద్ధంలోని శూన్యవాదమే గణితంలో 'సున్న'కు ప్రతీక. గుర్తు. చిహ్నం .

ఎప్పుడైతే అంకెలకు స్థాన విలువలు వచ్చాయో – ఇక కూడికలు, తీసివేతలు, హెచ్చ వేతలు, భాగహారాలు (చతుర్విధ ప్రక్రియలు) వేగవంతం అయ్యాయి. వాటికి వాడే +, –, ×, ÷,= ఇలాంటి చిహ్నాల్ని కూడా తొలిగా ఆర్యభట్టే రూపొందించాడు. గణిత శాస్త్రానికి కానుకగా సమర్పించాడు.

ఇక ఆర్యభట్ట కృషి రేఖాగణితం, క్షేత్రమితుల్లో అద్భుతం. దీనికీ కారణం లేకపోలేదు. బౌద్ధులు ఆరామాలు, స్థూపాలు, చైత్యాలు నిర్మించడంలో మొదటి నుండీ శిల్ప శాస్త్రంలో ప్రావీణ్యతతోనే ఉన్నారు. ముఖ్యంగా వృత్తాకార రూపంలో ఉండే చైత్య నిర్మాణాలకు వృత్త వైశాల్యాలు, చుట్టు కొలతలు తెలుసుకోవడం చాలా అవసరం – బౌద్ధులకున్న ఈ నిర్మాణ ప్రక్రియే ఆర్యభట్టకు $\pi$ విలువను ఆవిష్కరించేలా చేసింది.

$\pi$ విలువను 22/7 అంటాం.

ఒక వృత్తంలో నాలుగు చదరాలు ఉంటాయి.

కానీ, వాటి వైశాల్యాలు లెక్కిస్తే వృత్త వైశాల్యం దానిలో అంతర్భాగంగా ఉన్న మూడు చదరాలకు దగ్గరగా, కొద్దిగా ఎక్కువగా ఉంటుంది. దాన్ని కూడా ఎంతో ఖచ్చితంగా తేల్చాడు ఆర్యభట్టు.

22/7 విలువ 3.1999...గా వస్తుంది.

కానీ...దాని ఖచ్చితమైన విలువ 3.1416గా (62832 / 20,000) తేల్చాడు. ఈనాటికీ ఇదే శిరోధార్యం.

ఇలా గణితంలో

1. స్థాన విలువలు 2. శూన్యస్థానం 3. చతుర్విధ ప్రక్రియలు 4. $\pi$ విలువ, 5. త్రికోణమితి 6. సైన్ పట్టికలు 7. అనిర్ధారక సమీకరణాలు 8. బీజగణితం –

ఇలా ఎన్నో నూతన గణిత ఆవిష్కరణలు చేశాడు ఆర్యభట్ట.

త్రికోణమితి వల్ల కోణాల్ని బట్టి దూరాల్ని, ఎత్తుల్ని (కొండ ఎత్తు) కొలవడం సాధ్యమైంది. ఈ సూత్రాల ఆధారంగానే నక్షత్రాల దూరాల్ని, గ్రహాల గమనాల్ని ఈనాటికీ లెక్కిస్తున్నారు.

అలాగే వర్గమూలాల్ని, ఘన మూలాల్నీ కనుగొనే సమీకరణాల్ని ఆర్యభట్టు చెప్పాడు.

4 యొక్క వర్గమూలం 2 . (2×2=4)

9 యొక్క వర్గమూలం 3 . (3×3=9)


16 యొక్క వర్గమూలం 4 . (4×4=16)

మరి, 2 వర్గమూలం ! ఎంత? అలాగే.. 3,4,7 ల వర్గమూలాలేవి? ఇవి అంత తేలిక కాదు. దీనికే సైన్ పట్టికలు అవసరం. అలాగే ఘన మూలాలకి కూడా వీటి పట్టికల్ని రూపొందించిన మొదటి వ్యక్తి ఆర్యభట్ట.

క్రీ.శ 628లో బ్రహ్మ గుప్తుడు , క్రీ.శ 629 లో 1వ భాస్కరుడు, క్రీ.శ 683లో సరిదత్తుడు, క్రీ.శ. 784లో లల్లుడు, క్రీ.శ 800 లో గోవింద స్వామి, 1114లో 2వ భాస్కరుడు,1178లో మల్లికార్జున సూరి, 1191 లో సోమేశ్వరుడు, క్రీశ 1380లో పరమేశ్వరుడు , క్రీ.శ 1417లో దామోదరుడు, 1474లో రామకృష్ణ ఆచార్య, 1480లో బాలాదిత్యుడు, 1500 లో నీలకంఠ, 1574లో భూధరుడు, 1597లో రఘునాథ రాజు, 1732లో సోమయాజి, 1756లో కృష్ణదాసు, 1800 లో విరూపాక్షుడు, 1807లో కోదండ రాముడు, 1823లో శంకరమ్మ, , – ఇలా ఎందరో ఆర్యభట్ట రచనల మీద భాష్యాలు రాశారు.

బౌద్ధుల లలిత విస్తరం, ఆర్యభటీయం గ్రంథాల్లోని గణిత పరిజ్ఞానాన్ని కొద్దిగా చర్చించుకొన్నాం.


**(వచ్చే సంచికలో బౌద్ధుల ఖగోళ పరిజ్ఞానాన్ని చూద్దాం)**


వల్లభనేని షణ్ముఖానంద రచన
నేటి సమాజానికి **బుద్ధుని ధర్మం**
వ్యాసాలు
168 పుటలు : రు. 180/–

ప్రతులకు
ఆర్ట్స్ అండ్ లెటర్స్, హైదరాబాద్ స్టడీ సర్కిల్,
ఇందిరా పార్క్ క్రాస్ రోడ్స్, హైదరాబాద్.
మరియు అన్ని ప్రముఖ పుస్తకముల షాపులలో లభించును
సెల్ : 9866699774

బి.వి.శివప్రసాద్ రచన
**రెక్కలు కావాలి**
కవితా సంపుటి




102 పుటలు : రు. 120/–
ప్రతులకు
బి.శివప్రసాద్, అసోసియేట్ ప్రొఫెసర్
4ఎఫ్.1, బోడపాటి మాన్సన్, జియాన్ స్కూలు ఎదుట
గుణదల, విజయవాడ 4
సెల్ : 98485 27109

భాషోద్యమ కథానిక

# మన కర్తవ్యం

వాణిశ్రీ
9390085292

ఏప్రిల్ పన్నెండో తేదీ నుంచి పిల్లలకు వేసవి సెలవలు ఇచ్చారు. సీతారామయ్య ఇంట్లో ఒకటే సందడి. ఆయనకి ముగ్గురు కొడుకులు. పెద్దకొడుకు హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. రెండోవాడు చెన్నైలో మెకానికల్ ఇంజనీర్. మూడో కొడుకు గుంటూరు లోనే డాక్టర్. సెలవలు రావడంతో తాతగారింటికి గుంటూరు వచ్చేస్తారు మనవళ్ళు, మనవరాళ్లు.

సీతారామయ్య డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్‌గా పనిచేసి రిటైరయ్యాడు. లెక్కల మాష్టారే అయినా తెలుగు బాగా చదువుకున్నాడు. తెలుగు సాహిత్యం అంటే మమకారం. లక్ష్మీపురంలో రెండతస్తుల మేడ కట్టాడు సర్వీసులో వుండగానే. ఇంటి చుట్టూ ప్రహరీ గోడ. మామిడి, సపోటా, నిమ్మవంటి చెట్లు పెంచాడు. అవి ఏపుగా పెరిగి చల్లటి నీడనిస్తున్నాయి. పిల్లలు ఆ చెట్ల నీడలో ఆడుకుంటూ తాతగారింట్లో సరదాగా గడుపుతారు ఎండాకాలం అంతా. శ్రీలక్ష్మి మనవళ్లకి రకరకాల తినుబండారాలు చేసి తినిపిస్తూ సంతోషంగా కాలం గడుపుతూ ఉంది.

సీతారామయ్యకి మాత్రం ఒకటే దిగులు. తన పుస్తకాల కోసం మేడమీద ప్రత్యేకంగా ఒక గది కేటాయించుకున్నాడు. నాలుగు చెక్క బీరువాల్లో తాను సేకరించిన కథలు, నవలలు, కవితల పుస్తకాలు వున్నాయి. తన తర్వాత ఈ పుస్తకాలు ఎవరు చదువుతారు? తనకు వారసుడు ఎవరు? అదే దిగులు అతని మనసుని పురుగులా తొలుస్తూ వుంటుంది.

ఇది స్నేహితులతో పంచుకుంటూ వుంటాడు అప్పుడప్పుడూ! తనంత పుస్తకాల సేకరణ కాకపోయినా అందరి ఇళ్ళల్లో కొద్దో గొప్పో పుస్తకాలు వున్నాయి. అభిరుచి కొలదీ అప్పుడప్పుడు కొత్త పుస్తకాలు కొంటూనే



"మనం ఒక పని చేద్దాం. వేమన పద్యాలు, సుమతీశతకం వంటివి చిన్న చిన్న పుస్తకాలను మన కాలనీలో ఇంటింటికి పంచుదాం. పదో తరగతిలోపు పిల్లలకు పద్యాలు చదవడంలో పోటీలు పెడదాం మన సీనియర్ సిటిజన్ భవన్‌లో.

పదిమందికి బాగా చదవగలిగిన వారికి తలా వెయ్యి రూపాయలు బహుమతి అని ప్రకటిద్దాం. తల్లిదండ్రులు గూడా తమ పిల్లలకు పద్యాలు చదవడంలో తర్ఫీదు ఇచ్చి పోటీకి పంపుతారు. పిల్లలూ తెలుగు పద్యాలు చదవడానికి ఉత్సాహ పడతారు. తెలుగు భాషను ప్రోత్సహించడానికి మనవంతు కృషి చేద్దాం"...చెప్పాడు పదవీ విరమణ చేసిన లక్ష్మీనారాయణ అనే తెలుగు మాష్టారు.

వుంటారు.

"ఏం చేస్తాం? మన పిల్లలు తెలుగు పుస్తకాలు అప్పుడప్పుడు చదువుతున్నారు. మన మనవళ్ళే ఇంగ్లీషు మీడియమ్ చదువుల వల్ల తెలుగు భాషకు దూరమవుతున్నారు. మన తర్వాత ఈ పుస్తకాలు ఏ గ్రంథాలయానికో ఇచ్చేయడమే! అంతకంటే చేసేదేం లేదు".

సీతారామయ్యతో మిత్రులు అదే చెప్తుంటారు.

ఇంట్లో పుస్తకాలు కనబడుతూ వుంటే, పిల్లలకు చదవాలనే అభిలాష కలుగుతుందని, సీతారామయ్య మనవళ్ళని పిలిచి బీరువాల్లో పుస్తకాలు సర్దమని పని చెప్తుంటాడు. వాళ్ళు పుస్తకాలు బైటకు తీసి గుడ్డతోతుడిచి చీమల మందు చల్లి, కలరా వుండలు పెట్టి బీరువాల్లో పెట్టేస్తుంటారు.

"కథల పుస్తకాలు వున్నాయిరా! చదువుకోండి. ఎండలో తిరగకండి". అంటాడు సీతారామయ్య.

బుద్ధిగా తలలు వూపుతారు. పేజీలు తిరగేసి పోతారు. తెలుగు వచ్చిన పిల్లలు గూడా చదవడం లేదు. అదే సీతారామయ్యకు అర్థం కావడం లేదు.

"ఒక్కడూ పుస్తకాలు చదవడం లేదు. టి.వీ. చూడ్డం, కంప్యూటర్‌లో గేమ్స్ ఆడుకోవడం తప్ప పుస్తకం చదవడం మీద ఒక్కడికీ శ్రద్ధలేదు". అని భార్య దగ్గర వాపోతుంటాడు.

"భలేవారు లెండి. తాతగారింటికి వచ్చింది. పుస్తకాలు చదవడానికా? సంవత్సరం పొడుగునా స్కూల్లో చేసేదేంటి? పాఠాలు చదవడమేగా? స్కూళ్ళల్లో ఎటూ ఆడ పాటలుండవు. సెలవుల్లోనైనా ఆడుకోనియ్యండి. పదో తరగతి దాటి ఇంటర్‌లోకి వస్తే ఈ మాత్రం ఆటలు గూడా వుండవు. అసలు సెలవుల్లో పిల్లల్ని పంపుతారా? కోచింగులకని పిల్లల్ని సతాయిస్తారు" అన్నది శ్రీలక్ష్మి.

'అదీ నిజమేలే! కెరీర్ పరుగులు తప్పవు'. అనుకున్నాడు.

ఆ రోజు బంగాళాఖాతంలో వాయుగుండం పడిందని వాతావరణం చల్లబడింది. రెండు గంటలు వాన పడింది. పిల్లలంతా మ్యాట్నీ సినిమాకు వెళ్తామన్నారు. సినిమా చూసి కాసేపు షికారుగా తిరిగి వస్తామన్నారు. శ్రీలక్ష్మి మధ్యాహ్నం తొందరగా భోజనం పెట్టింది. సీతారామయ్య అందరికీ డబ్బులు ఇచ్చాడు. ఎవరికి కావాల్సింది వాళ్ళని కొనుక్కోమన్నాడు.

రాత్రి ఏడింటికల్లా పిల్లలు ఇంటికి వచ్చారు. ఆడపిల్లలు బొట్టు బిళ్ళలు, మెహిందీ కోన్లు, గాజులు వగైరా కొనుక్కుని వచ్చి నాయనమ్మకు చూపించి మురిసిపోయారు.

టెర్రస్ మీద అటూ ఇటూ తిరుగుతున్న సీతారామయ్య దగ్గరకు "తాతా...తాతా...!" అంటూ వచ్చాడు రచిత్. వాడు సీతారామయ్య చిన్న కొడుకు కొడుకు.

అన్న ప్రాసననాడు పుస్తకం పట్టుకున్నాడని వాడికి 'రచిత్' అని పేరు పెట్టాడు సీతారామయ్య. మూడో కొడుకు డాక్టరు. గుంటూరులోనే కొత్తపేటలో వుంటాడు. అక్కడే హాస్పిటల్ వుంది. అప్పుడప్పుడు తండ్రి దగ్గరికి భార్య పిల్లలతో లక్ష్మీపురం వస్తుంటాడు. తాత దగ్గర వాడికి బాగా చనువు.

"ఏంట్రా ! రచిత్..." అన్నాడు సీతారామయ్య కుర్చీలో కూర్చుంటూ...

"తాతా! నేను కతల పుస్తకాలు కొనుక్కున్నా!" అంటూ చేతికి అందించాడు రచిత్.

అక్బర్ – బీర్బల్ కథలు, తెనాలి రామలింగడి చమత్కారం కథలు, సింద్‌బాద్ సాహసయాత్ర పుస్తకాలు అవి. సీతారామయ్యకి చాలా ఆనందం కలిగింది. వాడిని ఒళ్ళో కూర్చోబెట్టుకుని ముద్దులాడాడు. అదే సమయంలో ఆయనకి ఒక విషయం అర్థమైంది.

ఇంటి నిండా వుండే పుస్తకాలు తన అభిరుచికి అనుగుణంగా వున్నవి. పిల్లలు ఒక్కసారిగా అవి చదవలేరు. వారికి కావల్సింది పిల్లల కథల పుస్తకాలు. పిల్లల కథలు చదవడం ద్వారానే కొత్త పాఠకుడు తయారవుతాడు. కాబట్టి ఇంట్లో వుండాల్సింది బాల సాహిత్యం.

"నువ్వేరా! నా వారసుడివి...!" అని రచిత్‌ని హత్తుకున్నాడు సీతారామయ్య.

ఆ మర్నాడు సీనియర్ సిటిజన్ భవన్‌లో కలిసిన స్నేహితులకు 'తనకు మనవడు రచిత్' వారసుడనీ, వాడు పిల్లల కథల పుస్తకాలు కొని తెచ్చుకున్నాడని గొప్పగా చెప్పాడు.

"ఔనయ్యా! అన్న ప్రాసన నాడే ఆవకాయ తింటారా ఎవరైనా? అందుకని చిన్నతనంలో పెద్దల కథలు, కావ్యాలు, నవలలు చదువుతారా ఎవరైనా? ముందు బాల సాహిత్యంతో చదవడం మొదలు పెట్టి, ఆ తర్వాతే అభిరుచిని పెంచుకుని కథలు, కవితలు, నవలలు చదవగలుగుతారు" అన్నాడు ఒక మిత్రుడు.

అతనితో అంతా ఏకీభవించారు.

"మనం ఒక పని చేద్దాం. వేమన పద్యాలు, సుమతీశతకం వంటివి చిన్న చిన్న పుస్తకాలను మన కాలనీలో ఇంటింటికి పంచుదాం. పదో తరగతిలోపు పిల్లలకు పద్యాలు చదవడంలో పోటీలు పెడదాం మన సీనియర్ సిటిజన్ భవన్‌లో.

పదిమందికి బాగా చదవగలిగిన వారికి తలా వెయ్యి రూపాయలు బహుమతి అని ప్రకటిద్దాం. తల్లిదండ్రులు గూడా తమ పిల్లలకు పద్యాలు చదవడంలో తర్ఫీదు ఇచ్చి పోటీకి పంపుతారు. పిల్లలూ తెలుగు పద్యాలు చదవడానికి వుత్సాహ పడతారు. తెలుగు భాషను ప్రోత్సహించడానికి మనవంతు కృషి చేద్దాం"...చెప్పాడు పదవీ విరమణ చేసిన లక్ష్మీనారాయణ అనే తెలుగు మాష్టారు.

అందరూ చప్పట్లు కొట్టి అతన్ని అభినందించారు. ఆ విధంగా కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించారు.

**శిశువు శారీరక వికాసానికి తల్లిపాలు మానసిక వికాసానికి తల్లి భాష**

**తెలుగులో పరిపాలించనప్పుడు మనవి తెలుగు రాష్ట్రాలెలా అవుతాయి?**

# వాడని భాష వాడిపోతుంది
# మాతృభాషను విస్మరించినందునే మానసిక రుగ్మతలు
## తెలుగు భాషోద్యమ సమాఖ్య జాతీయ అధ్యక్షుడు డాక్టర్ సామల రమేష్‌బాబు







'అమ్మనుడి' ప్రతినిధి చెన్నై : వాడని భాష వాడిపోతుంది. తెలుగు భాషను వాడుకుందాం. వాడిపోకుండా కాపాడుకుందామని తెలుగు భాషోద్యమ సమాఖ్య జాతీయ అధ్యక్షుడు, 'అమ్మనుడి' పత్రిక సంపాదకులు డా॥సామల రమేష్‌బాబు అన్నారు.

'మాతృభాషను కాపాడుకుందాం' అనే నినాదంతో సమైక్య భారతి (సామాజిక – సాంస్కృతిక చైతన్య సంస్థ) విశాఖపట్టణం వారు శనివారం చెన్నైలోని మద్రాసు రిపోర్టర్స్ గిల్డ్ హాలులో ప్రముఖులతో సభను నిర్వహించారు. ఈ సభలో రమేష్‌బాబు మాట్లాడుతూ... 'ఒక భాషలో మాట్లాడేవారిని ఒక జాతి అంటారు. అయితే తెలుగువారు ఎందుకో సొంత భాషలో మాట్లాడేందుకు సిగ్గుపడుతుంటారు. తెలుగువారిలో నైతిక నాయకత్వం లోపించింది. అయితే తెలుగువారిలో ఒక సుగుణం కూడా ఉంది. అదేమిటంటే పరాయి భాషల వారితో సులువుగా కలిసిపోతాం. తమిళనాడులో 42 శాతం మంది తెలుగువారున్నారు. వీరిలో అధికశాతం మంది ఉమ్మడి మద్రాసు రాష్ట్రంగా ఉన్నపుడే ఇక్కడే పుట్టి పెరిగినవారు. ప్రవాసాంధ్రులు చాలా తక్కువ. అన్ని రంగాల్లో ముందున్నా భాషా పరిరక్షణలో బాగా వెనుకబడి ఉన్నాం. ఈ లోపాన్ని అధిగమించాలి. తెలుగువారిగా చెప్పుకునే వారంతా తెలుగు రాయడం, చదవడం నేర్చుకోవాలి. ప్రాథమిక విద్యలో తప్పనిసరిగా తెలుగుభాష ఉండాలి. మాతృభాషను విస్మరించినందువల్లనే విద్యార్థుల్లో మానసిక రుగ్మతలు, ఆత్మహత్యలు. మాతృభాషను విస్మరిస్తే సాహిత్యం, ప్రాచీనభాష విజ్ఞానం అంతరించిపోతుంది. మొత్తం చదువు మాతృభాషలో ఉంటే అన్ని రంగాల్లో అందరికంటే మనమే ముందుంటాం. మెజార్టీ సంఖ్యకు చెందని మైనార్టీ భాషల వారికి ప్రాథమిక విద్యను వారి అమ్మనుడిలోనే నేర్పాలని రాజ్యాంగం స్పష్టం చేసింది. అలా జరుగకుంటే భారత రాజ్యాంగం 350 ఏ అధికరణం ప్రకారం ఏ రాష్ట్రంలోనైనా మాతృభాషలో బోధనను భారత రాష్ట్రపతి దృష్టికి తీసుకెళ్లి సాధించుకునే హక్కును మైనార్టీ భాషలవారు కలిగి ఉన్నారు' అని తెలిపారు.

ఆర్థికంగా కూడా ఉపయోగాలు : విశిష్ట అతిథి, కైండ్‌నెస్ సొసైటీ అధ్యక్షుడు (తాడేపల్లిగూడెం) గట్టిం మాణిక్యాలరావు మాట్లాడుతూ, తెలుగుభాషను కాపాడుకోవడం వల్ల సామాజికంగానే కాదు, ఆర్థికంగా కూడా ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని అన్నారు. గల్ఫ్ దేశాల్లోని తెలుగువారి రక్షణ కోసం దుబాయ్ కువైట్‌లకు వెళ్లినపుడు అక్కడి తెలుగువారి సంఖ్య, ఉత్సాహం చూసి ఆశ్చర్యపోయానని అన్నారు. స్థానికేతరులుగా ఇబ్బందుల్లో చిక్కుకున్న వెయ్యిమంది తెలుగువారికి భారత ప్రభుత్వం సహాయంతో రక్షణ కల్పించామని చెప్పారు. సభాధ్యక్షులు, సమైక్య భారతి తెలంగాణ రాష్ట్ర గౌరవాధ్యక్షులు యం. రామరాజు ప్రసంగిస్తూ, తల్లిని ఎలా గౌరవిస్తామో, మాతృభాషకు సైతం అంతటి గౌరవాన్ని ఇవ్వాల్సి ఉందని చెప్పారు. తల్లి లేనిదే నీవు లేవు. మాతృభాష లేనిదే నీకు మనుగడ, గుర్తింపు లేదని అమరజీవి పొట్టి శ్రీరాములు ఆత్మత్యాగంతో ఆంధ్రరాష్ట్రంగా ఏర్పడిన తరువాత తెలుగుభాషకు గౌరవం పెరిగింది. తెలుగుభాషను రక్షించుకోవడం మనందరి బాధ్యతని గుర్తు చేశారు. ఏఐటిఎఫ్ అధ్యక్షుడు డాక్టర్ సీఎంకే రెడ్డి మాట్లాడుతూ, ఇతర రాష్ట్రాలతోపాటు తమిళనాడులో సైతం విద్యాసంస్థల్లో మూడు భాషల విధానం ప్రవేశపెట్టాలని, ప్రకాశం జిల్లాలా, అమరజీవి పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాను సులువుగా పిలుచుకునేలా శ్రీరాములు జిల్లాగా సవరించాలని, చెన్నైలోని అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారకభవనంపై ఏపీ ప్రభుత్వం శ్రద్ధ చూపాలని కోరారు. భారత్‌లో అనేక రాష్ట్రాలు విడిపోయినా మహాత్మాగాంధీని ఎలా మరువలేదో, తెలుగు రాష్ట్రాలు విడిపోయినా పొట్టి శ్రీరాములు త్యాగాన్ని విస్మరించరాదని కోరారు. తెలుగుకు ప్రాచీన హోదా లభించడం సంతోషమే. అయితే దీనివల్ల రాష్ట్రేతర తెలుగువారికి వచ్చిన ప్రయోజనాలు ఏమిటో ఏపీ ప్రభుత్వం తెలియజేయాలని కోరారు. ఆంధ్రాక్లబ్ సంయుక్త కార్యదర్శి జె.కె. రెడ్డి ప్రసంగిస్తూ, తెలుగువారు మాతృభాషను విస్మరించడం ఇంగ్లీషుపై మోజా మరేదైనా కారణమా అని అన్నారు. ఇంగ్లీషు, తదితర భాషలు నేర్చుకోవడంలో తప్పులేదని, మాతృభాషపై మక్కువ చూపకపోవడం క్షమించరాని నేరమని చెప్పారు. తమ హయాంలో పదో తరగతి వరకు మూడోభాషగా నిర్బంధ హిందీ ఉన్నట్లు ఏపీలో తెలుగుభాషను చేయాలని

# మాతృభాష వినియోగాన్ని కోల్పోతే ఉపాధి, ఉద్యోగ అవకాశాలకు ముప్పు

## ప్రముఖ భాషా పరిశోధకులు ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు హెచ్చరిక

## కరీంనగర్ తెలుగుభాషా సదస్సు




కరీంనగర్, ఏప్రిల్, 18 : ఉభయ తెలుగు రాష్ట్రాలలో మాతృభాషకు నిరాదరణ పెరిగి పోయి, ఆంగ్లానికి పెద్దపీట వేస్తున్నారని, పాలకులు దీనికి వత్తాసు పలుకుతున్నారని, ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే, తెలుగు రాష్ట్రాలలో ఇప్పుడున్న ఉద్యోగాలకు, ఉపాధులకు పెద్ద ముప్పు వస్తుందని ప్రముఖ భాషా శాస్త్రవేత్త, తెలుగు భాషా పరిశోధకులైన హైదరాబాద్ కేంద్రీయ విశ్వ విద్యాలయం ఆచార్యులు గారపాటి ఉమామహేశ్వర రావు అన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాలలో సైతం మాతృభాషలకు విఘాతం కలిగి, ఉపాధులు కోల్పోతారని ఆయన అన్నారు. భాషా ప్రాతిపదికన ఏర్పాటైన మన తెలుగు రాష్ట్రాలలో మన మాతృభాషలో పరిపాలించుకొనే సత్తాను కోల్పోతున్నామని ఆయన ఆవేదనను వ్యక్తం చేసారు. ఈ రెండు రాష్ట్రాలలో ఆంగ్లభాష అధికారాన్ని చలాయిస్తోందని అన్నారు. మన మాతృభాషైన తెలుగును నిరుపయోగం చేయడానికి, ఆవిధంగా ప్రజలను శక్తి హీనులను చేయడానికి జరుగుతున్న కుట్రను తెలుగు ప్రజలు గ్రహించాలని ఆయన అన్నారు. లేకుంటే ఈ భాషాసంక్షోభానికి మనం బలైపోతామని ఆయన హెచ్చరించారు. మాతృభాషను బలి చేసే కుట్రలో, ప్రపంచీకరణ మార్కెట్ శక్తులు, ప్రయివేటు వ్యక్తుల భాగస్వామ్యము ఉందని, మాతృభాషలో చదివితే ఉద్యోగాలు రావన్న దుష్ప్రచారము సరికాదని ఆయన అన్నారు. ఎంత మందికి ఉద్యోగాలు ఇంగ్లీష్ లో చదివితే వస్తున్నాయని ఆయన ప్రశ్నించారు. ప్రశ్నించేతనాన్ని కోల్పోరాదని ఆయన అన్నారు. ఈ ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రశ్నించే హక్కు మనదని ఆయన గుర్తు చేసారు. కరీంనగర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఆడిటోరియం లో ఏప్రిల్ 17న "అన్ని రంగాలలో తెలుగు వినియోగం అనే అంశంపై, ఒక్కరోజు జరిగిన సదస్సులో ఆయన ముఖ్యఅతిథి ప్రసంగం చేశారు. రెండు తెలుగు రాష్ట్రాలలో అక్షరాస్యతాశాతం కేవలం 65 శాతమేనని, 70 ఏళ్ళ స్వాతంత్రం తరువాత ఇంత తక్కువగా అక్షరాస్యతాశాతం ఉండటం సిగ్గుచేటయిన విషయమని అన్నారు. తైవాన్, జాపాన్, కొరియా, చైనా వంటి దేశాలలో అక్షరాస్యతతో బాటు, స్థానీయ మాతృభాషల పరిస్థితి, తద్వారా ఆర్థిక పరిస్థితులు బాగున్నాయని అన్నారు. భారతీయ మాతృభాషల్లో అనేక మేలి రచనలు, కావ్యాలు వచ్చాయి, మన దేశంలోని మాతృభాషలు గత ముప్పయి ఏండ్లనుంచి గడ్డు పరిస్థితులను ఎదుర్కొం టున్నాయని ఆయన అన్నారు. ఇప్పుడు మనము మోజు చూపిస్తున్న ఆంగ్ల భాషలో గ్రీకు లాటిన్ భాషల పదాలు ఎన్నో కలిసాయని, వాక్యరచన, పదనిర్మాణము చేయగలిగే సామర్థ్యమున్న ఆంగ్లపండితులు మన దేశంలో అంతగా లేరని, వీరు ఆంగ్లంలో పుస్తకాలు రాసే స్థాయి, సృజన తక్కువగా ఉందని, మనము విదేశాలనుండే కోట్లాది రూపాయల ఆంగ్ల పుస్తకాలని ఎక్కువ ధరలకు పెట్టి కొనుక్కొని చదివే పరిస్థితి వుందని, దీనివల్ల మాతృభాషలో వచ్చే పుస్తకాలు, సృజనాత్మకత తగ్గిపోయే, ప్రమాదం ఉందని ఆయన అన్నారు. దేశీయ పుస్తకాల ముద్రణారంగంలో సంక్షోభం ఏర్పడి, దేశీయ పుస్తకాల విక్రయాలు తగ్గిపోతాయి, దీనిపై ఆధారపడి బతుకుతున్న లక్షలాదిమంది ఉద్యోగాలు కోల్పోతారని, దేశీయ సినీపరిశ్రమ కూడా దెబ్బతింటుందని, దిగుమతైన ఆంగ్ల సినిమాలని చూసే పరిస్తితి వస్తుందని ఆయన అన్నారు. ముఖ్యంగా హిందీ, తెలుగు చిత్రపరిశ్రమ కునారిల్లి పోతుందని అన్నారు. ప్రపంచంలో 20 వేల భాషలు ఉండగా, ప్రపంచీకరణ, ఇతర ప్రభావాల వల్ల ప్రస్తుతం 6 వేల భాషలు మిగిలి పోయాయని, ఇవి కూడా కదు దుర్భర పరిస్తితులను ఎదురుకొంటు

---

సూచించారు. అమరజీవి ఆశయాలు, చేసిన త్యాగాలను గండి కొట్టవద్దని ఏపీ ప్రభుత్వాన్ని ఆయన కోరారు. గంగిగోవుపాలు గరిటడైనను చాలా అన్నట్లు సభకు జనం హాజరయ్యారని అన్నారు. అనంతరం తనదైన శైలిలో తెలుగుభాష మాదుర్యాన్ని, ప్రాముఖ్యతను చాటే మూడు పద్యాలను శ్రావ్యంగా ఆలపించారు. అమరజీవి ఆత్మత్యాగం చేసిన చెన్నైలోనే తొలి సభ నిర్వహించాలనే సంకల్పం నెరవేరిందని సమైక్యభారతి జాతీయ కన్వీనర్ పి.కన్నయ్య చెప్పారు. ఈ సందర్భంగా అరుణా శ్రీనాథ్, కుమారి ప్రహల్య పలు గీతాలాపనలతో కార్యక్రమం సంగీతమయంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో సమైక్యభారతి రాష్ట్ర సహాయ కార్యదర్శి ఆనంద్, కో – ఆర్డినేటర్ కేవీరత్నాలు, టామ్సుఅధ్యక్షుడు ఇజ్రయేల్, తెలుగుప్రముఖులు పాల్గొన్నారు.



మైలాపూర్‌లోని అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక భవనంలో శిలా విగ్రహానికి పూలమాల సమర్పిస్తున్న సమైక్యభారతి ప్రతినిధులు పి. కన్నయ్య ప్రభృతులు.

న్నాయని అన్నారు. ఈ మాతృభాషా సంక్షోభాన్ని ఎదురుకోవడానికి యువత, మేధావులు, భాషాభిమానులు నడుంకట్టి, సమైక్యంగా ఉద్య మించడానికి ముందుకు రావాలని ఆయన పిలుపు నిచ్చారు. భారత దేశంలో 5 వేల గ్రంధాలయాలు ఉన్నాయని, వేయి వరకు విశ్వ విద్యాలయాలు ఉన్నాయని, పుస్తకాల కొనుగోలు బడ్జెట్‌లో కోట్లాది రూపాయలు వెచ్చించి, ఆంగ్ల పుస్తకాల్ని కొనుక్కోవడానికి సరిపోతుందని, ఆయన భాషా సంక్షోభ పరిస్తితులను చక్కగా కండ్లకు కట్టినట్లుగా వివరించారు. మనము ఆంగ్లభాషకు వ్యతిరేకం కాదని అన్నారు. వ్యాపార భాషగా ఆంగ్లాన్ని నేర్చుకోవాలని, భాషావైవిధ్యత ఉండాలని, మాతృభాషలని అభిమానంతో బ్రతికించుకోవాలని, అంతగా అవసరమనిపిస్తే, విదేశాలలో ఉండే ప్రొఫెసర్లు ఇక్కడికి పిలిపించుకొని పాఠాలు చెప్పించుకోవాలని, అనువాదాలు దేశీయభాషలలో పెరిగితే, ఆంగ్ల భాషా వ్యామోహం నుండి మనం బయట పడుతామని, ఈ విషయాన్ని పాలకులు, ప్రజలు గ్రహించుకోవాలని, మన దేశంలో భాషా సంస్కృతి, దేశ సంస్కృతితో ముడి పడి ఉందన్న నగ్న సత్యాన్ని మరువరాదని అన్నారు. మాతృభాష ఎంతో గొప్పదని ఆయన నొక్కి చెప్పారు. ఇక్కడున్నవారికి 98 శాతం మందికి ఆంగ్లము రాదని, భాష నేర్చుకోవడానికి ఒక వాతావరణము ఉండాలని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పష్టమైన మాతృభాషా పరిరక్షణ, విధానాన్ని ప్రకటించాలని ఆయన కోరారు. మాతృభాషలని కాపాడు కోవాలన్న దృక్పథాన్ని మరువ రాదని అన్నారు. దేశంలో ఏటా 18 లక్షల మంది ఇంజనీరింగ్ పట్టభద్ర విద్యార్థులు ఆంగ్ల మాధ్యమంలో చదివి వస్తున్నారని, ఇప్పుడు ఇంజనీరింగ్ కాలెజీలను విద్యార్తులు లేక, మూసి వేస్తున్నారని, నిరుద్యోగం ప్రబలి పోయిందని, వీరందరికీ ఉద్యోగాలు ఎక్కడ దొరుకుతున్నాయని ఆయన ప్రశ్నించారు. కంప్యూటర్ విని యోగంలో అనేక మార్పులు వచ్చాయని, యునికోడ్ లాంటి తెలుగు కతులు (ఫాంటులు) అందుబాటు లోనికి వచ్చాయని అన్నారు. నేటి యువత, విద్యార్థులు చేసుకుంటున్న ఆత్మహత్యలకు, మాతృభాషలో విద్యా బోధన లేకపోవడమే ప్రధాన కారణమని అన్నారు. సృజనాత్మక శక్తి ఒక్క మాతృభాషలోనే సాధ్యమని అన్నారు. మాతృభాషలో చదివితే దేశీయ సంస్కృతి, కుటుంబ ప్రేమానురాగాలు ఇనుమడిస్తాయని అన్నారు. మమ్మీ అంటే ఈజిప్ట్ భాషలో శవమని అర్థముందని అన్నారు. అమ్మ అన్న పిలుపులో ఎంతో మాధుర్యత, మన తెలుగు సంస్క్రతి దాగి వుందని అన్నారు. ప్రపంచీకరణ వల్ల మనము నిర్మాతలు గా మారాలని, కాని, వినియోగదారులుగా మిగిలి పోతున్నామని, ఈ విధానాన్ని మార్చా లని అన్నారు. మరో ముఖ్య అతిథి 'అమ్మనుడి' సంపాదకులు, తెలుగు భాషోద్యమ సమాఖ్య అధ్యక్షులు డా. సామల రమేష్‌బాబు అనారోగ్య కారణాల వల్ల ఈ సదస్సుకు హాజరు కాలేకపోయారు.

మరో ముఖ్య అతిథిగా పాల్గొన్న తెలుగు అంతర్జాల నిపుణులు షేక్ రహమానుద్దీన్ మాట్లాడుతూ, తెలుగు సాఫ్ట్వేరులో ఎన్నో పరిశోధనలు జరుగుతున్నాయని , మాత్రుభాష లిపి తోనే, వినియోగ వస్తువులు ప్రింట్ అయి రావాలని, ప్రజలు కోరితే, అలా వస్తాయని, దాని వల్ల ఉద్యోగాలు పెరుగుతాయని, ఆంగ్లమే చదువాలన్న నిబంధనలు ఎక్కడ ఉన్నాయని అన్నారు. లాపుటాపు ద్వారా ఆయన తెలుగు కతులను, వాడే ఉపకరణాలను వివరించారు. అనువాదాలను యునికోడ్ ఫాంట్ లు చేస్తున్నాయని, మరో పది ఏండ్ల లో తెలుగు సాఫ్టువేర్‌లో గుణాత్మకమైన మార్పులను చూడగలుగుతారని అన్నారు. వికిపీడియాలో తెలుగు విభాగం లో 47 వేల వ్యాసాలున్నాయని అన్నారు. తెలుగు బ్లాగులలో ఎంతో సమాచారం తెలుగులోనే పెట్టు కోవచ్చునని అన్నారు. మన కంపూటర్ అనువాదాలను, వినే శక్తిని కలిగి ఉండే పరిస్థితికి వచ్చిందని, త్వరలోనే ఎన్నో మార్పులు వస్తాయని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో 18 తెలుగు కతులున్నాయని, మరో ఆరు కతులను తెలంగాణా ప్రభుత్వము వారు విడుదల చేయనున్నారని అన్నారు. తెలుగు బ్లాగులు మూడు వేలున్నాయని అన్నారు. ఇంగ్లిష్ భాషకి నాలుగైదు వందల సంవత్సరాల చరిత్రే ఉందని, మరి తెలుగుకు రెండువేల కంటె ఎక్కువ సంవత్సరాల చరిత్ర ఉందని అన్నారు. అనువాదాలను కంప్యూటర్ చేయగలిగే శక్తి వస్తోందని అన్నారు. తెలుగుభాషకి కంప్యూటర్ వినియోగం వల్ల అంతర్జాతీయ స్థాయి వచ్చినట్లవుతుందని అన్నారు. మన దేశంలోని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆంగ్ల వ్యామోహం విడనాడాలని, వ్యవహారాలన్నీ తెలుగు భాషలో చేసినపుడే, మన తెలుగుభాష బతుకుతుందని అన్నారు. సదస్సుకు అధ్యక్షత వహించిన కళాశాల తెలుగు శాఖాధ్యక్షులు డా.ఇమ్మడోలు భద్రయ్య మాట్లాడుతూ తెలుగుభాష పట్ల ఉన్న చిన్న చూపును విడనాడాలని అన్నారు. తెలుగులో ఉన్న పదాల సౌందర్యం మరే భాషలో లేదని అన్నారు. ఆత్మీయ అతిథులుగా వచ్చిన సాహితీవేత్త దాస్యం సేనాధిపతి మాట్లాడుతూ తెలుగు భాషా వినియోగం ఇంటి నుండే మొదలు కావాలని,, పదవ తరగతి వరకు తెలుగును తెలంగాణా ప్రభుత్వం నిర్బంధము చేయడము సంతోషంగా ఉందని, అన్నారు. తెలంగాణా ప్రభుత్వ కృషిని ఆయన అభినందించారు. కేంద్ర సాహిత్య అకాడమి ఆవార్డు గ్రహీత డా. నలిమెల భాస్కర్ మాట్లాడుతూ మాతృభాష దేవాలయం వంటిదని, అందులో ఆత్మ ప్రతిబింబిస్తూ ఉంటుందని అన్నారు. తల్లి భాషను కాపాడుకోవాలని, తెలుగు అంతరించి పోకుండా చూడాలని, 30 శాతం భాషా వినియోగం లేకపోతే ఆభాష అంతరించి పోతుందని, తెలుగు భాషను కాపాడు కోవాలని, పాలకులు మారాలని అన్నారు. తెలుగు పద్యాలు వల్లె వేయాలని, తెలుగుభాషకు ఉన్న చమత్కారము, వ్యంగ్యము మన సొంతమని అన్నారు. సాహితివేత్త డా. గంద్ర లక్ష్మణరావు మాట్లాడుతూ, మన తెలుగు వినియోగం పెరుగాలని , ఇటీవల జరిగిన ప్రపంచ తెలుగు మహాసభలు తెలంగాణా ప్రభుత్వానికి ఎంతో పేరు, ప్రతిష్టలను తెచ్చాయని అన్నారు. తెలుగు భాషోద్యమ సమాఖ్య ఆధ్వర్యములో ఈ సదస్సు నిర్వహింపబడింది. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ గాదె శంకర్ సదస్సును ప్రారంభించారు. వరంగల్ శ్రీలేఖ సాహితి అధ్యక్షుడు డా. టి.రంగస్వామి మాట్లాడుతూ తెలుగులో ఉన్నన్ని పర్యాయపదాలు మరే భాషలో లేవని అన్నారు. సమాఖ్య తెలంగాణా ప్రతినిధి సంకేపల్లి నాగేంద్రశర్మ సదస్సు ఆవశ్యకతను వివరించారు. తెలంగాణలో తెలుగు భాషోద్యమం వెల్లువలా రావాలని ఆకాంక్షించారు. ప్రముఖ సాహితీవేత్త సబ్బని లక్ష్మినారాయణ, కళాశాల తెలుగు ఉపన్యాసకురాలు డా. మారడి శ్యామల మాట్లాడారు. ఈ సదస్సులో సాహితీవేత్తలు తెర వేదిక ప్రధాన కార్యదర్శి గాజోజు నాగభూషణం, శాతవాహన తెలుగు శాఖ అధ్యాపకులు డా.కె.ముత్యం. ,కూకట్ల తిరుపతి, తంగేడ నవనీతరావు, నడిమెట్ల రామయ్య, సంపత్ కుమార్, జనార్ధనరావు తదితరులు పాల్గొన్నారు. వందమంది విద్యార్థినులు ఈ సదస్సులో పాల్గొని స్ఫూర్తి పొందారు.

(ఫోటోలు: మూడవ అట్టపై కూడా చూడండి)

- సంకేపల్లి నాగేంద్రశర్మ, కరీంనగర్
9441797650

చలసాని నరేంద్ర
9849569050

# టాలీవుడ్‌లో సంచలనం కలిగిస్తున్న 'క్యాస్టింగ్ కౌచ్'

హాలీవుడ్‌లో మొదలైన 'క్యాస్టింగ్ కౌచ్' నిర్మూలన ప్రక్రియ బాలీవుడ్‌లో కొన్ని రోజులు ప్రకంపనలు సృష్టించింది. ఆ తర్వాత టాలీవుడ్‌కి పాకింది. ప్రస్తుతం కాస్టింగ్ కౌచ్‌పై అనేక మంది లేడి ఆర్టిస్టులు భిన్న స్వరాలు వినిపిస్తుండగా, దానిని అరికట్టేందుకు ఇటీవల 'మా' జాయింట్ యాక్షన్ కమిటీని కూడా ఏర్పాటు చేసింది. పవన్ కళ్యాణ్ కూడా త్వరలోనే "తెలుగు చిత్ర పరిశ్రమ ఆడపడుచుల ఆత్మగౌరవ పోరాట సమితి" ఏర్పాటుకి రంగం సిద్ధం చేస్తున్నట్టు తెలిపారు. వీరికి జనసేన "వీరమహిళా"విభాగం అండగా ఉంటుందని కూడా పేర్కొన్నారు.

నేడు దేశ వ్యాప్తంగా లైంగిక వేధింపుల సమస్య పెను దుమారం రేపుతుండగా, పలు కఠిన చట్టాలు వస్తున్నప్పటికీ బాలికలపై అత్యాచారాలు సర్వసాధారణంగా మారుతూ ఉండగా, యువతను రెచ్చగొట్టుతుండే గ్లామర్ ప్రపంచంలో సహజంగానే 'క్యాస్టింగ్ కౌచ్' సమస్య శృతిమించి కలవరం కలిగిస్తున్నది. కొద్ది కాలంగా పలు సినీ తారలు ఈ జాడ్యం గురించి అక్కడక్కడా నిరసన స్వరాలు వినిపిస్తున్న మొత్తం మీద సినీ ప్రముఖులు గప్ చిప్ అన్నట్లు నోరు విప్పక పోతూ ఉండడం, కనీసం చర్చించడానికి సిద్ధపడకపోతూ ఉండడంతో ప్రభుత్వ వర్గాలు సహితం తమకు పట్టనట్లు వ్యవహరిస్తున్నాయి.

గత సంవత్సరం హాలీవుడ్‌లో ప్రముఖ నిర్మాత హార్వే వెయిన్ స్టెయిన్ పై ఇటువంటి ఆరోపణలు రాయడంతో మొత్తం పరిశ్రమ కలవరానికి గురయింది. మలయాళ చిత్ర పరిశ్రమలో మహిళా తారలు కలసి ఒక సంఘంగా ఏర్పడి తమకు రక్షణ కల్పించాలని, అందుకు అనువైన నియమ నిబంధనలను ఏర్పరచాలని డిమాండ్ చేసారు. కానీ ఇప్పుడు టాలీవుడ్‌లో ప్రముఖ తారలు ఎవ్వరూ ముందుకు రావడం లేదు. కేవలం క్యారెక్టర్ తారలు, జూనియర్ ఆర్టిస్టులు మాత్రమే బైటపడి ఆరోపణలు చేస్తున్నారు.

కేవలం నలుగురు అగ్ర నటుల కుటుంబాలు, కొద్దిమంది నిర్మాతల ఆధిపత్యంలో టాలీవుడ్ బందీ కావడంతో ఈ సమస్యపై స్పందించడానికి సహితం ప్రముఖులు వెనకడుగు వేస్తున్నారు. తమ కుటుంబ సభ్యులే దోషులుగా మారవలసి వస్తుందన్నట్లు వ్యవహరిస్తున్నారు. ఏప్రిల్ 6 ఉదయం శ్రీరెడ్డి అర్ధనగ్నంగా 'మా' కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన చేయడంతో ఈ సమస్య తీవ్ర సంచలనం కలిగించింది. ఈ విషయమై పెద్ద ఎత్తున దుమారం చెలరేగి, చర్చ పక్కదారి కూడా పడుతున్నది.

ప్రపంచ వ్యాప్తంగా సినీపరిశ్రమలో అవకాశాలకోసం ఎదురు చూసే మహిళలను 'క్యాస్టింగ్ కౌచ్' పేరిట లైంగికంగా వేధిస్తున్నారంటూ ఆరోపణలు వస్తూనే ఉన్నాయి. అక్కడక్కడా ఆందోళనలు సహితం వెల్లువెత్తుతుండటం జరుగుతూనే ఉంది. టాలీవుడ్‌లో సహితం కొందరు అప్పుడప్పుడు ఈ సమస్యను లేవనెత్తినా ఇంత తీవ్రరూపం దాల్చడం ఇదే ప్రథమం కావడం గమనార్హం. దానితో ఈ వ్యవహారంపై పోరాటాలు రోజుకో మలుపు తిరుగుతూ పలు చర్చలకు దారితీస్తున్నాయి.

శ్రీరెడ్డి నిరసన వ్యక్తం చేసిన విధానం అసంబద్ధంగా ఉన్నప్పటికీ, ఆమె లేవనెత్తిన సమస్య తీవ్రత మాత్రం కాదనలేనిది. అయితే ఆమె 'తెగింపు'ను తప్పుపట్టే వారే గాని పరిశ్రమలో నెలకొన్న ఈ జాడ్యాన్ని అరికడతామని, తారలను తామెప్పుడూ లైంగిక వేధింపులకు గురి చేయబోమని అగ్రనటులు, నిర్మాతలు, దర్శకులు ఎవ్వరూ బహిరంగంగా చెప్పలేని నిస్సహాయ స్థితిలో ఉండటం గమనార్హం. ఎవ్వరికీ వారు గుమ్మడికాయ దొంగవలే మౌనం వహిస్తున్నారు.

పైగా, శ్రీరెడ్డి లేవనెత్తిన సమస్యను తగు రీతిలో చర్చించి, ఒక పరిష్కారం కోసం ప్రయత్నం చేయవలసిన మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (మా) ఆమె నిరసనతో ఖంగారు పడిపోయి, ఏకపక్షంగా ఆమెతో ఎవ్వరూ నటించరాదంటూ ఆంక్షలు విధించడం ద్వారా ఆమెను కట్టడి చేసినట్లే అనుకున్నారు. అయితే ఆమె మరింత పట్టుదల చూపడం, అనూహ్యంగా ఆమెకు మీడియాలో కొన్ని వర్గాలు, జూనియర్ ఆర్టిస్టులు, క్యారెక్టర్ ఆర్టిస్టులు కొందరు మద్దతు పలికేవిధంగా తమ దారుణమైన అనుభవాలతో ముందుకు రావడంతో చిత్ర పరిశ్రమ పెద్దల పెద్దరికం నవ్వులపాలయింది

ఇంతలో ఈ సమస్యను జాతీయ మానవ హక్కుల కమీషన్ సుమోటోగా విచారణకు చేపట్టడం, సర్వత్రా 'మా' చర్యపై ఆగ్రహాలు వ్యక్తం అవుతూ రావడంతో ఆమెపై పెట్టిన ఆంక్షలను గత్యంతరం లేక 'ఏకపక్షంగా' ఉపసంహరించుకోవలసి వచ్చింది. ఇటువంటి ఆరోపణలపై ఒక కమిటీ వేస్తున్నట్లు కూడా ప్రకటించారు. తెలంగాణ సినిమాటోగ్రఫీ మంత్రి తలసాని శ్రీనివాసరావుతో సహితం సమావేశమై ఈ విషయమై తీసుకోవలసిన చర్యల గురించి చర్చించారు.

లైంగిక వేధింపులు అన్నవి కేవలం సినిమా పరిశ్రమకే పరిమితం కాలేదు. అన్ని రంగాలలో దారుణంగా కొనసాగుతున్నది. 2000 పాటలకు నాట్య దర్శకుడిగా పని చేసిన 69ఏళ్ళ సరోజ్ ఖాన్ దీనిపై స్పందిస్తూ ప్రభుత్వ శాఖల్లో కూడా వేధింపుల ఉదంతాలు ఉన్నాయి కదా అని గుర్తుచేశారు. అసలు అమ్మాయిలు అమ్ముడుపోవాల్సిన అవసరమేముందని ఆమె ప్రశ్నించారు, టాలెంట్ ఉంటే ఆఫర్స్ అవే వెతుక్కుంటూ వస్తాయిగదా అన్నారు.

క్యాస్టింగ్ కౌచ్ వ్యవహారాల్లో అమ్మాయిల నిర్ణయమే కీలకమని, ఏకపక్షంగా జరిగే వ్యవహారం కాదని ఆమె స్పష్టం చేశారు. ఇది ఒక్క సినిమా రంగానికే సంబంధించిన వ్యవహారమే కాదని, యావత్ సమాజానికి సంబంధించిందని పేర్కొన్నారు. రాజకీయ పక్షాలలో మహిళా నాయకులు సహితం ఇటువంటి దారుణమైన వేధింపులను ఎదుర్కొం టున్నారు.

పోలీస్, సైన్యం వంటి యూనిఫామ్ వ్యవస్థలలో సహితం సాధా

రణంగా మారుతున్నది. ముఖ్యంగా వారాల తరబడి కుటుంబాలను వదిలివేసి, తుపాకులు పట్టుకొని విధులకు హాజరవుతూ ఉండే సైనికులు, ప్రత్యేక పోలీస్ దళాల కుటుంబాలలోని మహిళలను వారి క్యాంపులలో గల సీనియర్ అధికారులు లైంగిక వేధింపులకు గురిచేయడం జరుగుతున్నది. అయితే సాధారణంగా ఎవ్వరూ ఫిర్యాదు చేసే ధైర్యం చేయడం లేదు.

క్యాస్టింగ్ కౌచ్ వ్యవహారంపై బాలీవుడ్ కొరియోగ్రాఫర్ సరోజ్ ఖాన్ వ్యాఖ్యలను సమర్ధిస్తూ మాజీ కేంద్రమంత్రి రేణుక చౌదరి క్యాస్టింగ్ కౌచ్ అనేది ఒక ఫిల్మ్ ఇండస్ట్రీకి సంబంధించిన అంశం మాత్రమే కాదు అని, అలాంటివి అన్ని చోట్లా జరుగుతుంటాయని, ఇది చేదు వాస్తమని స్పష్టం చేశారు. పార్లమెంట్ లేదా ఇతర పని ప్రాంతాల్లో వేధింపులు ఉండవన్న అభిప్రాయం సరికాదు అని చెప్పారు. క్యాస్టింగ్ కౌచ్ లాంటి వాటికి వ్యతిరేకంగా దేశవ్యాప్త ఉద్యమం రావాలని, దానికి వ్యతిరేకంగా పోరాడాలని ఆమె సూచించారు. హాలీవుడ్‌లో సాగుతున్న 'మీ టూ' ప్రచారం తరహాలో బాధితులు పోరాడాలని పిలుపిచ్చారు.

గత సంవత్సరం టాలీవుడ్‌లో అనేకమంది ప్రముఖులు మత్తు పదార్థాల వినియోగం, సరఫరా, అమ్మకాలలో సంబంధం ఉన్నట్లు పెద్ద ఎత్తున ఆరోపణలు వచ్చాయి. కొద్దిమంది ప్రముఖులను పిలిపించి రోజంతా విచారణలు జరిపారు. మరో కొంతమంది ప్రముఖులు, వారి కుమారులు సహితం ఈ రాకెట్‌లో ఉన్నారని, వారిని కూడా విచారణకు పిలిపిస్తున్నామని అంటూ ఉన్నతాధికారులు ప్రకటనలు ఇచ్చారు. దానితో ఖంగారు పడిన సినీ ప్రముఖులు రంగప్రవేశం చేసి, ప్రభుత్వంలోని పెద్దలతో లోపాయికారి అవగాహన కుదుర్చుకొని తమ వారెవ్వరిపై కేసులు లేకుండా చేసుకో గలిగారు.

ఏది ఏమైనా టాలీవుడ్‌లో పలువురు ప్రముఖులు పలు అసాంఘిక, నేరమయ చర్యలకు పాల్పడుతున్నట్లు మాత్రం అల్లరి అయింది. ఇప్పుడు 'క్యాస్టింగ్ కౌచ్' సహితం అటువంటిదే. ఇదంతా బహిరంగ రహస్యంగానే సినీ పరిశ్రమలో సాగుతున్నది. సీనియర్‌ల షూటింగ్‌ల సమయంలో అనేకమంది తారలు లైంగికంగా లొంగుబాటు కాని పక్షంలో వారికి అవకాశాలు రావడం కష్టం అనే ప్రచారం కూడా సాగుతున్నది. పరిశ్రమలోని కొందరు ప్రముఖులు, మహిళలు సహా 'అక్రమ మానవ రవాణా'లో భాగస్వాములుగా ఉన్నట్లు కూడా ఆరోపణలు చెలరేగుతున్నాయి.

టాలీవుడ్‌లో చాలామంది హీరోలు కొద్దిమంది పాతుకుపోయిన నిర్మాతల కుటుంబాలకు చెందిన వారు కావడం, ముఖ్యంగా నాలుగు కుటుంబాలు తెలుగు రాష్ట్రాలలోని సినీ థియేటర్లపై ఆధిపత్యం కూడా వహిస్తూ ఉండటం, వారిని కాదని మరెవ్వరూ తమ సినిమాలను విడుదల కూడా చేయించుకోలేని దుస్థితి నెలకొంది. దానితో వారి ముందు 'దాసోహం' అయితే తప్ప ఈ పరిశ్రమలో తమకు మనుగడ లేదని చాలామంది భావిస్తున్నారు.

లైంగిక వేధింపుల గురించి ఈ మధ్య కాలంలో ఇలియానా, రాధికా ఆప్టే, తాప్సి, మాధవి లత, గాయత్రీ గుప్త వంటి వారు కూడా ప్రస్తావించడం తెలిసిందే. లైంగికంగా లొంగుబాటు కాని పక్షంలో తమకు నటించే అవకాశాలు కూడా జారిపోతున్నట్లు పేర్కొన్నారు. లైంగికంగా లొంగినా వాడుకొని వదిలి వేస్తున్నారు గాని అవకాశాలు ఇవ్వడం లేదని శ్రీరెడ్డి వంటి వారు వాపోతున్నారు.

ఇటువంటి సమస్యల గురించి చర్చించే సాహసం కూడా 'మా' చేయక పోవడం గమనార్హం. 'ఫిర్యాదులు ఇస్తే విచారణ జరిపిస్తాం' అనడమే గాని ఇప్పటికే తాము బాధితులమని పలువురు బహిరంగంగా ఆవేదన వ్యక్తం చేసినా ఆయా అంశాలను పరిగణనలోకి తీసుకొనే ధైర్యం వీరిలో ఎవ్వరికీ ఉన్నట్లు లేదు. పవన్ కళ్యాణ్, అల్లు అరవింద్ వంటి వారు తమ కుటుంబ సభ్యులతో 'మా' కార్యాలయంపై దాదాపు 'దాడి' చేసిన రీతిలో వచ్చి నిప్పులు చెరిగినా వారిని ప్రశ్నించే ధైర్యం వీరికి లేకపోయింది.

ఈ సందర్భంగా మీడియాపై దాడులు జరిగితే జర్నలిస్ట్ సంఘాలు నిరసనలు తెలపడమే గాని 'మా' కార్యాలయం ముందు ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడడానికి కారకులైన వారిపై తగు చర్యలు తీసుకుంటామని టాలీవుడ్ ప్రముఖులు ఎవ్వరూ నోరు విప్పకపోవడం గమనార్హం. పైగా ఈ రొచ్చులోకి కుల రాజకీయాలను జొప్పించి అసలు సమస్యల నుండి ప్రజల దృష్టి మళ్లించే ప్రయత్నాన్ని తెలివిగా చేస్తున్నారు.

'ఖాప్ పంచాయత్' తరహాలో శ్రీరెడ్డిపై నిముషాలలో 'నిషేధం' విధించిన 'మా' తమ సభ్యులే పాల్పడుతున్న దురాగతాలు గురించి నోరు విప్పే ధైర్యం చేయడం లేదు. టాలీవుడ్ లో పెత్తనం చేస్తున్న కుటుంబాల 'నేరమయ' చర్యలకు మద్దతు ఇవ్వడంలో చూపే ఉత్సాహం మహిళా కళాకారుల ఆవేదన పట్ల చూపడం లేదు.

**శ్రీరెడ్డి పోరాటంలో తప్పొప్పులను అట్లా ఉంచితే, ఈ పరిశ్రమలో నెలకొన్న దారుణమైన నేరమయ ప్రవర్తనను ఆమె వెలుగులోకి తీసుకు వచ్చారనడంలో సందేహం లేదు. రాజకీయ పక్షాలు, వాటికి అనుబంధంగా ఉన్న మహిళా సంఘాలు సహితం ఈ సమస్యపై మౌనం వహించడం గమనార్హం. ఈ సమస్యను రాజకీయ వివాదంగా మలచే ప్రయత్నం పట్ల చూపుతున్న ఆసక్తిని మహిళల గౌరవంకు సంబంధించిన తీవ్రమైన సంక్షోభకర పరిస్థితిగా గుర్తించడానికి నిరాకరిస్తున్నారు.**

**పైగా ఈ పరిశ్రమలో దళారులుగా వ్యవహరిస్తున్న బ్రోకర్లు, మేనేజర్లు, కోఆర్డినేటర్లు తమను ఏవిధంగా వంచిస్తున్నారో కూడా పలువురు బహిరంగంగా వచ్చి మొరపెట్టుకొంటున్నా అటు పోలీస్-ప్రభుత్వ వర్గాలు గాని, పరిశ్రమలోని పెద్దలు గాని అసలు స్పందించడమే లేదు. కనీసం వారి ఆవేదనను అయినా 'ఫిర్యాదు'గా స్వీకరించి లోతయిన దర్యాప్తు చేపట్టే ప్రయత్నం పోలీస్ వర్గాలు చేయడం లేదు. ఈ సందర్భంగా తెలుగు చిత్ర పరిశ్రమ ఇటువంటి ఆరోపణలపై విచారణకు అంతర్గతంగా ఒక కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు చేసిన ప్రకటన వల్లన ఒరిగెడిది ఏమీ కనిపించడం లేదు.**

వినియోగించే కొద్దీ భాష వికసిస్తుంది

డా॥ఈమని శివనాగిరెడ్డి – స్థపతి
9848598446

# రాష్ట్రకూటుల సామంతులు

రాష్ట్రకూటుల రాజులతో పాటు, రాణులు, సామంతులు, ఉన్నతోద్యోగులు కూడా వారి ఔన్నత్యం, గుణగణాలను బట్టి బిరుదులను ధరించారు. శీల మహాదేవి (ధృవునిభార్య) కు **పరమభట్టారిక**, (శ్రేష్టమైన, పరమ పూజ్యనీయమైన) విష్ణు ఆరాధకురాలు అనీ, **పరమేశ్వరి** (బహుళ శ్రేష్టమైన, పార్వతి స్వరూపిణి) అనే బిరుదులున్నాయి. పల్లవదేవబ్బరసికి వాగ్దేవి, వాగ్మి, అనీ, సామి నిర్మడికి **సర్వశాస్త్ర ప్రసిద్ధి** అనే బిరుదు, **వినయాంబుధి** (కృష్ణుని భార్య) కి **మహా శ్రీమతి** అన్న బిరుదులున్నాయి.

మంత్రులు, సామంతుల బిరుదులు :

పల్లవాధిరాజు (గోవిందుని సామంతుడు)కి సమస్త భువన విఖ్యాత, **పృధ్వీ వల్లభ** అనే బిరుదులున్నాయి. అమోఘవర్షుని సేనాధిపతి దేవణయ్యకు **అతిశయధవళ** (పరిశుద్ధుడు), **లట్టలూర పురవరేశ్వర, లక్ష్మీ వల్లభేంద్ర, శిష్ట జనాశ్రయ, సత్యసౌచ చారిత్ర సంపన్న** అనే బిరుదులను ధరించాడు. అమోఘ వర్షుని మరో మంత్రి బంకెయరసకు **చెల్లికేతన, ప్రచండ మండలాతంశ, విజయ లక్ష్మీ నివాసితే', సత్యసమర** అనే బిరుదులున్నాయి. అమోఘ వర్షునికి, రెండో కృష్ణునికి మహామంత్రి అయిన కుప్పయరసకు, **ఆహవకళిగళాదిత్య దండిన గోవ, ప్రచండ మండళాగ్ర ఖండిత రాతి మణ్ణల, ప్రతాప సంపన్న, మహా సామంత, యాదవ వంశ ధృవ, రణముఖ ధవళ, షడ్గుణాలంకార** అన్న బిరుదులున్నాయి.

బంకియరస కుమారుడు, రెండో కృష్ణుని సామంతుడైన లోకటింరసకు **చల్లపతాక, మహా సామరత, స్వస్తి సమధిగత పంచ మహాశబ్ద** అనే బిరుదులున్నాయి. రెండో కృష్ణుని సామంతుడైన కలి విట్టరసకు **చండమార్తాండ, చల్ల ధ్వజ, రణమత్తరంగ, వైరికాలానల** అనే బిరుదులు గలవు.

రెండో ఇంద్రుని దండనాయకుడు అయిన శ్రీ విజయునికి **అరివంగోజి, అనుపమ కవి, ఆశ్రిత కల్పవృక్ష, ఇంద్ర శాసన సంరక్షకుడు, దండిన బీర** (యుద్ధ వీరుడు), **శ్రీగోగ్గిజ్ఞ, సర్వ విక్రమతుంగ**, అనే బిరుదులున్నాయి. రెండో ఇంద్రుని సామంతుడైన లెంటియారసకు **అపూర్వ కుసుమాయుధ, ఉన్నతాదిత్య, అభిమాన సత్యకి** అనే బిరుదులు, బిజ్జనుకి, **స్వస్తి సమధిగత పంచమహా శబ్ద** అనే బిరుదు, కొల్లిహాక బనవాసి పాలకుడైన శంకరగండకు అభిమాన ధవళజయ రాష్ట్ర కూటుల్లో మేరు పర్వతంలాంటి వాడు), **రాజభూరిస్త్రవ విద్విష్ట నారాయణ, సత్యార్ణవ, స్వస్తి సమధిగత** పంచ మహాశబ్ద, అనే బిరుదులున్నాయి.


కురుతో రామ శెట్టికి వైశ్య కుల తిలక, రెండో కృష్ణుని కాలంలో బనవాసి మహాసామంతుడైన మంచి యరసకు, **అ కళంకవీర, త్రికుంద మరవరేశ్వరీ, నందనవనచిత్ర, మాటూరవంశోద్భవ, విజయంగర, విజయలక్ష్మీ వల్లభ, విశిష్ట జనమిత్ర, స్వస్తి సమధిగత పంచ మహాశబ్ద, హయలాంఛనదర్పణ ధ్వజ విరాజమాన** అనే బిరుదులున్నాయి. రెండో కృష్ణుని మరో సామంతుడైన బుట్టరసకు, **ద్రోహకాలానల విశిష్ట జనవత్సల, వీరభూరిశ్రవన, హతభద్రాంకుశ, సమరధనంజయ, స్వస్తి సమధిగత పంచమహాశబ్ద, అనే బిరుదులు, మహా సామంతుడైన కత్యరునికి, చాళుక్య వంశోద్ధర, కుదరవీడంగ** (అశ్వ సవారీలో ప్రావీణ్య మున్నవాడు), **మహా సామంత, విద్విష్ట మార్తాండ, స్వస్తి సమధిగత పంచ మహాశబ్ద**, అనే బిరుదులున్నాయి. కలివిట్టరస అనే మంత్రికి చల్ల కేతన వంశోద్భవ, మహా సామంత స్వస్తి సమధిగత పంచమహాశబ్ద అనే బిరుదులు, వేములవాడ చాళుక్య రాజైన రెండో అరికేసరి (ఆదికవి పంపనికి **ఆశ్రయదాత్రకి, అకళంకరామ, అమ్మిన గంధ వారణ, ఆ రూఢ సర్వజ్ఞ, ఉదాత్తనారాయణ, గుణ నిధి, వినయ భూషణ, గుణార్ణవ, చాళుక్య వంశోద్భవ, జగదేకమల్లి, త్రిభువనమల్ల, పడమిచ్చిగండ, పరసైన్యభైరవ, పరాక్రమిదదళ ప్రత్యక్ష దావళి, మహా సామంతాధిపతి, రిపు శురంగ్గ కంఠీరవ** (శతృవులనే జింకలకు సింహంలాంటివాడు), **విక్రమార్జున, విశ్రాంత తుంగ, విద్విష్ట, విద్రావణ, శరణాగత జలనిధి, శౌచాంజనేయ, సమరైక మేరు, సామంత చూదామణి, సాహసాభరణ**, అనే బిరుదు లున్నాయి.

రెండో కృష్ణుని మహా సామంతుడైన రొట్టయ్యకు **కృతయుగగళ్ళ, మరో సామంతకు, శౌచార్ణవ** అన్న బిరుదులు, రెండో కృష్ణుని మరో మహా సామంతుడైన దోరపయ్యకు, **ఆ రూఢ సర్వజ్ఞ**, (ఏనుగు, గుర్రాలున్న వాహన సవారీలో దిట్ట), **ఆశ్రితజన కల్పవృక్ష చాళుక్య నారాయణ, పగ పరాంకుశ మహా సామంత, శౌచాంజనేయ, సమర త్రినేత్ర, సాహస భీమ** అనే బిరుదులున్నాయి. పందయ్య అనే మరో మహా సామంతునికి, **ద్రోహరచూలి, సామంత సర్వజ్ఞ, అనే బిరుదులు, గంగ పెర్మాడికి, కౌతాళాపుర వరాధీశ్వర, కొంగుణీ వర్మ ధర్మ మహారాజు, నందగిరి నాథ, సత్యవాక్య** అనే బిరుదులు, సూద్రకయ్యకు, **మహా సామంత** బిరుదం, రెండో కర్కుని సామంతుడైన శాంతి వర్మకు **త్రికుంద పురవరేశ్వర, మాంటూరి వంశోద్భవ విక్రమ సింహ, వైరి మార్తాండ, సుభట చూదామణి అనే బిరుదులున్నాయి. భీమరాజుకు, అనేక సమర సంఘట కలియుగ త్రినేత్ర, కలియుగ రామ, చలమర్తిగండ, మహా మండలేశ్వర, వైదుంభా భరణ** అనే బిరుదులు జిన వల్లభునికి **గుణ పక్షపాతి, భవ్య రత్నాకర, సకల కళాలాప ప్రవీణ** అనే బిరుదులున్నాయి.

యతులు, కవుల బిరుదులు :

శ్రీ వీరనంది సిద్ధాంతిక చక్రవర్తికి **శ్రీకుంద కుందాన్వయాంబర ద్యుమణి, ఎద్వజ్జనశిరోమణి, సమస్తానవద్య విద్యా విలాసిని, విలాస మూర్తి**, అనే బిరుదులు, పంపనికి **కవితా గుణార్ణవ, నాడోజ, పురాణ కవి, సంసార సారోదయ, సరస్వతీ మణిహార్ద, సుకవి మనో మానసోత్తంస హంస** అనే బిరుదులున్నాయి.


**పాఠశాల విద్యలో మాతృభాషే మాధ్యమంగా ఉండాలి**




డా॥ కత్తి పద్మారావు తాజా రచన
**భారత రాజకీయాలు - అంబేద్కర్ దృక్పథం**
980 పుటలు : రు. 1000/-

ప్రతులకు
కత్తి స్వర్ణ కుమారి, లోకాయుత ప్రచురణలు, లుంబినీ వనం
అంబేద్కర్ కాలనీ, పొన్నూరు - 522124, గుంటూరు జిల్లా.
విశాలాంధ్ర, ప్రజాశక్తి, నవోదయ, నవ చేతన, నవ తెలంగాణ
తదితర పుస్తకాల విక్రేతల వద్ద కూడా లభించును.

సాహిత్య విమర్శ, పరిశోధన గ్రంథాలకు
**రాచపాళెం పీఠికలు**
సంకలనం : డా॥ తన్నీరు నాగేంద్ర
200 పుటలు : రు. 150/-




ప్రతులకు
డా॥ టి నాగేంద్ర, పాల్యం (గ్రామం & పోస్టు)
పమిడి (మండలం)
అనంతపురం (జిల్లా)
సెల్ : 9949344032


## కవిత నాకు మాత్రం తెలీదా!!

నైరాస్యం.. ఆకాశం నడుముకు చుట్టుకున్న
నీలి కోకలా నన్నులుముకుంది..
నిస్తేజం...అంబరం వైపు చేతులు చాచిన తరువు
మూగపిలుపులా నన్ను హత్తుకుంది..
నిన్నో మొన్నో వేలు పట్టుకు నడిచిన జ్ఞాపకం
నలిగిన కాగితమై మూలన మూల్గుతోంది..
వెక్కి వెక్కి ఏడ్చి భుజంపైకెక్కి తొక్కిన ఆట...
వెలిసిన వానకు మిగిలిన మట్టివాసనై చుట్టూ పరుచుకుంది..
క్షణానికోసారి కన్ను తుడవడం చేతికి భారమైందేమో...
గుండెని తడమాలని తపిస్తోంది...
కొండమీద కోతినో...అన్నం ముద్దకై చందమామ
వెండి జలతారునో...ప్రేమ దారాలతో కట్టి తెచ్చిచ్చిన వైనం...
ఇప్పుడు మాటల రాళ్ళకు ముక్కలవుతోంది...
నిలబెట్టి కడిగేయాలనున్న గేయం
తనకుతానే గాయం చేసుకుని మ్రాన్పడిపోయింది..
ఓ నిశ్శబ్ద సంగీత తీతువు ...
నింగి నుంచి జారి నను నిమిరిపోయింది...
ఒంటరి పక్షై మసక వెలుతురుని చేతికి తీసి తుడుచుకుంటూ...
తోడొచ్చిన మూడో కాలుతో..ముచ్చటిస్తూ..
ముందుకెళుతున్నా...
నడకనేర్పిన నాకు నడవడం తెలీదా..?

కరణం కళ్యాణ్ కృష్ణ కుమార్
9848428978

## కవిత అమ్మభాష అమృతం

అమ్మను మింగేసినదీ ఆంగ్లభాష
అమ్మ బంధాలను తెంచినదీ ఎంగిలి భాష
కడుపారా అమ్మా అని పిలువాలెరా
కమ్మని అమ్మభాష అమృతాన్ని జుర్రాలెరా

మమ్మీయను శవ పేటిక మనకెందుకురా
మనదికాని డాడీయని పిలువబోకురా
అమ్మ అంటేనే తేనె తెలుగు తీయదనమురా
బాపూయను పిలుపు బ్రతుకు దారి చూపురా

టాటా బైబైలు గుడ్ నైటులింక మానరా
శుభోదయం శుభరాత్రి వీడ్కోలని చెప్పరా
అమ్మలాగ ఒడి చేర్చే తెలుగు భాష ముద్దుర
అమ్మ ప్రేమను పంచే తెలుగు భాషకేది హద్దురా

తెలుగే ప్రతి హృదయానికి ఉదయమవునురా
తెలుగే మన సంస్కృతికీ ఆనవాళ్లురా
అమ్మభాష తెలుగును రక్షించుకొనుట మన ధర్మం
వేనోళ్ళ కీర్తించబడుట తెలుగు భాష మర్మము

బ్రతుకు దెరువు దారులకై పర భాషలు నేర్చుకో
బ్రతుకులోన అమ్మభాష తెలుగు నాచరించుకో
తెలుగంటే తేజస్సు లోకానికి తొలి ఉషస్సు
తెలుగోడిగ పుట్టాలని చెయ్యాలిక తపస్సు

వడ్లాల కిషన్
9866702382

Owned, printed & published by Samala Lakshmana Babu (9440448244) and printed at Sri Mahalakshmi Offset Printers, 16-7-20, Veera Raghavulu Street, Sharabu Bazaar, Tenali, Guntur Dist. and published from 8-386, Jivaka Bhawan, Angalakuduru Post, Tenali Mandal, Guntur Dist. - 522211. Editor: Dr. SAMALA RAMESH BABU (9848016136), RNI-APTEL/2015/62362

# చెన్నైలో ఏప్రిల్ 14న జరిగిన తెలుగుభాషోద్యమ సదస్సు




ప్రసంగిస్తున్న ముఖ్య అతిథి డా॥ సామల రమేష్‌బాబు, చిత్రంలో అఖిలభారత తెలుగు సమాఖ్య అధ్యక్షులు డా॥ సిఎంకె రెడ్డి
ఆంధ్రాక్లబ్ సంయుక్తకార్యదర్శి శ్రీజె.కె.రెడ్డి, విశిష్ట అతిథి గట్టింమాణిక్యాలరావు,
సభాధ్యక్షులు ఎం.రామరాజు, నిర్వాహకులు పి.కన్నయ్య తదితరులు (వార్త వివరాలు లోపలి పుటల్లో)

# కరీంనగర్‌లో ఏప్రిల్ 18న జరిగిన తెలుగుభాషా సదస్సు






మాట్లాడుతున్న ఆచార్య గారపాటిఉమామహేశ్వరరావు, డా॥నలిమెల భాస్కర్, షేక్‌రహమానుద్దీన్, డా॥కె.ముత్యం
గంద్రలక్ష్మణరావు, నాగేంద్రశర్మ, భద్రయ్య, సబ్బనిలక్ష్మీనారాయణ, మొదలగువారు

అమ్మనుడి తెలుగుజాతి పత్రిక
AMMANUDI (Telugu Monthly
May 2018 Vol : 4, Issue 3
Date of publication : 1st of every month
Date of posting : 3rd & 6th of every month
RNI-APTEL / 2015/62362
Postal Reg NO. TEN/13/2018-20


# ది కాకతీయ కో-ఆపరేటివ్ సొసైటీ (లి) తెనాలి

Regd. No. A.M.C./G.N.T./D.C.O./2001/532 స్థాపితం : 2001

హెడ్ ఆఫీస్ : కొత్తపేట, **తెనాలి** – 522 201. గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్

ఫోన్ : 08644 – 235671, 235672

బ్రాంచి ఆఫీసులు :

1) **అంగలకుదురు** ఫోన్ : 08644 – 233299
2) **కొల్లూరు** ఫోన్ : 08644 – 243788
3) **బాపట్ల** ఫోన్ : 08643 – 224051
4) **కొల్లిపర** ఫోన్ : 08644 – 245399
5) **రేపల్లె** ఫోన్ : 08648 – 222388

## ఖాతాదారులకు మా సేవలు

3 సం॥ల డిపాజిట్స్‌పై యితర బ్యాంకులకన్నా అత్యధిక వడ్డీ **9.5%**

సీనియర్ సిటిజన్స్‌తో పాటు 58 సంవత్సరాలకు రిటైరయిన ప్రభుత్వోద్యోగులకు 55 సంవత్సరాలు నిండిన మహిళలకు ఒక 3 సం॥లు, ఆపై కాలపు డిపాజిట్స్‌కు ఒక శాతం అదనపు వడ్డీతో } **10.5%**

ప్రతిరోజూ తక్కువ వడ్డీకే తక్షణం మంజూరయ్యే 'గోల్డులోన్స్' పై వడ్డీ –**12%**

ఇళ్ళు, ఇళ్ళ స్థలాల హామీపైన, వ్యక్తిగత జామీను పైన **15%** వడ్డీతో అప్పులివ్వబడును.

నెలవారీ రికరింగ్ డిపాజిట్స్ సదుపాయం కలదు
చిన్న మొత్తాల పొదుపు పథకం – డైలీ డిపాజిట్

**లాకర్స్ సదుపాయం కలదు**

సెక్రెటరీ : కనమర్లపూడి ఝాన్సీలక్ష్మి, చరవాణి : 93478 96473



### పాలక మండలి

శ్రీ దావులూరి లక్ష్మీకాంతారావు, అధ్యక్షులు
శ్రీ గ్రంథి చంద్రమౌళీశ్వరరావు, ఉపాధ్యక్షులు
శ్రీ చిరుమామిళ్ళ రవీంద్రబాబు, డైరెక్టర్
శ్రీ కఠారి వాసుదేవనాయుడు, డైరెక్టర్
శ్రీ వేదాంతం సుబ్రహ్మణ్యశాస్త్రి, డైరెక్టర్
శ్రీ గెడ్డటి బాబూరావు, డైరెక్టర్
శ్రీ ఎ. పోతురాజు, డైరెక్టర్
శ్రీ షేక్ ఖలీల్, డైరెక్టర్
శ్రీ యడ్లపాటి విజయరంగనాథ్, డైరెక్టర్
శ్రీ పి.ఎస్.ఆర్. బ్రహ్మాచార్యులు, డైరెక్టర్



వ్యవస్థాపక అధ్యక్షులు :
కీ॥శే॥ దావులూరి సోమశేఖరరావు

అధ్యక్షులు :
శ్రీ దావులూరి లక్ష్మీకాంతారావు

**ది కాకతీయ కో-ఆపరేటివ్ సొసైటీలో సభ్యులుగా చేరండి.**
**డిపాజిట్స్ చేయండి – అధిక లాభం, విలువైన సేవలు పొందండి.**


if not deliverd, please return to : 'The publisher, AMMANUDI Monthly,
8-386, Jivaka Bhavanam,ANGALAKUDURU (po),TENALI-522 211,Guntur (dt) A.P. Cell:9440 448244